# జనబలం

ప్రజలే ప్రభువులు

మార్చి 2023 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-




అధికార కేంద్రీకరణ మామూలు అనుకుంటున్నాం




అదానీ ఎపిసోడ్‌లో అసలు పాఠాలు



మధ్య తరగతి సంఖ్య పెంచుదాం.. అభివృద్ధి చెందిన భారతదేశం అవుదాం



# #Ask JP

Now be expanding to English









## హేతుబద్ధత, వాస్తవాలు, ప్రపంచ అనుభవాలు, పరిష్కారం ప్రాతిపదికన ఆలోచించండి.. విద్యాసదస్సులో జేపీ

మన వద్ద రాయి వేస్తే ఓ విద్యాసంస్థ కనిపిస్తుందని.. ఎటుచూసినా విద్యాసంస్థలున్నా విద్య మాత్రం అందటం లేదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. 'నాణ్యతకు నోచుకోని చదువులెందుకు?' అంశంపై సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, వికాస విద్యా సంస్థ విజయవాడలో సంయుక్తంగా నిర్వహించిన విద్యాసదస్సులో జేపీ ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి స్కూలు విద్యార్థి మీదా ప్రభుత్వం ఏడాదికి రూ.91,270 ఖర్చు చేస్తున్నా విద్యాప్రమాణాలు లేవని 'అసర్' తాజా నివేదికలో కూడా తేలిందని జేపీ పేర్కొన్నారు. అసర్ నివేదిక చాలా సాధారణ ప్రశ్నలతో రూపొందించిన సర్వే అని, ఆ స్థాయిలో కూడా మన విద్య అధ్వాన్నంగా ఉందన్నారు. ప్రభుత్వం స్వయంగా నిర్వహించిన జాతీయ ఎచీవ్‌మెంట్ సర్వేలో కూడా ఇవే ఫలితాలు వచ్చాయని, విద్యార్థికి వచ్చిన మార్కులకి-తరగతి అభ్యసన స్థాయికి మధ్య అంతరం 8 నుంచి 10 రెట్లు దాకా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రయివేటు స్కూళ్లు కొద్దిగా మెరుగ్గా ఉన్నా, అక్కడా సరైన చదువు అందటం లేదన్నారు.

సమాజంలో విద్యకు డిమాండ్ ఉంది, పిల్లల్ని చదివించటానికి తల్లిదండ్రులు ఎంతటి త్యాగాలైనా చేస్తున్నారు, టీచర్లకు జీతాలు బ్రహ్మాండంగా ఉన్నాయి.. ఎందుకు చదువు అందటం లేదో మనం అంతర్మథనం చెందాలని జేపీ అన్నారు. హేతుబద్ధత, వాస్తవాలు, ప్రపంచ అనుభవాలు, పరిష్కారం ప్రాతిపదికన ఆలోచించాలన్నారు. ఇటీవల వచ్చిన జాతీయ విద్యావిధానం కొంత ఆశాజనకంగా ఉందని, అయితే ఇంకా కాగితాల మీదే ఉందన్నారు. కేవలం ప్రభుత్వాలకు వదిలేయకుండా ఈ విధానం అమలును మనమందరం పట్టించుకోవాలన్నారు. విద్యలో సక్సెస్‌కి నిర్వచనం మార్చాలన్నారు. బట్టీపట్టటం, కాపీ కొట్టటం కాకుండా.. కాన్సెప్టుల్ని ఆకళింపు చేసుకుని జీవితానికి అన్వయించటం, సమస్యల్ని పరిష్కరించటం, కొత్త విషయాల్ని ఆవిష్కరించటం వంటి సామర్థ్యాల్ని పెంపొందించేలా బోధన ఉండాలన్నారు. పరీక్షలు, మార్కులు, ర్యాంకుల చుట్టూ కాకుండా విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను బేరీజు వేసేలా ఉండాలన్నారు.

సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు సీహెచ్ నాగేశ్వరరావు సభకు సారథ్యం వహించగా, వికాస విద్యా సంస్థ సంస్థాపకుడు ఎస్.ఆర్ పరిమి నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజలే ప్రభువులు

# జనబలం


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 25 | 3 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| మార్చి 2023 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్





కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

# డిజిటల్ యుగంలోనూ జండర్ వివక్ష సవాళ్ళు

సంపాదకీయం

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొలదీ అసమానతలు కొత్త కొత్త రూపాల్లో తలెత్తుతున్నాయని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. డిజిటల్ విప్లవం మహిళల పట్ల వివక్షని కొనసాగిస్తోందని, పర్యవసానంగా రానున్న కాలంలో అసమానతలు మరింతగా పెరిగిపోతాయని ఐరాస హెచ్చరించింది. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల స్థితిగతులపై అంతర్జాతీయ కమిషన్ 67వ సదస్సు ఐరాస కేంద్ర కార్యాలయంలో 12 రోజుల పాటు జరపాలని తలపెట్టింది. డిజిటల్ యుగంలో మహిళలు ఎదుర్కుంటున్న సమస్యలపై సదస్సు చర్చించనున్నది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐరాస ప్రతి ఏటా ఒక్కొక్క అంశాన్ని ముందుకు తెస్తూ ఉంటుంది. 2023వ సంవత్సరానికి 'డిజిట్-ఆల్-జండర్ సమానత కోసం ఆవిష్కరణలు, సాంకేతికత నినాదాన్ని ఐరాస ప్రతిపాదించింది. డిజిటల్ అంతరాల సమస్యను ప్రాచుర్యంలోకి తేవాలని సంకల్పించింది. అన్ని రంగాలలోనూ మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం, మహిళలకు హక్కులను అమలు చేయడం, మహిళలపై జరుగుతున్న హింసను, దోపిడీని అంతం చేయడం లక్ష్యంగా ప్రపంచ సమాజం కృషి సాగించేందుకు మహిళా ఉద్యమం పోరాడుతోంది. మహిళలకు సురక్షితమైన, సుస్థిరమైన, సమానత్వంతో కూడిన భవిష్యత్తును అందించాలని ప్రపంచవ్యాప్తంగా మహిళలు వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నారు. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం ' ఒక ఉద్యమంగా ఆరంభమై నూట పదిహేను సంవత్సరాలు పూర్తయ్యింది.

అయితే మహిళలు ఇంకా వివక్షని, అంతరాలను, అవరోధాలనూ ఎదుర్కుంటూనే ఉన్నారని ఐరాస పేర్కొన్నది. ప్రపంచంలో నానాటికీ ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాలు పెరిగిపోతున్న తరుణంలో శాస్త్ర, సాంకేతిక విప్లవం వచ్చింది. సాంకేతిక అవకాశాలు అపారంగా పెరిగాయి. డిజిటల్ కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో విద్య, ఉద్యోగాలు, ఉపాధి లభిస్తున్నాయి. అత్యధిక ఆదాయాన్నిచ్చే సాంకేతిక ఉద్యోగాలు పెరిగాయి. అయితే డిజిటల్ యుగంలో సైతం మహిళలపై వివక్ష కొనసాగుతోంది. మహిళా హక్కులపై కొత్తరూపాల్లో దాడి జరుగుతోంది. మహిళల శ్రేయస్సుకు, భద్రతకు భంగం కలుగుతోంది.

డిజిటల్ సేవలను వినియోగించుకోవడంలో మహిళలు ఇంకా వెనుకబడే ఉంటున్నారని పలు అధ్యయనాలు వెల్లడించాయి. డిజిటల్ సాంకేతికతను అంది పుచ్చుకోవడంలో స్త్రీ, పురుష అంతరాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. మొబైల్ వినియోగం పురుషుల్లో 70 శాతం ఉండగా.. మహిళల్లో 30 శాతం మాత్రమే ఉన్నారు. బ్రాడ్ బాండ్ సిగ్నల్ అందుతున్న పురుషులు 52శాతం కాగా.. మహిళలు 25 శాతం మాత్రమే ఉన్నారు. డిజిటల్ వివక్ష కొనసాగడంలో జాతి, రంగు, మతం, ప్రాంతం, వయసు, అంగవైకల్యం, సామాజిక, ఆర్థిక హోదా వంటి అంశాలన్నీ మహిళలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు.. శాస్త్ర, సాంకేతిక, ఇంజనీరింగు విద్యను పొందుతున్న వారిలో మహిళా పట్టభద్రుల సంఖ్య 28 శాతం మాత్రమే ఉంది. కృత్రిమ మేధో రంగంలో పాల్గొంటున్న మహిళలు 22శాతం కాగా, సాంకేతికరంగ ఉద్యోగాలలో మహిళలు 32 శాతం మాత్రమే ఉన్నారు. సాంకేతిక జ్ఞానసృజనలో, ఆవిష్కరణలలో, వినియోగంలో, నియంత్రణలో మహిళల పాత్ర తగినంతగా లేదని గణాంకాలు చెబుతున్నాయి. అందువల్లనే శాస్త్ర, సాంకేతికరంగంలో మహిళల అవసరాలకు చోటులేకుండా పోయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రూపొందించిన 133 సిస్టమ్స్ అందుబాటులోకి రాగా అందులో 44.2 శాతం సిస్టమ్స్‌లో 'జండర్ వివక్ష' ఉన్నట్లుగా తేలింది. దాంతో సమాన అవకాశాలు పొందేందుకు బాలికలకు, మహిళలకు వీలు కుదరడం లేదు. దీని పర్యవసానం మరింతగా మహిళలకు వ్యతిరేకంగా తయారయ్యే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంకేతిక పురోభివృద్ధిలో, పరిశోధనల్లో, ఆవిష్కరణల్లో, పెట్టుబడుల్లో, విధాన నిర్ణయాలలో మహిళల పాత్ర పరిమితం అవుతుంది. అంతిమంగా భవిష్యత్తులో వివక్ష తీవ్ర స్థాయికి చేరుకునే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

ఇక ఆన్‌లైన్ వేధింపులు ఒక తీవ్ర సమస్యగా తయారయ్యింది. మహిళలు తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, సంఘటితం కావడానికి వేదికగా వినియోగపడాల్సిన సోషల్ మీడియా వారికి కొత్త ప్రమాదాలను తెచ్చిపెట్టింది. సమాచారాన్ని తొక్కి పెట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, విద్వేషపూరితంగా మహిళలపై కొనసాగుతున్న మాటల దాడి, వేధింపులు సమస్యలుగా మారిపోయాయి.

వర్చ్యువల్ రంగంలో తలెత్తిన 'జండర్ హింస మానసిక, లైంగిక, సాంఘిక, రాజకీయ హింసగా ప్రత్యక్షం అవుతున్నది. ఆన్‌లైన్ నుండి లాగ్ ఆఫ్ అయ్యాక సైతం మహిళలకు హింస తప్పడం లేదు. మహిళలు ఏ రంగంలో ఉన్నా వేధింపులు తప్పడంలేదు. జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు, రాజకీయ ప్రముఖులు, రచయితలు, కళాకారులు సెక్సిస్టు విద్వేషప్రచారానికి లక్ష్యంగా మారుతున్నారు. ఇటువంటి హింసపై ఫిర్యాదు చేయడానికి 14శాతం మాత్రమే ముందుకువస్తున్నారు. మహిళలపై మన దేశంలో పెరుగుతున్న నేరాలు భయానకంగా తయారయ్యాయి. పన్నెండేళ్ళ క్రితం మహిళలపై జరిగిన నేరాలు 2.28 లక్షలు కాగా.. 2022లో సంఖ్య 4.28 శాతానికి పెరిగింది. జాతీయ మహిళా కమిషన్‌కు అందిన ఫిర్యాదులు 31 వేలు కాగా అందులో ఒక్క యూపీ నుండే 54.5 శాతం ఉన్నాయని గణాంకాలు వెల్లడించాయి. జండర్ వివక్ష ను అంతం చేయడానికి సమాజాలు, ప్రభుత్వాలు, స్వచ్ఛందసంస్థలు కలిసికట్టుగా కృషిచేయాల్సిన అవసరం ఉంది. డిజిటల్ అక్షరాస్యతకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంపొందించాల్సి ఉంది. డిజిటల్ నైపుణ్యాలను పెంచడానికి పాఠశాల స్థాయి నుండి ప్రయత్నం జరగాలి. అందరికీ సాంకేతికతను అందుబాటులోకి తేవడం ప్రాధాన్యతా అంశంగా తీసుకోవాలి. ఆన్‌లైన్ గోప్యత, భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వాలి. మహిళలు సురక్షితంగా డిజిటల్ రంగంలో భాగస్వాములు అయ్యేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించాలి. మహిళలకు అనువుగా సాంకేతికతను పని చేయించినపుడే డిజిటల్ యుగంలో మహిళలు సమాన అవకాశాలను పొందగలరు.

అంతర్జాతీయ సమాజం దీనిపై దృష్టి సారించాలన్న ఐరాస సంకల్పం ప్రాచుర్యంలోకి వస్తుందని ఆశిద్దాం!

డి. సోమ సుందర్

# అదానీ ఎపిసోడ్‌లో అసలు పాఠాలు

## - డాక్టర్ జయప్రకాష్ నారాయణ్

హిండెన్‌బర్గ్ రీసెర్చ్ అనే షార్ట్ లిస్టింగ్ సంస్థ జనవరి 23న ఇచ్చిన నివేదికతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్ ధరలు భారీగా పతనమవటం మన దేశంలో ప్రకంపనలు సృష్టించింది.

అయితే భారత స్టాక్ మార్కెట్, ఆర్థిక సంస్థలు, పెట్టుబడి కంపెనీలు అదానీ తాకిడికి పెద్దగా నష్టపోకపోవటం సానుకూల పరిణామం. మన ఆర్థిక వ్యవస్థలో ఉన్న స్థూల అంతర్గత బలం, వేగంగా వృద్ధి చెందే అవకాశాలతోపాటు వ్యవస్థలపై ప్రజల్లో విశ్వాసం వల్ల భారతీయ స్టాక్‌ల పట్ల నమ్మకం సడలలేదు. అదానీ షేర్లలో రిటైల్ మదుపుదారులు, మ్యూచువల్ ఫండ్‌ల వాటా 3.26% మాత్రమే కావటం వల్ల సంక్షోభం ప్రభావం భారతీయ స్టాక్ మార్కెట్‌పై పరిమితంగానే ఉంది. కొన్ని రుణాల్ని గ్రూప్ ముందుగా చెల్లించటం, పూర్తిగా సబ్‌స్క్రయిబ్ అయ్యాక కూడా ఐ.పి.ఓను రద్దు చేయటం చర్యలు గ్రూప్ మారక విలువ, అప్పులు చెల్లించగల సామర్థ్యం పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించాయి. ఇవన్నీ భారతీయ పెట్టుబడి మార్కెట్లకి, వృద్ధికి ప్రోత్సాహకర సంకేతాలే.

ఇదే సమయంలో, 7%, లేదా ఇంకా ఎక్కువే వార్షిక వృద్ధి రేటు దీర్ఘకాలం ఉండే అవకాశాలు ఎట్టకేలకు మన దేశానికి కనిపిస్తున్నాయి. వచ్చే రెండు దశాబ్దాలకు పైగా భారత్‌కి ఈ అవకాశం ఉంది. పేదరిక నిర్మూలనకు, ఉత్పాదకతతో కూడిన ఉపాధి అవకాశాలు, ప్రజల జీవితాల్ని, ఆదాయాల్ని పెంచటానికి, దేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల సరసన చేరటానికి ఈ వృద్ధి ఎంతో కీలకం. మౌలిక వసతుల నిర్మాణానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో చర్యలు తీసుకుంటోంది. అయితే, విద్యారంగంలో ఫలితాల్ని, నైపుణ్యాలను మెరుగుపరచటానికి ఇంకా చాలా చేయాల్సి ఉంది. నైపుణ్యాలు, తద్వారా ఉత్పాదకత పెరగటానికి జాతీయ విద్యావిధానంలో ఒక విశ్వసనీయ మార్గసూచి కనిపిస్తోంది. యూనియన్ ప్రభుత్వం, రాష్ట్రాలు కలసికట్టుగా పనిచేసి విద్యలో ఫలితాల్ని, నైపుణ్యాల్ని యుద్ధప్రాతిపదికన పెంచటానికి కృషి చేయాలి. అలాగే ఆరోగ్యంలో ఫలితాలు ఇప్పటికీ దారుణంగా ఉన్నాయి. ప్రాథమిక స్థాయి నుంచి తృతీయ స్థాయి ఆస్పత్రి చికిత్స వరకు ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించాలి. పేదరికం తగ్గాలంటే, ఉత్పాదకత పెరగాలంటే రాబోయే సంవత్సరాల్లో ఎదుర్కోవాల్సిన అత్యంత కీలక పాలనా సవాళ్లు ఇవి.

ఇక్కడితో అయిపోలేదు, చేయాల్సింది చాలా ఉంది. 19వ శతాబ్దపు రాజకీయాలు, 21వ శతాబ్దపు ఆర్థిక వ్యవస్థ కలసి సాగలేవు అని అదానీ ఉదంతం మరోసారి రుజువు చేసింది. ఇలాంటప్పుడు ఏం చేయాలి?





మనం న్యాయబద్ధంగా వ్యవహరిస్తామని, అందరినీ సమదృష్టితో చూస్తామని, పక్షపాతం లేకుండా నిజమైన పోటీ వాతావరణాన్ని పరిరక్షిస్తామని విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారుల్లో పూర్తి విశ్వాసం కలిగించటం, అందుకు తగ్గ నిబద్ధతను ప్రదర్శించటం ఎంతో కీలకం. యూనియన్‌లో, రాష్ట్రాల్లో మన ప్రభుత్వాలు మార్కెట్ వ్యవహారాల్లో ఆశ్రిత పక్షపాతాన్ని ప్రదర్శిస్తున్నాయని అనుమానం కలిగితే పెట్టుబడులు ఆవిరవుతాయి, అభివృద్ధి దెబ్బతింటుంది. మన దేశంలో ప్రభుత్వాలు వివిధ కారణాల రీత్యా, తమకు నచ్చిన

పెట్టుబడిదారుల పట్ల పక్షపాతం చూపుతున్నాయన్న అభిప్రాయం కొన్ని దశాబ్దాలుగా ఉంది. ఇతర కంపెనీల్ని విలీనం చేసుకోవటం ద్వారానే అదానీ గ్రూప్ చాలామేర మార్కెట్‌లో పెరిగింది. గ్రూప్ షేర్ విలువలు కేవలం కొన్ని సంవత్సరాలలో తారాజువ్వలా 800% పెరిగాయి. తమ ఆస్తులు అమ్ముకోవటానికి సంస్థ వాస్తవ యజమాని-ప్రమోటర్లకు లాభసాటి బేరం లభించి ఉండవచ్చు గానీ, విలీనం ప్రక్రియ సులువుగా జరగటంలో ప్రభుత్వ అదృశ్య హస్తం ఉందనే అభిప్రాయం పలువురిలో నెలకొంది. తెలుగు రాష్ట్రాలకి చెందిన వ్యాపారవేత్తలు అభివృద్ధి చేసిన గంగవరం పోర్టు, కృష్ణపట్నం పోర్టు, ముంబై ఎయిర్‌పోర్టులని అదానీ గ్రూపు సంస్థలు స్వంతం చేసుకోవటం వెనక ప్రభుత్వం తెచ్చిన ఒత్తిడి కూడా ఉందేమోననే శంకలుండటంలో ఆశ్చర్యం లేదు. వ్యాపారం, రాజకీయం మధ్య ఆ రకమైన లాలూచీ ఉందనే భావన చట్టబద్ధపాలనకి, వృద్ధిలో వేగానికి విఘాతమవుతోంది.

వ్యాపార సంస్థల ఆర్థిక ప్రయోజనాలపై రాజకీయ అస్థిరతల ప్రభావం పడకుండా నిలువరించాలంటే దీర్ఘకాలంపాటు క్రియాశీల ప్రయత్నాలు కావాలి. దశాబ్దాల తరబడి లైసెన్స్-పర్మిట్ రాజ్ వల్ల పాతుకుపోయిన ప్రభుత్వ గుత్తాధిపత్యం, పక్షపాతాల సంస్కృతిలో అది అంత తేలిగ్గా, తిన్నగా జరగదు. 2001లో తెహల్కా స్టింగ్ ఆపరేషన్ నేపథ్యంలో, నిజమైన రాజకీయ కలాపాలకి చట్టబద్ధంగా నిధులు అందించే మార్గాలు ఎంతో అవసరమో తెలియచెప్పి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా ఉద్యమం, నేను రాజకీయ పార్టీలను అందుకు ఒప్పించాం. ఫలితంగా, వాజపేయి నేతృత్వంలోని ఎన్.డి.ఏ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ కలిసొచ్చి ఎన్నికలు, ఇతర సంబంధిత చట్టాలు (సవరణ) చట్టం, 2003ను ఆమోదించాయి. విరాళాలిచ్చే దాతలకు పన్ను రాయితీ ఇవ్వటం ద్వారా రాజకీయ పార్టీలకు పారదర్శకంగా నిధులు కేటాయించటానికి ఈ చట్టంలో ఏర్పాటు చేశాయి. ప్రతిపక్షంలోని డా॥ మన్మోహన్ సింగ్, ప్రభుత్వంలోని ఎల్.కె అద్వానీ, అరుణ్ జైట్లీ కలిసొచ్చి ఈ చట్టాన్ని సాకారం చేశారు. ఈ చట్టం అమల్లోకి వచ్చాక ఇక డబ్బు విరాళాల్ని ఆమోదించకూడదని, ఎలాగూ చట్టం కింద పన్ను మినహాయింపు వస్తుంది కాబట్టి చెక్కు ద్వారా తీసుకోవాలని బీజేపీ నియమం ఏర్పాటు చేసుకుంది. అయితే దీనివల్ల పార్టీకొచ్చే విరాళాలు భారీగా పడిపోయాయి. ఈ సంగతి ఆ పార్టీలోని అత్యంత విశ్వసనీయ, అత్యున్నత స్థాయిలోని నాయకులే నాకు పలు సందర్భాల్లో చెప్పారు. దీంతో డబ్బు రూపంలో విరాళాలు తీసుకునే ఆనవాయితీనే అనుసరించాలని చివరికి బీజేపీ నిర్ణయించింది.

ఈ పరిమితులు మరికొన్ని పరిణామాలకు దారితీశాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు, న్యాయశాఖా మంత్రిగా 2003 చట్టాన్ని తీసుకురావటంలో కీలక పాత్ర పోషించిన అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రి అయ్యారు. తన పార్టీ ఎదుర్కొన్న సమస్యకు రహస్య ఎన్నికల బాండ్ల చట్టం పరిష్కారమని భావించారు. దీనివల్ల రెండు ప్రయోజనాల్ని ఆశించారు. విరాళాలు చెక్కు రూపంలో వస్తాయి, ఆ నిధుల వినియోగానికి పార్టీ లెక్కచెబుతుంది. రెండోది, విరాళాలిచ్చే కంపెనీల మీద కక్షసాధింపుకి ఆస్కారం లేకుండా దాతల వివరాల్ని రహస్యంగా ఉంచుతారు. అయితే, చట్టబద్ధంగా ఇచ్చే ఎన్నికల విరాళాలను రహస్యంగా ఉంచే ఈ రకమైన ఏర్పాటు కచ్చితంగా ప్రజాస్వామ్యానికి, జవాబుదారీతనానికి, పారదర్శకతకు విఘాతం. ఈ మొత్తం సమస్య వెనక ఉన్న కారణం ఏమిటంటే, ఇప్పటికి కూడా వ్యాపారాలు భారత్‌లో అధికారంలో ఉన్న పార్టీల దన్నుతోనే సాగుతుంటాయి. కాబట్టి, పక్షపాత రాజకీయాల నుంచి వ్యాపారాన్ని వేరు చేయటానికి పార్టీలు కలసికట్టుగా కృషి చేస్తేనే పరిష్కారం సాధ్యం. ఉత్తర అమెరికా, పశ్చిమ ఐరోపాలో వ్యాపార లాభాలు సాధారణంగా మార్కెట్ శక్తి మీద ఆధారపడి ఉంటాయి తప్ప రాజకీయ ప్రాపకం లేదా పక్షపాతం మీద ఆధారపడవు. మనం ఆర్థిక వృద్ధిని పరిరక్షించుకోవాలంటే వ్యాపార సంస్థల్ని పక్షపాత రాజకీయాల నుంచి పరిరక్షించే పకడ్బందీ రక్షణ ఏర్పాట్లు నిర్మించుకోవాలి.

అయితే ఇంతకంటే పెద్ద సవాలు ఓటర్లను ప్రలోభపెట్టటానికి, ఎన్నికయ్యాక ఫిరాయింపుల్ని ప్రోత్సహించటానికి చట్టవిరుద్ధ నిధులు పెద్దఎత్తున అవసరమవటం. రాజకీయంలో చట్టవిరుద్ధ డబ్బు ప్రభావం అనేకరెట్లు పెరిగిపోతోంది. ప్రజాస్వామ్యంలో ఈ రకమైన వికృత ధోరణులను మనం సమష్టిగా, ఒక క్రమపద్ధతిలో ఎదుర్కోవాలి. ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే, తక్కువ వస్తే ఎన్ని ఓట్లు వచ్చినా వృధాయే అనే మన ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ ఎన్నికల నమూనాకి ప్రత్యామ్నాయం చూడాలి. మన దేశం ఉన్న పరిస్థితుల్లో ఈ ఎన్నికల వ్యవస్థ రాజకీయాల్ని ఖరీదైన, ఎంతో రిస్కుతో కూడిన వ్యాపారంలా మార్చి వేసింది. భారీస్థాయిలో, విచ్చలవిడిగా ఓట్ల కొనుగోలును ప్రోత్సహిస్తోంది. దీని పరిణామాలు: విశృంఖల అవినీతి, అధికార దుర్వినియోగం, కిరాయి కార్యకర్తలు, వికృత రాజకీయ నియామకాలు, అధ్వాన్న పౌర సేవలు, అసమర్థ, బలహీన పరిపాలన, రాజకీయ, ఆర్థిక ప్రతిష్టంభన, యధాతథ స్థితిని కొనసాగించటం ఇందుకు పరిష్కారం కాదు. పార్టీకి వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి సీట్లని కేటాయించే దామాషా పద్ధతి లాంటి వ్యవస్థ ఓట్ల కొనుగోలుని, అక్రమ ఖర్చుని చాలామేరకు అరికడుతుంది. మన పరిస్థితులకి అనుగుణంగా ఎన్నికల వ్యవస్థని మార్చుకోవటం అవసరం. మన రాజకీయాల స్వభావం మార్చేందుకు అవసరమైన అధికారం, ప్రజల్లో విశ్వసనీయత నరేంద్ర మోదీకి ఉన్నాయి. చరిత్రలో తన పరంపరను, స్థానాన్ని పరిరక్షించుకునేందుకు, మన ప్రజాస్వామ్యాన్ని గొప్ప స్థాయి దిశగా పట్టాలెక్కించటానికి ఆయన కార్యోన్ముఖులవ్వాలి.

# మధ్యతరగతి సంఖ్య పెంచుదాం.. అభివృద్ధి చెందిన భారతదేశమవుదాం

2047 సంవత్సరానికి భారత అభివృద్ధి లక్ష్యాలను సాకారం చేసే గొప్ప శక్తి మధ్యతరగతి అని 2023-24 బడ్జెట్ అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మధ్యతరగతి సాధికారతకు కొన్నేళ్లుగా చర్యలు తీసుకుంటున్నామని, తాజా బడ్జెట్‌లో కూడా వారికి భారీగా పన్ను ఉపశమనాలు కలిగించామన్నారు.

మధ్యతరగతి శక్తి ప్రాధాన్యతను గుర్తించటం, వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేయటం ప్రజాస్వామిక దేశంలో స్వాగతించాల్సిన విషయం. మోదీ రాజకీయ సంస్కరణలను పట్టించుకోకపోయినా, ఆర్థిక వ్యవస్థను బాగుచేయాలనుకుంటున్నారు కాబట్టి, ఆ కోణంలో మధ్యతరగతిని బలోపేతం చేయాలని సంకల్పించి ఉండవచ్చు. అలాగే గొంతున్నవారుగా, ఆదర్శాల పట్ల ఆకర్షితులయ్యేవారుగా, ఆదర్శాలను ప్రచారం చేసేవారుగా సోషల్ మీడియా యుగంలో వారి నుంచి ఎన్నికల ప్రయోజనాన్ని కూడా ఆయన ఆశిస్తూండవచ్చు. 2014 ఎన్నికల్లో ఈరకంగానే, మధ్యతరగతి గొంతు వినిపిస్తూనే మోదీ దేశం లోపల, బయట విదేశాల్లో ఉన్న భారతీయుల మద్దతును పెద్దఎత్తున కూడగట్టారు. దీంతోపాటు తనను తాను చాయ్‌వాలా నేపథ్యమున్న పేదల పక్షపాతిగా చాటుకుంటూ అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన యూపీయే ప్రభుత్వాన్ని కుప్పకూల్చారు.

మోదీ కొన్ని పరిమితుల మధ్య మధ్యతరగతి గురించి ఆలోచించవచ్చు గానీ.. కానీ మధ్యతరగతి ప్రభావం ఎంతో విస్తృతమైనది, ఈవేళ్టి భారత్‌కు ఎంతో అవసరమైనది.

భారతదేశం ప్రస్తుతం జనాభా పరంగా ప్రపంచంలో పెద్ద దేశం మాత్రమే కాదు, ప్రపంచంలోనే అత్యంత యువ దేశం కూడా. మన జనాభా సగటు వయసు 28.8 సంవత్సరాలు. వారిలో 27 శాతం 24 ఏళ్లలోపు వారు కాగా, 70 శాతం పైగా 15-64 ఏళ్ల వారు, అంటే పనిచేసే వయసులో ఉన్నవారు. ఇలాంటి తరుణంలో భారత్ తన సామర్థ్యానికి తగ్గట్టు ఎదగాలంటే, వీరిలో అత్యధికులు మధ్యతరగతిగా పెరగాలి. దేశం ప్రపంచ దేశాల పెట్టుబడులను ఆకర్షించటంలో, ఆర్థిక శక్తిగా రూపొందటంలో, మానవాళి చరిత్రలోనే ఎన్నడూలేని రీతిలో నివారించదగ్గ బాధల్ని తొలగించుకోవటంలో బలమైన మధ్యతరగతి కీలకపాత్ర పోషించగలుగుతుంది. దేశానికి ఆర్థిక చోదకశక్తిగా ఉండటం మాత్రమే కాకుండా.. దేశంలో ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలనందించే ప్రజాస్వామ్య వ్యవస్థను వికసింప చేయటంలో మధ్యతరగతిది కీలక పాత్ర. అసలు ప్రజాస్వామ్యం



కాన్సెప్ట్ పుట్టిందే మధ్యతరగతి నుంచి. వ్యక్తి జీవితంలో రాజ్యం పాత్ర ఏమిటి, పరిమితులు ఏమిటి, రాజ్యం-సమాజం మధ్య సంబంధం ఎలా ఉండాలి అనేవి నిరంతరం చర్చలో ఉంటూ, మారుతున్న పరిస్థితుల మధ్య కూడా రాజకీయం, పాలన గాడితప్పకుండా నడిపించటంలో, నైతిక చట్రాన్ని పరిరక్షించటంలో మధ్యతరగతి కీలక పాత్ర పోషిస్తుంది. సమాజం మీద రాజ్యం రాచరిక, నియంతృత్వ పోకడలతో ఆధిపత్యం చెలాయించకుండా, ప్రభుత్వం పెద్దదయి ప్రజలు చిన్నవాళ్లు కాకుండా నియంత్రించటం మధ్యతరగతి ద్వారానే సాధ్యం. మధ్యతరగతి ద్వారానే సమాజం నిత్యం అప్రమత్తంగా ఉండగలుగుతుంది.

కాబట్టి కేవలం మధ్యతరగతిని ప్రోత్సహించటానికి పరిమితం కాకుండా.. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెబుతున్నట్లు, మధ్యతరగతి సంఖ్యను పెంచటం ఈవేళ భారత్‌కి ఎంతో కీలకం. అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలన్న భారత్ తరతరాల కల నెరవేరే గొప్ప అవకాశం ఇవాళ భారత్‌కి ఉంది. ఆ అవకాశం సద్వినియోగం కావాలంటే పేదలు, అల్పాదాయ వర్గాలు మధ్యతరగతికి పెరగటం తప్పనిసరి.

మధ్యతరగతి గణాంకాల గురించి ఎవరెన్ని చెప్పినా, మన దేశంలో మధ్యతరగతి తగినంత సంఖ్యలో లేరన్నది నిజం. నిజానికి అలా మధ్యతరగతివారి మద్దతు ఓ 10 శాతం ఓట్ల రూపంలో నిలకడగా వస్తుందనే విశ్వాసంతోనే లోక్‌సత్తా పార్టీని జేపీ బృందం స్థాపించింది. కానీ మన సమాజంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో, దక్షిణాదిన ఆ పరిస్థితి లేదని అనుభవం రుజువు చేసింది. అంటే మన వద్ద మధ్యతరగతి ఇంకా అంతగా రూపుదిద్దుకోలేదు. లోక్‌సత్తాకి ఓటు వేస్తే మాకు నచ్చని లేదా ప్రమాదకరమైన మరో పార్టీ గెలిచే అవకాశముంది కాబట్టి లోక్‌సత్తాకి ఓటు వేయలేకపోతున్నాం అని ఆ వర్గం వివరణ

ఇవ్వవచ్చు. కానీ లోక్‌సత్తాకి 10 శాతం మంది ఓటు వేస్తే ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలో కూడా మిగిలిన పార్టీలు తమ పంథా మార్చుకోక తప్పదనే ఆలోచనా సామర్థ్యం లేదంటే, తగినంత మధ్యతరగతి తయారవలేదని అర్థం. ఈ నేపథ్యంలోనే మన ఎన్నికల వ్యవస్థను మార్చాల్సిన అవసరం నెలకొంది. మధ్యతరగతికి నిర్వచనంపై ఎన్ని రకాల అభిప్రాయాలు, లెక్కలు ఉన్నా వాస్తవం ఇది. అందుకే మధ్యతరగతిని పెంచటాన్ని లక్ష్యంగా చేసుకోవాలని, అటువంటి మార్పు రాకుండా ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలో లోక్‌సత్తా ఎన్నికల్లో పోటీ చేయటం వల్ల సాధించే ప్రయోజనం పెద్దగా ఉండదని లోక్‌సత్తా తెలంగాణ రాష్ట్ర శాఖ నిర్వహించిన పార్టీ తాజా వార్షికోత్సవ సమావేశంలో కూడా జేపీ దిశానిర్దేశం చేశారు.

ఇంతకీ మన దేశంలో మధ్యతరగతి ప్రజానీకం ఎంతమంది ఉన్నారు?.. రకరకాల అంచనాలున్నాయి. దేశంలో మధ్యతరగతి ఆవిర్భావ క్రమాన్ని చూస్తే ఈ లెక్కలో కొంత స్పష్టత వస్తుంది.

**బ్రిటిష్ కాలంలో**

బ్రిటిష్ ప్రభుత్వం ఉన్నప్పుడు భారత్‌లో మధ్యతరగతి ఎదగటానికి అవసరమైన ఆర్థిక వృద్ధికి, ప్రగతికి పటిష్ఠ చర్యలు తీసుకోలేదు. అయితే 1790ల నుండి భూ విధానాన్ని ఆర్థిక కోణంలో సంస్కరించటం.. దేశంలో మధ్యతరగతి ఏర్పడటానికి దోహదం చేసింది. పారిశ్రామిక విప్లవం నుంచి సాంకేతికత పెరగటం, నూతన ఆర్థిక విధానాలు మధ్యతరగతి పెరగటానికి దోహదం చేశాయి. ఇదేసమయంలో కులం, మతం వంటి వాటికనుగుణంగానే బ్రిటిషర్ల చట్టాలు ఉండేవి. కుల పరమైన అవరోధాలు. మత ఛాందసాలు పలువురిని వృత్తులకే పరిమితం చేసి, మెరుగైన అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశాలకు గండికొట్టాయి. అందరికీ చదువుకునే అవకాశం లేకుండా చేయటం ప్రజల ఆదాయ అవకాశాలకు, మధ్యతరగతి సంఖ్య పెరగటానికి అవరోధంగా మారింది. ఆస్తిహక్కుల్లో కుల, మత ఆచారాలను పాటించటం వల్ల సమాజంలో కొత్త విభజన వచ్చింది.

అప్పట్లో వ్యాపార ధోరణులున్న వారు లేదా మధ్యవర్తులు ఒక రకం మధ్యతరగతి కాగా.. వడ్డీ వ్యాపారులు, దళారులు తమ డబ్బును భూముల మీద పెట్టుబడి పెట్టే మధ్యతరగతిగా ఉండేవారు. ఐరోపాలో పారిశ్రామిక విప్లవం వచ్చినా 19వ శతాబ్దంలో దేశంలో పరిశ్రమలు పెద్దగా పెరగలేదు కాబట్టి పారిశ్రామిక మధ్యతరగతి ఆరోజుల్లో తక్కువగా ఉండేది. చదువుకున్న మధ్యతరగతి చివరి తరగతి. వీరికి పాలన, సాంకేతిక రంగాల్లో నైపుణ్యం ఉండేది. బ్రిటిష్ కాలంలో మధ్యతరగతి ఆర్థిక వృద్ధికి ప్రధాన ఊతంగా ఉండేవారు. పారిశ్రామిక విప్లవ నేపథ్యమున్న బ్రిటిష్ పాలకుల స్ఫూర్తితో వీరు ఆంగ్ల విద్యను, అభ్యుదయ దృక్పథాల్ని ప్రోత్సహించేవారు. నూతన భూ విధానం వీరి స్థాయిని పెంచింది. వీరి వల్ల దేశంలో సంస్కరణోద్యమాలు ఆవిర్భవించాయి. 19వ శతాబ్దంలో కొన్ని రాజకీయ, మత ఉద్యమాలు కూడా ప్రజలను ఉత్పాదక శక్తులుగా తయారుచేసేందుకు ప్రయత్నించాయి.

**స్వతంత్రం వచ్చాక**

## Form IV

| | |
|---|---|
| 1.Place of Pubilcation | : Hyderabad |
| 2. Periodicity | : Monthly |
| 3. Printers | |
| a. Name | : Dr. Jayaprakash Narayan |
| b. Nationality | : Indian |
| c: Address | : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082 |
| 4. Publisher's Name | : Dr.Jayaprakash Narayan |
| 5. Editior's Name | : Dr.Jayaprakash Narayan |
| Nationality | : Indian |
| Address | : H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082 |
| 6. Name and Address of Individual(S) Who own the news paper and partners of Shareholders holding more than one percent of the capital | : Foundation for Democratic Reforms for loksatta, Represented by Dr. Jaya prakash Narayan, National Co ordinator , H.NO. 6-3-678, B-106, Pasha Court 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad - 500 082 |

I, Dr. Jaya prakash Narayan,Hereby declare that the Particulars above are true to the best of my knowledge and belief.

(Sd)
Dr. Jaya prakash Narayan
Signature of the Publisher

భారతదేశానికి స్వతంత్రం వచ్చాక 1951లో అధికారికంగా జనాభా లెక్కలు తీసినప్పుడు మన జనాభా సుమారు 36 కోట్లు. వీరిలో హిందువులు 84.1 శాతం. ముస్లింలు 9.8 శాతం, క్రైస్తవులు 2.3 శాతం (ఈ అంకెల్ని కూడా ప్రస్తావించటం అవసరం). దేశ విభజన గాయాల నుంచి కోలుకుంటున్న ఆ దశలో భారతదేశ జీడీపీ 20 బిలియన్ డాలర్లు. తలసరి ఆదాయం 70 డాలర్లు. 1990 నాటికి దేశ జనాభా 87 కోట్లకు పెరిగింది. అప్పట్లో ఇండియా జాతీయాదాయం 317 బిలియన్ డాలర్లని, తలసరి ఆదాయం 362 డాలర్లని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. అయితే 1947లో భారత్ కంటే వెనుక ఉన్న చైనా ఆదాయాల్లో ఇవి సగం కంటే తక్కువ.

స్వతంత్రం తెచ్చి, ఆ తర్వాత 1990 వరకు దాదాపు ఏకఛత్రాధిపత్యంతో దేశాన్ని పరిపాలించిన పార్టీ సోషలిజానికి వక్రభాష్యంతో పూర్వ సోవియెట్ యూనియన్ ఆర్థిక విధానాలను అనుసరించటంతో దేశంలో పౌరుల ఆర్థిక సామర్థ్యం వికసించలేదు. వ్యక్తులు సొంతంగా చేసుకోగలిగే రంగాల్లో కూడా ప్రభుత్వం పాత్ర తీసుకోవటంతో అన్ని రంగాల్లో ప్రభుత్వ



గుత్తాధిపత్యం పెరిగి అవినీతి, వేధింపులు, విపరీత ఆలస్యం రాజ్యమేలాయి. అప్పట్లో కనీసం ఫోన్ కనెక్షన్ రావటానికి కూడా ఇవాళ్టి లెక్క ప్రకారం రూ.2 లక్షల దాకా డిపాజిట్ చెల్లించాల్సి వచ్చేది. ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి ఉండేది. ఫోన్ రిపేరు వస్తే లంచాలు సమర్పించుకుంటూ కూడా వేచి చూడాల్సి వచ్చేది. చివరికి ఓ బస్తా సిమెంటు కావాలన్నా కూడా పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చేది. 1947లో మన కంటే వెనుకబడిన చైనా, మన చుట్టూ ఉన్న ఉన్న దక్షిణ కొరియా వంటి చిన్న దేశాలు కూడా వేగంగా ముందుకు దూసుకెళ్తుండగా.. బూజుపట్టిన, పనికిమాలిన జాతీయీకరణ ఆర్థిక విధానాల వల్ల మన దేశం తీవ్రంగా నష్టపోయింది. ఫలితంగా భారత జీడీపీ 1950, 1990 మధ్యకాలంలో 3.5 వద్దే తచ్చాడింది. తలసరి ఆదాయం వృద్ధి రేటు కేవలం 1.3 శాతం ఉండేది. సమష్టి వ్యవసాయం (కలెక్టివ్ ఫార్మింగ్) వంటి ప్రయత్నాలపై గట్టి ప్రతిఘటన రావటం వల్ల అప్పటి ప్రధాని నెహ్రూ వెనక్కితగ్గారు గానీ, లేకుంటే దేశం ఆహార సంక్షోభంలో కూడా కూరుకుపోయేది. ఆ తర్వాత లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఉన్నప్పుడు మొదలైన హరిత విప్లవం దేశంలో ఆహార స్వావలంబన సాధించటంతోపాటు కొంతమేర మధ్యతరగతి సంఖ్య పెరగటానికి దోహదం చేసిన ఇందిరాగాంధీ హయాంలో వ్యవసాయ మార్కెట్ జాతీయీకరణకు ప్రయత్నం జరిగింది. చేతులు కాలటంతో ఆ ప్రభుత్వం కూడా వెనక్కు తగ్గింది. అప్పటి ప్రభుత్వాల విధానపరమైన వైఫల్యాలు దేశంలో మధ్యతరగతి పెరగటానికి తీవ్ర అవరోధాలుగా మారాయి.

ఇదేసమయంలో, వయోజన ఓటు హక్కు, ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లు స్వతంత్ర భారతంలో మధ్యతరగతి పునాది విస్తరించటానికి దోహదపడ్డాయి. అయితే రిజర్వేషన్లు మధ్యతరగతి వర్గంలో చిచ్చుపెట్టాయి. అది ఇప్పటికీ చల్లారలేదు.

ఆ రోజుల్లో దేశంలో మధ్యతరగతి ఎక్కువగా ప్రభుత్వోద్యోగాల ద్వారా ఏర్పడ్డారు. ప్రపంచంలో ఏ పెద్ద దేశంలోనూ రీతిలో దేశంలోని సగటు పౌరుని కంటే అనేక రెట్లు ఎక్కువ ఆదాయం, జీవన భద్రతతో మన దేశంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ.. మధ్యతరగతి వ్యవస్థను తయారుచేయటంతోపాటు ఓ కొత్త సమస్యగా కూడా మారింది. వలసవాద ధోరణిలో పౌరుల నెత్తిన పెత్తనం చేయటం మొదలుపెట్టిన ఉద్యోగ వ్యవస్థకు లైసెన్స్–పర్మిట్ రాజ్ తోడవటంతో ఉద్యోగుల్లో సొంత ప్రయోజనాలకు ప్రాధాన్యత పెరిగింది. యూనియన్లుగా ఏర్పడటం, ప్రజాప్రయోజనాలకు విరుద్ధమైనా సరే తమ జీతభత్యాలు, సౌకర్యాల్ని ప్రభుత్వం నుంచి సాధించుకోవటం వంటి పోకడలు పాతుకుపోయాయి. కుహనా సోషలిజం బాటలోని ఈ తిరోగమన ధోరణులు పౌర సేవల్ని అవినీతిమయం చేయటంతోపాటు.. క్రమంగా స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమై ఎమ్మెల్యే రాజ్యం ఏర్పడటానికి, ఎన్నికల వ్యవస్థ భ్రష్టుపట్టటానికి దారితీశాయి. సంఘటిత రంగం విస్తరించకుండా కోట్లాది మంది రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలోనే జీవన భద్రత లేకుండా బతికే పరిస్థితిలోకి సమాజాన్ని నెట్టాయి. రిజర్వేషన్ల ద్వారా ప్రభుత్వోద్యోగాలు పొందినవారు కూడా ఇందులో కూరుకుపోయి తమ కులాల్లోనే అట్టడుగున ఉన్నవారి ప్రయోజనాల్ని విస్మరించారు. తాము మధ్యతరగతిగా ఎదుగుతున్నకొద్దీ అగ్రవర్ణాల్ని అనుకరించటం మొదలుపెట్టారు. ప్రభుత్వోద్యోగుల్లో కొందరు అద్భుతమైన వ్యక్తులు, మచ్చలేకుండా ప్రజలకు సేవలందించినవారు అప్పటికి, ఇప్పటికీ ఉన్నారనటంలో సందేహం లేదు. కానీ ఒక వ్యవస్థగా మన ప్రభుత్వోద్యోగుల పనితీరు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధరీతిలోనే ఉంది. ఇలా ప్రభుత్వోద్యోగుల నుంచి ఏర్పడిన మధ్యతరగతి 1950ల్లో ఓ 50 లక్షలు ఉంటారని అంచనా. ఆ

తర్వాత మరో 60 లక్షలు పెరిగి 1971 నాటికి 11.2 మిలియన్లకు పెరిగింది. కేంద్రీకృత పాలనకు తోడు ప్రభుత్వోద్యోగ వ్యవస్థ భయంకర అలసత్వం, అవినీతి వల్ల తలెత్తిన పరిస్థితులే 1970లలో ఎమర్జెన్సీకి దారితీశాయి.

అయితే అసలు సమస్యను గుర్తించి పరిష్కరించకుండా కేవలం ఇందిరాగాంధీని గద్దె దింపటం చుట్టూనే ఆనాటి ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమం జరగటం వల్ల ఇదే ధోరణి స్వల్పమార్పులతో మరికొన్ని సంవత్సరాలు కొనసాగింది. 1980ల తర్వాత ప్రభుత్వం తన గుత్తాధిపత్యాన్ని కొంతమేర తగ్గించుకుని ప్రయివేటు రంగానికి చోటు కల్పించింది. దీంతో కొంతమేర సమాచార సాంకేతికతలు దేశంలోకి ప్రవేశించాయి. ప్రభుత్వ రంగం బయట కొద్దిమేర ఉన్న మధ్యతరగతివారు.. వలసకాలం నాటి అలవాట్ల నుంచి క్రమంగా ఆధునిక ధోరణుల్ని సంతరించుకోవటం ప్రారంభించారు. రోజువారీ జీవితంలో విదేశీ స్థాయి వస్తువుల్ని, సౌకర్యాల్ని కొనటం మొదలైంది. ఈ మార్పులు 1990 తర్వాత ఆర్థిక సరళీకరణకు బాటలు వేశాయి.

**ఆర్థిక సంస్కరణలు**

ఖజానా దివాలా తీసి బంగారం తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి తలెత్తటంతో, ఆర్థిక సంస్కరణలు తప్ప దేశానికి గత్యంతరం లేకపోయింది. అప్పటిదాకా కుహనా సోషలిజం పేరుతో రాజకీయం, దీన్ని అడ్డంపెట్టుకుని వలసవాద ధోరణితో పౌర సేవలు పట్టని ప్రభుత్వోద్యోగ వ్యవస్థ వల్ల ఎదగలేకపోయిన మధ్యతరగతి వర్గం.. పీవీ నరసింహారావు హయాంలో డా॥ మన్మోహన్‌సింగ్ 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు సృష్టించిన వాతావరణంతో వేగంగా పెరగనారంభించింది. ఆర్థిక రంగంలో ప్రభుత్వ అసంబద్ధ పాత్ర తగ్గి, వ్యక్తుల చొరవకు మార్గం ఏర్పడటంతో దేశీయంగా, విదేశాల నుంచి కూడా ప్రయివేటు పెట్టుబడులు పెరిగాయి. 1991లో ఆర్థిక సరళీకరణలో భాగంగా భారత్ మూడు ఆర్థిక నమూనాల్ని ప్రవేశపెట్టింది. లిబరలైజేషన్, గ్లోబలైజేషన్, ప్రయివేటైజేషన్. ఇందులో ప్రపంచీకరణను అనివార్యంగా భారత్ అనుసరించాల్సి వచ్చింది. దేశమంతా ఒకటే మార్కెట్‌గా చేయటం, ధరల్ని సాధ్యమైనంత తక్కువ పన్నులతో తక్కువ ధరలకు అందుబాటులోకి తేవటం, అందరికీ అందుబాటులోకి తేవటం దీని ద్వారా సాధ్యమైంది. ఆర్థిక ప్రగతి రేటును స్థిరీకరించటం వ్యాపారానికి, పోటీకి తగిన వాతావరణాన్ని కల్పించింది. ఆర్థిక రంగంలో నియంత్రణల భారాన్ని తగ్గించింది. విదేశీ పెట్టుబడులు, ప్రయివేటు పెట్టుబడులకు ఇది అవకాశం కల్పించింది. వాణిజ్య లోటును తగ్గించి జీడీపీ వృద్ధికి ఇది దోహదం చేసింది.

ఇంతకు ముందే చెప్పుకున్నట్లు, ఆర్థిక సంస్కరణలకు ముందు స్వతంత్ర భారత వృద్ధి రేటు 4 శాతం మించి లేదు. ఆ సమయంలో ఇతర ఆసియా దేశాలు ఇండొనేషియా, థాయ్‌లాండ్, తైవాన్, దక్షిణ కొరియా వరుసగా 6,7,8,9 శాతం రేటుతో ఎదిగాయి. ముఖ్యంగా దక్షిణ కొరియాను చూస్తే మన మూర్ఖపు విధానాల వల్ల దేశాన్ని ఎంత నాశనం చేశామో అర్థమవుతుంది. 1960ల్లో ఇండియా కంటే నాలుగు రెట్లు ఎక్కువున్న దక్షిణ కొరియా జీడీపీ, 1990ల నాటికి 20 రెట్లు పెరిగింది. 1990ల్లో ఆర్థిక సంస్కరణల తర్వాతగానీ ఇండియా వృద్ధి రేటు 6-7 శాతాన్ని అందుకోలేదు.

1991లో దేశవ్యాప్త స్వేచ్ఛా వాణిజ్యం వల్ల సరకులు అందరికీ తక్కువ ధరలో అందుబాటులోకి వచ్చాయి.

ఇలా మధ్యతరగతి భావన మన దేశంలో పారిశ్రామిక విప్లవ ప్రభావంలో ఉన్న 19వ శతాబ్దంలో ప్రారంభమై కొనసాగుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ వైఫల్యాలను అధిగమించే క్రమంలో మధ్యతరగతి పెరగటానికి పారిశ్రామికవేత్తలు, వలస పాలకులు కూడా దోహదం చేశారు.

మధ్యతరగతి వర్గం పెరగటానికి ఆర్థిక వృద్ధికి దోహదం చేసే విధానాలు, సాంకేతికతలు, విదేశీ పెట్టుబడులు కీలకమని ఈ పరిణామాలన్నీ రుజువు చేస్తాయి.



ప్రయివేటు సంఘటితంలో పెరగని ఉపాధి అవకాశాలు

అయితే ఆర్థిక సంస్కరణలు వచ్చినా ప్రభుత్వ రంగం పూర్తిగా పట్టుసడలించకపోవటంతో పాటు కొన్ని మౌలిక వైఫల్యాల్ని కొనసాగించటంతో ప్రభుత్వ రంగంలో ఉద్యోగుల సంఖ్య తగ్గటం ప్రయివేటు సంఘటిత రంగంలో సంఖ్య పెరగటానికి దోహదం చేయలేదు. ప్రయివేటు సంఘటిత రంగంలో 1970-71 లో 6.74 మిలియన్లుగా ఉన్న ఉపాధి 2006-07లో 9.24 మిలియన్లకు పెరిగింది. అంటే ఏడాదికి బొటాబొటిగా 1 శాతం.

భారత్‌లో నాణ్యమైన విద్య అందించే బాధ్యతలో ప్రభుత్వాలు నేరసమాన నిర్లక్ష్యంతో వ్యవహరించటం వల్ల, ముందుచూపు లేకుండా ఉత్పత్తి రంగాన్ని విస్మరించటం వల్ల, తర్వాత వచ్చిన సేవల రంగం మంచి చదువును వివిధ సానుకూల పరిస్థితుల వల్ల పొందగలిగిన కొద్దిశాతం మందికి మాత్రమే ఎక్కువ లబ్ధి చేకూర్చింది. ఫలితంగా మధ్యతరగతికి, ఆపై స్థాయికి ఎదిగే అవకాశాల్లో అన్ని వర్గాలకూ ప్రాతినిధ్యం ఉన్నా ఎక్కువగా ఆ అవకాశాలు హిందూ అగ్రవర్ణాల వారికే లభించాయి. సామాజిక వివక్ష ప్రభావం కొనసాగుతోంది. ఫలితంగా అణగారిన వర్గాల ప్రాతినిధ్యం భూమి ప్రాధాన్యం ఉన్న వ్యవసాయం, గనులు, నిర్మాణం వంటి రంగాల్లో ఉండగా, అగ్రవర్ణాల ప్రాతినిధ్యం సేవల

రంగంలో ఎక్కువగా ఉంది.

ఈ నేపథ్యంలోనే, ఆర్థిక సంస్కరణలు భారతదేశంలో మధ్యతరగతి పెరగటానికి కాకుండా కొద్దిమందికే తోడ్పడ్డాయని వాదించేవారున్నారు. అలాగే పేదరికం ఎంత తగ్గిందనే అంశంపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి.

అయితే ఆర్థిక సంస్కరణల వల్ల ఇండియాలో గణనీయంగా పేదరికం తగ్గిందనేది, మధ్యతరగతి పెరిగిందనేది వాస్తవం.

ప్రపంచ పేదరికంపై యూఎన్‌డీపీ నివేదిక 2022 ప్రకారం.. 2021కి ముందున్న 16 ఏళ్ల కాలంలో 415 మిలియన్ ప్రజలను పేదరికం నుంచి భారతదేశం బయటపడవేసింది. కానీ ఇలా పేదరికం నుంచి బయటపడ్డవారు కూడా మధ్యాదాయాన్ని, మధ్యతరగతి స్థాయిని నిలకడగా అందుకోలేకపోతున్నారు. ఏ అనారోగ్య ఖర్చో వస్తే తిరిగి పేదరికంలోకి జారిపోతున్నారు. దేశంలో తొంభై శాతానికిపైగా ఉన్న అసంఘటిత రంగ కార్మిక



శక్తిని సంఘటిత రంగంలోకి మళ్లించటంలో ప్రభుత్వాల వైఫల్యం మధ్యతరగతి పెరుగుదలలో తీవ్ర ఒడిదుడుకులకు కారణమవుతోంది.

నెహ్రూ తదనంతర పరిణామాల నేపథ్యంలో హక్కులు, కులాలు, ఐడెంటిటీల చుట్టూ ఉద్యమాలు మధ్యతరగతిని ప్రభావితం చేశాయి. స్వతంత్రానంతరం తొలితరం మధ్యతరగతిగా ఉన్న ప్రభుత్వోద్యోగులు ఇందులో కీలక పాత్ర పోషించారు. తర్వాత సరళీకరణతో మధ్యతరగతి చుట్టూ చర్చ వినియోగదారీ సంస్కృతి ప్రాతిపదికన ఎక్కువగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి వారు మన దేశంలో ఎంత మంది అనే అంశంపై నిర్వచనాన్ని బట్టి భిన్న వాదనలున్నాయి.

**ప్రస్తుతం మధ్యతరగతి సంఖ్య - అంచనాలు**

ప్రస్తుత మధ్యతరగతి సంఖ్యపై అంచనాల్ని చూస్తే..

తాను కూడా మధ్యతరగతి వ్యక్తినేనని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2023 బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ చెప్పారు. ఆమె కూడా మధ్యతరగతి అయితే, దేశంలోని అత్యంత సంపన్నులు అని మనం అనుకుంటున్నవారు కూడా మధ్యతరగతే అవుతారేమోనని గందరగోళం ఇంకా పెరగకమానదు.

డచ్ బ్యాంక్ రీసెర్చి అంచనాల ప్రకారం, 2004–2012 మధ్యకాలంలో భారతదేశ మధ్యతరగతి రెట్టింపయి 30 కోట్లకు చేరుకుంది. 2015 నాటికి దేశంలో 30–60 కోట్ల మంది మధ్యతరగతి ఉన్నారు. 2011, 2015 మధ్యకాలంలో దేశంలో పేదరికం పది శాతం మేర తగ్గి, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నవారి సంఖ్య 22 శాతం నుంచి 19కి తగ్గిందని అంచనా. పొదుపు చేయటం కూడా 2005–2015 మధ్య మూడు రెట్లు పెరిగింది. చేతిలో డబ్బు ఆడటం పలు ఇళ్లలో పెరిగింది. సంస్కరణలు ప్రారంభించిన పాతికేళ్ల తర్వాత, 10,000 డాలర్ల మిగులు ఆదాయమున్న భారతీయ కుటుంబాల సంఖ్య ఇరవై రెట్లు పెరిగి 5 కోట్లకు చేరుకుంది.

ముంబయి విశ్వవిద్యాలయ ఆర్థికవేత్తల నిర్వచనం ప్రకారం, రోజుకు 2 నుంచి 10 డాలర్ల తలసరి ఖర్చు చేసేవారు మధ్యతరగతి. ఈ లెక్కన, దేశ జనాభాలో దాదాపు సగం మంది మధ్యతరగతే అవుతారు. దిగువ మధ్యతరగతిలో వృద్ధి వేగంగా ఉంది. వీరు రోజుకు 6 డాలర్ల వరకు ఖర్చు పెడతారు. ఇందులో వడ్రంగి పనిచేసేవారు, వీధి వ్యాపారులు, డ్రైవర్లు మొదలైనవారు ఉన్నారు. దిగువ వర్గాల నుంచి దిగువ మధ్యతరగతికి ఇలా ఎదిగే అవకాశాలు పెరగటానికి సంస్కరణలు దోహదం చేశాయి. ఆహారం, నివాసం తర్వాత వినియోగవస్తువుల కొనుగోలు, కొద్దిపాటి సౌకర్యాలు, పిల్లల అవసరాలకు వీరు డబ్బు వెచ్చించగలుగుతున్నారు.

ప్రతి ముగ్గురు భారతీయుల్లో ఒకరు 1..5 నుంచి 30 లక్షల మధ్య వార్షికాదాయం కలిగి ఉన్నారని మరో అంచనా చెబుతోంది. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇచ్చే ఈబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు అర్హతగా ప్రభుత్వం రూ. 8 లక్షల వార్షిక ఆదాయాన్ని నిర్ణయించింది.

ఇదే సమయంలో, మధ్యతరగతిని అంచనా వేయటానికి ఓ కీలక ప్రమాణంగా భావించే వినియోగ సంస్కృతి పేలవంగా ఉందని కొన్ని వర్గాలు పెదవి విరుస్తున్నాయి. భారతీయ మార్కెట్‌లో వివిధ విదేశీ సంస్థల వైఫల్యాల్ని వారు ఉదహరిస్తున్నారు. భారతీయ ఇన్సూరెన్స్ కంపెనీల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 49% నుంచి 74%కి పెంచుతూ 2021 యూనియన్ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకుని, మొదటిసారిగా విదేశీ యాజమాన్యానికి అవకాశం కల్పించినా సంవత్సరం తర్వాత చూస్తే ఫలితాలు అంత ఆశాజనకంగా లేవని వారు ఉదహరిస్తున్నారు. బహుళజాతి ఇన్సూరెన్స్ సంస్థలు భారతీయ మార్కెట్ పట్ల అంత ఆసక్తి చూపలేదు. అలాగే ఫోర్డ్, జనరల్ మోటార్స్, కొన్ని రిటైల్ బ్యాంకింగ్ సంస్థలు కూడా భారత మార్కెట్ పట్ల మితిమీరిన అంచనాలు వేశామన్నట్లు వెనక్కు తగ్గాయి. భారత్‌లో డిమాండ్ ప్రస్తుతం తగినంత లేదనేది స్పష్టంగా కనిపిస్తున్న వాస్తవం. పెట్టుబడులు పెట్టండి అని ఆర్థికమంత్రి ఆమధ్య స్వదేశీ పెట్టుబడిదారులను కూడా పనిగట్టుకు అడగాల్సి వచ్చింది. దీనికి బలమైన మధ్యతరగతి లేకపోవటమే కారణమని వారి విశ్లేషణ.

మితిమీరిన ఆడంబరాలకు పోకపోవటం, పొదుపు అలవాటు,

ముందుచూపు వల్ల భారతీయుల్లో ఎక్కువమంది కొనుగోళ్ల విషయంలో పాశ్చాత్య దేశాల కంటే విజ్ఞతతో వ్యవహరిస్తారని, వినిమయ సంస్కృతి ఆధారంగా భారత్‌లో మధ్యతరగతిని గణించలేమని మరికొందరి వాదన.

**భవిష్యత్తు అంచనాలు**

అలాగే మధ్యతరగతి సంఖ్యపై భవిష్యత్తు అంచనాల్ని చూస్తే..

+ ప్రస్తుతం ప్రతి 3 భారతీయుల్లో ఒకరు 1..5-30 లక్షల వార్షికాదాయంతో ఉండగా, ఇది 2047కి ఇది రెట్టింపవుతుంది. అంటే ప్రతి ఇద్దరిలో ఒకరు ఆ స్థాయి ఆదాయాన్ని పొందుతారు.
+ భారతీయ మధ్యతరగతి సంఖ్య 2047 నాటికి 100 కోట్లకు చేరుతుందని 'ప్రైస్' నివేదిక పేర్కొంది. అందుకే ఈ దశాబ్దం, సరిగా వ్యవహరిస్తే ఈ శతాబ్దం భారత్‌ది అని కొందరు అంచనా వేస్తున్నారు.
+ భారత ఆర్థిక వ్యవస్థ 2030 నాటికి దిగువ తరగతి వర్గాల మీద కాకుండా మధ్యతరగతిపై ఆధారపడుతుంది.

**మధ్యతరగతి వాస్తవ సంఖ్య ఎంత**

ఈ నేపథ్యంలో మధ్యతరగతి ప్రస్తుత సంఖ్యపై స్పష్టతకు.. అసలు మధ్యతరగతి అంటే ఎవరు అనే నిర్దిష్ట, ఆచరణీయ నిర్వచనంపై స్పష్టత అవసరం.

50% మంది భారతీయులు తమను తాము మధ్యతరగతిగా భావిస్తున్నారని 2018లో వెలువడి 'కాస్ట్ ఆఫ్ డెమోక్రసీ' పుస్తకం పేర్కొంది. కానీ అది వాస్తవికం కన్నా ఆకాంక్ష కలగలిసిన అభిప్రాయంగానే భావించాలి.

మొదట్లోనే మనం సూచనప్రాయంగా చెప్పుకున్నట్లు, మానవ వనరుల్ని పెంపొందించే, పొదుపుని పెంచే, ఎంటర్‌ప్రెన్యూర్‌లను ఉత్పత్తి చేసే, వస్తువులకు డిమాండ్ తీసుకొచ్చే, ఆర్థికంగా అందరికీ ఆదాయాల్ని పెంచే వ్యవస్థకు దోహదం చేసే లక్ష్యాల్ని సాధిస్తూ ఆరోగ్యకరమైన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని నిర్మించటంలో కీలక పాత్ర పోషించే వారిని మధ్యతరగతిగా మనం పరిగణలోకి తీసుకోవచ్చు. మధ్యతరగతి లేకుండా కేవలం డబ్బున్నవాళ్లు, పేదలు మాత్రమే ఉంటే, ఆ సమాజంలో అనుసంధానం కొరవడి రాజకీయ స్థిరత్వం, ఆర్థిక వృద్ధి, సమతుల్యత దెబ్బతింటాయని సుప్రసిద్ధ ఎం.ఐ.టి ఆర్థికవేత్త లెస్టర్ థోరో అంటారు.

ఈ నేపథ్యంలో దేశంలో మధ్యతరగతి సంఖ్యపై ప్యూ రీసెర్చి సంస్థ సర్వేను కొంత ప్రామాణికంగా తీసుకోవచ్చు. 2015లో ఈ సంస్థ సర్వే ప్రకారం, కేవలం 2% మంది భారతీయులు మాత్రమే ప్రపంచ ప్రమాణాల కోణంలో మధ్యతరగతి నిర్వచనానికి సరితూగుతారు. 80 శాతం పైగా తక్కువ ఆదాయ కేటగిరీలోకే వస్తారు.

భారత తలసరి ఆదాయం 2200 డాలర్లు. ప్రపంచంలో మనతో పోల్చదగిన చాలా దేశాల కంటే ఇది తక్కువ. మధ్యతరగతి నెలవారీ ఆదాయం 300-600 డాలర్లు ఉండాలి. అంటే మన దేశంలో 2% మందికే వస్తుంది. 2001 నుంచి 2011 వరకు భారత్‌లో పేదరికం శాతం 35 నుంచి 21 శాతానికి తగ్గగా, మధ్యతరగతి మాత్రం 1 నుంచి 3 శాతానికే పెరిగారని ప్యూ రీసెర్చి తెలిపింది. 2020 నాటికి దేశంలో దాదాపు 10 కోట్లు ఉన్న మధ్యతరగతి సంఖ్య కొవిడ్ ప్రభావం వల్ల 30 శాతం మేర తగ్గిందని ఈ సంస్థ అంచనా వేసింది. ఎగువ మధ్యతరగతి మరో 1.6 కోట్ల మంది ఉంటారు.

అలాగే భారత ప్రభుత్వం 2022లో విడుదల చేసిన డేటా ప్రకారం నెలకు రూ.25,000 జీతం పొందేవారు దేశంలోని ఎగువ 10శాతం మందిలో ఉన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రోజుకి రూ.200, నెలకి రూ.6,000 ఖర్చు చేసేవాళ్లు జనాభాలో 5% లోపే ఉంటారు. పైనున్న 1 శాతానికి మాత్రమే తాము అమ్మకాలు చేయగలుగుతున్నామని పలు సంస్థలు కూడా చెబుతున్నాయి. ఓలా సంస్థనే తీసుకుంటే దేశమంతా విస్తరించి ఉన్నా కూడా 80 శాతం ఆదాయం ఢిల్లీ, ముంబయి వంటి చోట్ల నుంచే వస్తోంది. వాషింగ్ మెషీన్లలో 33 శాతం కొన్ని మెట్రో



నగరాల్లో మాత్రమే ఉండగా, 15% ఏసీలు ఢిల్లీలోనే ఉన్నాయి. వినియోగ సంస్కృతి అంటే అమెరికాలోలా ఉండనక్కర్లేదు గానీ, కనీసం మధ్యతరగతి అంటే కేవలం ఎంత సంపాదిస్తున్నారో మాత్రమే కాకుండా ఎంత ఖర్చు చేస్తున్నారనే విషయం కూడా ముఖ్యమనటంలో సందేహం లేదు. వాహనాలు, ఇతర వస్తువులు మధ్యతరగతి ఎంతమందో అంచనా వేయటానికి దోహదం చేస్తాయి. అభివృద్ధి చెందుతున్న దేశంలో కారు ఉంటే ఎగువ మధ్యతరగతి, ద్విచక్ర వాహనం మధ్యతరగతి స్థాయి అనుకోవచ్చు. ఇంతకు ముందే ప్రస్తావించుకున్నట్లు, పెద్ద సంస్థలు వినియోగ మార్కెట్‌లో ఆశించిన ఫలితాలు సాధించలేకపోవటానికి మన మధ్యతరగతి సంఖ్య ఎదగకపోవటం కారణం. ఇండియాలో ఆస్తులు కూడా ఎక్కువగా 10% జనాభా వద్దే కేంద్రీకృతమయ్యాయంటే పేదరికం తీవ్రతను, మధ్యతరగతి ఒడిదుడుకులను అంగీకరించక తప్పదు. కేవలం 3% మంది భారతీయులు మాత్రమే అయిదు బేసిక్ వినియోగ వస్తువులు- మోటారు వాహనం, టీవీ, ఫ్రిజ్, కూలర్/ఏసీ, కంప్యూటర్ కలిగి ఉన్నారు.

**వేగంగా పెరుగుతున్న మధ్యతరగతి**

మొత్తంగా ప్రస్తుతం మన దేశంలో మధ్యతరగతి 10 కోట్ల లోపే ఉన్నా వారి సంఖ్య వేగంగా పెరుగుతున్న మాట వాస్తవం. మొబైల్ టెక్నాలజీ, తక్కువ ఖర్చుతో మొబైల్ డేటా, డిజిటల్ విధానం, ఇ-కామర్స్, స్టాక్ మార్కెట్ వంటివి మధ్యతరగతి

విస్తరణకి దోహదం చేస్తున్నాయి. అలాగే దేశంలో ఇటీవల అంకుర సంస్థలు, జాతీయ రహదారులు, ఎయిర్‌పోర్టులు వంటివి మధ్యతరగతి పెరుగుతోందనటానికి సంకేతాలు. భారత దేశీయ మార్గాల్లో విమాన ప్రయాణాలు కొవిడ్ ముందుకంటే అధిక వృద్ధితో సాగుతూ ప్రస్తుత స్థాయికి రెట్టింపయ్యే అవకాశముందని విమానాల ఇంజిన్ తయారీ సంస్థ జీఈ ఏరోస్పేస్ తెలిపింది. అందుకే దేశీయంగా ఉన్న విమానాలు 700 కాగా, మరో 1,115 విమానాలకు సంస్థలు ఆర్డర్లు పెట్టాయి. ఈ ఏడాది జనవరిలో 1.25 కోట్ల మంది దేశీయంగా విమానాల్లో ప్రయాణించారు. ఇది అంతకు ముందు ఏడాది కన్నా రెట్టింపు. విదేశాలకు ప్రయాణించే భారతీయులు ప్రతి నెలా దాదాపు 1 బిలియన్ డాలర్లు ఖర్చు పెడుతున్నారని రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తెలిపింది. ఆదాయాలు పెరుగుతున్నందున, విదేశీ ప్రయాణాలు చేసే మధ్యతరగతి వారి



సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, రాబోయే 7-10 ఏళ్లలో వీరు 12 నుంచి 12.5 కోట్లకు పెరిగే అవకాశముందని అంచనా. ఇండియాలో వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ కూడా మధ్యతరగతిని పెంచుతోంది. ఇండియాలో 10 లక్షల పైనున్న 63 నగరాల్లో 27 శాతం పైన మధ్యతరగతివారున్నారు. పట్టణీకరణతో ఆర్థిక వ్యవస్థ, మధ్యతరగతి పెరగటం ఒక ఒరవడిలా సాగుతోంది. ఈ నగరాలు దేశంలో 29% కుటుంబాల్లో మిగులు ఆదాయానికి, 27% వ్యయం, 38% పొదుపుకి దోహదపడుతున్నాయి. మధ్యతరగతివారు మెట్రోల్లో మరీ ఎక్కువగా ఉన్నారు. ప్రధాన వినియోగదారులూ వీరే. 2036 నాటికి 40-50% జనాభా పట్టణాల్లోనే ఉంటారని అంచనా. మధ్యతరగతి పెరగటం వల్లే పర్యాటకం పెరుగుతుందని, దేశీయ వినియోగం పెరుగుతుందని పలు సంస్థలు అంచనా వేస్తున్నాయి.

**60% మందికి అవకాశం ఉన్నా ప్రభుత్వాల వైఫల్యం అడ్డుకుంటోంది**

అయితే ప్రభుత్వాల వైఫల్యం వల్ల భారత్ సామర్థ్యానికనుగుణంగా మధ్యతరగతి పెరగటం లేదు.

సిద్ధాంతరీత్యా మధ్యతరగతి వల్ల పన్నుల ఆదాయం పెరిగి దేశాభివృద్ధికి దోహదం చేస్తుంది. కానీ మన దేశంలో ప్రభుత్వాలు వారి సంఖ్యను పెంచటం కన్నా కూడా పరోక్ష పన్నుల భారం ప్రజలపై మోపుతూ ఆర్థిక వ్యవస్థను అనారోగ్యకరంగా మారుస్తున్నాయి. మధ్యతరగతి ఓట్ల కోసం సరైన విధానాల మీద ఆధారపడకుండా, వారిని కూడా ఉచితాలు, తాత్కాలిక పథకాల మీద ఆధారపడేవారుగా తయారుచేస్తూ పరాధీనులుగా మారుస్తున్నారు. ఎప్పుడైనా మధ్యతరగతి కాస్త ఆలోచిస్తున్నారు అనుకుంటే, మీడియాను ఉపయోగిస్తూ కులం, మతం వంటి వాటి చుట్టూ భావోద్వేగాల్ని రెచ్చగొడుతున్నారు. ఆర్థిక వృద్ధికి, పారిశ్రామిక వృద్ధికి చోదక శక్తులుగా ఉండే మధ్యతరగతి సంఖ్యను వేగంగా పెంచటాన్ని పట్టించుకోకపోవటం విచారకరం.

మన దేశంలో కనీసం 60 శాతం మందికి ప్రామాణికంగా మధ్యతరగతి అనిపించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే భారతదేశ మధ్యతరగతి జనాభా 2027 నాటికి చైనాను, పారిశ్రామిక విప్లవం వల్ల అడ్వాంటేజ్ పొందిన అమెరికా, ఐరోపాలోని మధ్యతరగతిని అధిగమిస్తుందని, 2039 నాటికి భారత జనాభాలో 100 కోట్ల మంది మధ్యతరగతి కేటగిరి కిందకు వస్తారని కొన్ని అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం వీరు పేరుకి మాత్రమే మధ్యతరగతి అనిపించుకుంటున్నారు. వీరిని నిజమైన మధ్యతరగతిలోకి తేవటం భారత్‌కి పెద్ద అవకాశమైనా ప్రభుత్వాలు అందుకు తగ్గ విధానాలను అమలు చేస్తేనే సాధ్యం.

**చైనాలా త్వరగా తప్పులు దిద్దుకోలేకపోతున్న భారత్**

చైనా మధ్యతరగతి కంటే ఇండియా మధ్యతరగతికి ప్రయివేటు వినియోగం ఎక్కువ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేయటంలో కూడా మన మధ్యతరగతి కీలక పాత్ర పోషించగలిగే అవకాశమున్నా.. చైనాలాగా వేగంగా తప్పులు దిద్దుకోకపోవటంతో భారత్ ఇంకా ఆశించిన స్థాయిని అందుకోలేకపోతోంది. ఆర్థికంగా వృద్ధిని సాధించలేకపోతోంది. ఆర్థిక సంస్కరణలు వచ్చిన 1990ల నుంచి కూడా ప్రపంచ జీడీపీలో చైనా వాటా మూడు రెట్లు పెరగ్గా, భారత్ వాటా రెండు రెట్లు మాత్రమే పెరిగింది.

భారత్ తనకున్న అవకాశాన్ని అందుకునేందుకు సవాళ్లను గుర్తించి అధిగమించే రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించటం ఇప్పుడు అవసరం.

ప్రపంచ అసమానతల నివేదికను చూస్తే, మన దేశంలో ఆర్థిక సరళీకరణ వల్ల డబ్బున్నవాళ్లు ఇంకా డబ్బున్నవాళ్లు అవుతుండగా, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి చాలా నెమ్మదిగా పెరుగుతున్నారు. పేదరికం కొనసాగుతోంది. మధ్యతరగతి కూడా గట్టి తాకిడి వస్తే పేదలుగా మారిపోతున్నారు. నిజమైన మధ్యతరగతి అంటే ఒకసారి పేదరికం నుంచి బయటపడ్డాక, తిరిగి అందులోకి జారిపోకూడదు. కానీ మన ప్రభుత్వాల విధానాల వైఫల్యం, నిర్లక్ష్యం వల్ల మన దేశంలో సంక్షేమం పేరుతో ఎన్ని తాత్కాలిక పథకాల్ని అమలు చేసినా పేదరికం దశాబ్దాల తరబడి కొనసాగుతోంది. ఇందులో ఆరోగ్య రంగంలో వైఫల్యం కీలకమైనది. సమగ్ర ఆరోగ్య విధానాన్ని అమలు చేయకపోవటం వల్ల, తక్కువ ఖర్చుతో దేశంలో జేబుఖర్చు లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన ఆరోగ్యం అందించే అవకాశం ఉన్నా ఆ పని చేయకపోవటం వల్ల.. కేవలం అనారోగ్య ఖర్చుల వల్ల ఏటా 5.5 కోట్ల మంది అప్పటి దాకా పేదలు కానివారు పేదరికంలోకి జారిపోతున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వాల వైఫల్యం. ఇంతకు

ముందే చెప్పుకున్నట్టు, కొవిడ్-19 సమయంలో కఠిన లాక్‌డౌన్ వల్ల దాదాపు 3.2 కోట్ల మంది మధ్యతరగతి నుంచి దిగువకు జారిపోయారు. ప్రభుత్వం వ్యాక్సినేషన్‌ను కాస్త ఆలస్యంగానైనా సమర్థంగా అందించినా, పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అస్తవ్యస్త అమలు వల్ల అసంఘటిత రంగంలో ఉపాధి తిరిగి పట్టాలెక్కటం అంత సులభం కాలేదు.

దీంతోపాటు భారతదేశం ఉత్పత్తి రంగాన్ని విస్మరించి నేరుగా సేవల రంగాన్ని అభివృద్ధి చేసింది. దీనివల్ల మధ్యతరగతి పెరుగుదల కొంతమేరకే పరిమితం కాగా.. ఉన్న మన మధ్యతరగతిలో కూడా సంపన్న వర్గాల ధోరణులు ఎక్కువగా ఏర్పడ్డాయి. సంపన్నులకు, మధ్యతరగతికి మధ్య పెద్దగా తేడా పలు సందర్భాల్లో కనిపించదు. చిన్న పట్టణాలను ఆర్థిక ఎంటర్‌ప్రైజెస్‌గా రూపొందించాలని, ఉత్పత్తి రంగంలో చైనా వదిలేసిన రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుని వేగంగా ఎదగాలని దాదాపు పుష్కర కాలం క్రితమే జేపీ అనేకమార్లు చెప్పినా వినిపించుకోకపోవటం వల్ల యూపీయే హయాంలో వృద్ధి ఉన్నా ఉపాధి ఏర్పడలేదు. ప్రస్తుతం ప్రపంచంలోనే అతి ఎక్కువ జనాభా గల దేశమైన భారత్‌లో జనసంఖ్య 2016 నాటికి 180 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అలాగే యువ జనాభా ఉన్న దేశం కూడా ఇండియానే. దీనివల్ల మధ్యతరగతి సంఖ్యను వేగంగా, పెద్దఎత్తున పెంచుకోవటానికి భారత్‌కి అవకాశం ఉంది. అయితే ఈ యువ అవకాశాన్ని నాణ్యమైన ఉపాధి అవకాశాలతో సద్వినియోగం చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. 2030 నాటికి దేశంలో 25 కోట్ల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుంటారని అంచనా. ఈ పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోవాలి. ముఖ్యంగా పాఠశాల స్థాయిలో నాణ్యమైన విద్యను అందించే ఏర్పాటు, నైపుణ్యాలను పెంచటం చేస్తూ ఉత్పత్తి రంగాన్ని పెద్దఎత్తున ప్రోత్సహించాలి. విదేశాల్లో ఉన్నత స్థానాలను అందుకున్న అజయ్ బంగా, సోనియా సింఘాల్, నీల్ మోహన్, లీనా నాయర్ లాంటి భారతీయులకు అందిన మంచి విద్య ఈ దేశంలో ప్రతి బిడ్డకూ అందాలి. ఈ రంగంలో ఇప్పుడు చేస్తున్న ఖర్చుతోనే ఇది పూర్తిగా సాధ్యం. కావలసిందల్లా రాజకీయ సంకల్పం, విద్యలో సక్సెస్‌కి నిర్వచనం మార్చటం. అలాగే ఆర్థిక భారం లేకుండా ప్రతి కుటుంబానికీ ప్రాథమిక స్థాయి నుంచి మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందిస్తూ ఉత్పాదకతను పెంచాలి. వైద్య, ఔషధ రంగాల్లో మన దేశానికున్న సానుకూలతల దృష్ట్యా ఇది కూడా పెద్దగా అదనపు వ్యయం లేకుండానే సాధ్యం. యధాతథ పరిస్థితి కొనసాగిస్తూ భారత్ అభివృద్ధికి ఉన్న అనుకూల అవకాశాల్ని అతిగా ఊహించుకుని మితిమీరిన ఆత్మవిశ్వాసం ప్రదర్శించటం తగదు.

విదేశీ ఎఫ్‌డీఐలను ఆకర్షించటానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కూడా భారత్ ఇంకా అనేక మెట్లు ఎక్కాల్సి ఉంది. అలాగే మరింత శాస్త్రీయంగా, లోతుగా మార్కెట్ విశ్లేషణల్ని రూపొందించి పారదర్శకంగా అందుబాటులోకి తెచ్చే పద్ధతుల్ని అమలు చేయాలి. మౌలిక వసతులపై ఇటీవల శ్రద్ధ పెరిగినా, గతేడాది కన్నా ఈ బడ్జెట్‌లో 33 శాతం అదనపు కేటాయింపులతో 13 లక్షల కోట్లకు పైగా ఈ రంగంలో వెచ్చిస్తున్నా ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. అలాగే బ్యూరోక్రసీలో అలసత్వాన్ని, అసమర్థతను ప్రక్షాళన చేసి ఆధునీకరించే సంస్కరణల్ని తేవాల్సి ఉంది. అదానీ లాంటి వారి పట్ల ఆశ్రిత పక్షపాతం ఉందనే అనుమానాలకు ఆస్కారం లేకుండా పెట్టుబడుల పట్ల నిష్పాక్షికంగా వ్యవహరించే ఏర్పాట్లు చేయాలి. చట్టబద్ధపాలనను సక్రమంగా అమలు చేయాలి. రాజకీయ పార్టీలు చట్టవిరుద్ధంగా ఎన్నికల్లో డబ్బు ఖర్చు కోసం అదానీ లాంటి వారి నుంచి డబ్బు తీసుకోవటం, ప్రతిఫలంగా వారి పట్ల ఆశ్రిత పక్షపాతం చూపటం వంటివి జరక్కుండా ఎన్నికల సంస్కరణల్ని తీసుకురావాలి. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి వాటి వల్ల ఎన్నికల్లో అక్రమ డబ్బుకు కళ్లెం వేయవచ్చు.

### అసంఘటిత రంగంలోని వారిని సంఘటిత రంగంలోకి తేవటం కీలకం

మధ్యతరగతిని వారి వృత్తిని బట్టి నిర్వచిస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. వస్తువుల కొనుగోలు ద్వారా, పన్ను పరిధిని విస్తరించటం ద్వారా వీరు దేశ ఆర్థికానికి గణనీయంగా వృద్ధినిస్తారు. పరోక్ష పన్నుల ద్వారా కూడా ఎక్కువ చెల్లించేది వీరే. దీంతో బడ్జెట్‌లు రాగానే మధ్యతరగతికి ఏదో చేయటమంటే, ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితిని పెంచటం, రాయితీలివ్వటం అనే ఆనవాయితీ వస్తోంది. అయితే సంఘటిత రంగానికి బయట 90 శాతానికి పైగా ఉన్నారు, అలాగే కొంతమేర ఆస్తులు ఉండి నెలవారీ ఆదాయమిచ్చే ఉపాధి లేనివారు ఉన్నారు.. వీరందరి గురించీ చర్చ జరగాలి. మన దేశంలో ఆదాయపు పన్ను మన జీడీపీకి తగిన స్థాయిలో లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ విమర్శ చేసేవాళ్లలో ఆర్థిక సంస్కరణల్ని, కార్మిక సంస్కరణల్ని వ్యతిరేకించేవారు కూడా ఉన్నారు. ఈ సంస్కరణల్ని తేకుండా.. తప్పించుకునే అవకాశం లేక పన్నులు కట్టే ఉద్యోగుల నుంచే ఇంకా పన్నులు వసూలు చేయటం పరిష్కారం కాదు. పన్నులకు తగ్గ సేవలు అందించలేని ప్రభుత్వం పన్నులు పెంచే అధికారాన్ని ఎలా వినియోగిస్తుంది? కాబట్టి పన్నుల బేస్‌ను విస్తృతపరచటం అవసరం. ఇప్పుడు పన్నుల కడుతున్నవారి మీద మితిమీరిన భారం మోపటం అసంబద్ధం. పనిచేయగలిగిన వారందరికీ సంఘటిత రంగంలో ఉపాధి లభించే ఏర్పాట్లు చేయటం ఇందుకు పరిష్కారం. ఇలా చేయాలంటే సంక్షేమం పేరుతో అప్పులు చేసి ఉచితాలు, తాత్కాలిక పథకాలకు స్వస్తి చెప్పాలి. జీతాలు, వడ్డీలు వంటి రోజువారీ ఖర్చులకు అప్పులు చేసే పద్ధతి పోవాలి. రాష్ట్రాల్ని, దేశాన్ని దివాలా తీయించే, ప్రభుత్వోద్యోగుల కోసం భవిష్యత్ తరాల మీద భారం మోపే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) తీసుకురావటం వంటి దుర్మార్గపు ఎన్నికల రాజకీయానికి స్వస్తి చెప్పాలి. పెన్షన్ కొద్దిశాతం ఉద్యోగులకేనా, ప్రజలందరికీ అక్కర్లేదా? వ్యవసాయ రంగంలో స్వేచ్ఛా మార్కెట్ సంస్కరణల్ని తీసుకురావటంతోపాటు గ్రామాలకు ఆర్థిక కేంద్రాలుగా చిన్న

పట్టణాలను ప్రణాళికాబద్ధంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేయాలి. అక్కడ రోజువారీ పాలన సవ్యంగా జరిగేలా, మౌలిక సేవలు నాణ్యమైన రీతిలో అందేలా స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలి. మౌలిక వసతుల కోసం పెట్టుబడులను సమీకరించాలి.

**పరాధీన మనస్తత్వం నుంచి బయటపడాలి**

జాతీయోద్యమ కాలం నాటి నుంచి మధ్యతరగతి ఈ దేశ పురోగమనాన్ని మార్చటంలో కీలక పాత్ర పోషించింది. స్వతంత్రం వచ్చాక సాంప్రదాయ నాయకత్వాన్ని మార్చటంలో మధ్యతరగతి కీలక పాత్ర పోషించింది. దీనివల్ల సాంప్రదాయ నాయకత్వం వైదొలగటమో, లేదా తన పద్ధతుల్ని మార్చుకుని ప్రగతిశీలం కావటమో జరిగింది. ఇప్పటి భారతీయ మధ్యతరగతి ఆధునిక భాషను ఉపయోగిస్తుంటారు. ఆధునిక మార్పుల కోసం కృషి చేస్తుంటారు. అణగారిన వర్గాల తరపున కృషి చేస్తుంటారు, మైనారిటీలకు గొంతుకగా మారతారు. అయితే వారు పాశ్చాత్య దేశాల్లోలా స్వతంత్రులు కారు.

ఇంతకుముందే అనుకున్నట్టు, ప్రభుత్వాల తాత్కాలిక పథకాలు, ఉత్పత్తి రంగాన్ని విస్మరించి నేరుగా సేవల రంగానికి మళ్లటం, ఉపాధి లేని వృద్ధి ఈ పరాధీన ప్రవృత్తికి కారణం. అందువల్లే నేటి మన మధ్యతరగతి ఇంకా ఇతరుల మీద ఆధారపడతారు, ఫ్యూడల్ తత్వంతో ఆధారపడే తత్వాన్ని ప్రోత్సహిస్తారు. ప్రభుత్వం మీద ఆధారపడే తత్వం నుంచి బయటపడలేదు. మధ్యతరగతి నుంచి వచ్చినవారు ఎదిగారంటే పొదుపు పాటించటం వల్ల. ఆ విలువలకు తిలోదకాలిచ్చి ప్రభుత్వాలు ఇప్పుడు వ్యవహరిస్తూ పేదరికం కొనసాగేలా, కొత్త మధ్యతరగతి రూపుదిద్దుకోకుండా చేస్తున్నా పట్టించుకోవటంలేదు.

**నినాదాలు ఆపి ప్రభుత్వం పాత్ర, విధానాలపై అవగాహన పెంచుకోవాలి**

అలాగే మధ్యతరగతి సంఖ్య పెరుగుతున్న కొద్దీ మన దేశంలో ఉన్న సంక్లిష్టతల వల్ల మధ్యతరగతిలో కూడా డిమాండ్ల మధ్య ఏకాభిప్రాయం కొరవడుతోంది. దేశానికి ఏం కావాలో రోడ్‌మ్యాప్ లేకుండా నినాదాలు ఎక్కువయ్యాయి. అధికారం అంటే ఏమిటి, అధికారం ఎలా వస్తుంది, అధికారం ద్వారా ఏం సాధించాలి? అనే స్పష్టత లేకుండా యధాతథ స్థితినే కొనసాగించే అధికార వ్యవస్థలో భాగస్వాములవ్వాలని దిగువ వర్గాల వారు ఎక్కువగా భావిస్తున్నారు. ఉన్నత మధ్యతరగతి వర్గాల మధ్య కూడా విభేదాలకు కొదవ లేదు. లెఫ్టా, రైటా, ఈ ప్రాంతం, ఆ ప్రాంతం, రిజర్వేషన్లు వంటి విభేదాలతో మౌలిక లక్ష్యంపై సరిగా గురిపెట్టలేకపోతున్నారు. రాజ్యం పాత్ర, ఓటింగ్, ప్రాతినిధ్యం, ప్రజాస్వామ్యం వంటి భావాలపై కూడా ఏకాభిప్రాయం లేదు. రాజకీయ పార్టీలకు దిశానిర్దేశం చేసే పౌర సమాజ సామర్థ్యాన్ని సంతరించుకోలేకపోతున్నారు. పేదలతో సంబంధం లేకుండా గేటెడ్ కమ్యూనిటీలు, షాపింగ్ మాళ్లు వగైరాలు ఉన్నత మధ్యతరగతివారి కోసమే పెరగటం సమాజంలో అంతరాన్ని పెంచుతున్నాయి.

ఈ వైఫల్యాన్ని అధిగమించి ఉమ్మడి లక్ష్యాల కోసం సంఘటితంగా పనిచేయటం మధ్యతరగతి పెంపొందించుకోవాలి. ప్రవాహంలో కొట్టుకుపోకుండా, వాస్తవాల ఆధారంగా ఆలోచించి ప్రభుత్వం పాత్ర ఏమిటో గుర్తించాలి. ప్రభుత్వం ఏ పనులు చేయాలో, మధ్యతరగతి సంఖ్యను ఎలా పెంచాలో గుర్తించి, ఆ లక్ష్యసాధనకు నిర్మాణాత్మక కృషి చేయాలి. మన దేశంలో సమాజాన్ని మించుతూ ప్రభుత్వం చెలాయిస్తున్న మితిమీరిన పెత్తనాన్ని మధ్యతరగతే నిలువరించి ప్రజాస్వామ్యాన్ని పెంపొందించాలి. కాలక్రమంలో ఈ మార్పు వస్తుందని ఇప్పుడు మనం బాధ్యత విస్మరిస్తే, దేశం భారీ మూల్యం చెలిస్తుంది. ఇప్పుడు భారత్‌కున్న సమయం ఎంతో విలువైనదనే వాస్తవం మనలో నిరంతరం మెదులుతుండాలి.

**ప్రజాస్వామ్యం సంపన్నులకూ అవసరమే**

ఇదే సమయంలో, మన సంపన్న వర్గాల్లో, వనరులున్నవారిలో ప్రజాస్వామ్యం పట్ల విముఖత కలుగుతోంది. కానీ ఆర్థిక వ్యవస్థ పటిష్ఠమవ్వాలంటే, అందుకు అవసరమైన మధ్యతరగతి రూపుదిద్దుకోవాలంటే అందుకు కేవలం ఆర్థిక సంస్కరణలు చాలవు. ప్రజాస్వామిక సంస్కరణలు కూడా అవసరం. కాబట్టి కాస్త ముందుచూపు ఉంటే.. అందరికీ ఎదిగే అవకాశాలున్న నిజమైన ప్రజాస్వామ్యం సంపన్నులకు కూడా అవసరం. అందుకే, యువ భారత్ ముందున్న నాణ్యమైన మధ్యతరగతి సంఖ్య పెంచటమనే లక్ష్య సాధన కోసం స్వతంత్ర పోరాటంలోలా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి.

**ఎన్నారైలూ తోడ్పాటు అందించాలి**

అలాగే భారతీయ మధ్యతరగతి ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లోనూ గణనీయ సంఖ్యలో ఉన్నారు. అక్కడ వృద్ధికి దోహదం చేస్తున్నారు. భారతీయుల ఆధిపత్యం ఉన్న ప్రపంచ సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు డిమాండ్ కొనసాగుతుండటం వల్ల కొత్త, ఆధునిక, మొబైల్ మధ్యతరగతిని తయారుచేస్తోంది. సిలికాన్ వేలీ నుండి బెంగళూరు, హైదరాబాద్‌కు సిబ్బంది వస్తూపోతుండటం వల్ల కొత్త గ్లోబల్ వినియోగదారులు తయారవుతున్నారు. ఇంగ్లండ్, దుబాయ్ వంటి ప్రాంతాల్లో భారతీయ మధ్యతరగతి ప్రభావం గణనీయంగా ఉంది. వీరంతా భారత్‌లో మధ్యతరగతి సంఖ్య పెంచటానికి తమ వంతు తోడ్పాటు అందించాలి. తమ దేశాల అనుభవాలతో భారత్‌లో ప్రజాస్వామిక వ్యవస్థల్ని బలోపేతం చేసే కృషికి మద్దతు ఇవ్వాలి.

**నాయకత్వం అందించే నమూనాను ఆవిష్కరించాలి**

మధ్యతరగతి తమ జీవితాల్ని చూసుకుంటూనే, ఆదాయాల్ని పెంచుకుంటూనే సమాజం కోసం కొంత సమయం, వనరులు కేటాయిస్తూ నాయకత్వాన్ని అందించే ఒక ఆధునిక పోటీ ప్రపంచ రీతి నమూనాను ఆవిష్కరించాలి. తద్వారా దిగువాదాయ వర్గాలు వేగంగా మధ్యతరగతిగా ఎదిగి నాయకత్వాన్ని అందించగలుగుతారు. అలాగే మధ్యతరగతిలోనూ మహిళల పాత్ర ఇంకా తక్కువగా ఉంది. వారిని కార్మిక శక్తిలో, సంస్థాపక సామర్థ్యంలో. రాజకీయ నాయకత్వంలో పెంచేందుకు కృషి

# అదానీ: మోదీ-బీజేపీ, మోదీ+బీజేపీ



పూర్వం న్యాయం కోసం ఇద్దరు వ్యక్తులు రాజుగారి సభకు వెళ్లారట. వారిలో ఒకరు అప్పు ఇచ్చినవారు, మరొకరు తీసుకున్నవారు. బంగారు నాణేల్ని అప్పుగా తీసుకున్న వ్యక్తి వాటిని తిరిగి చెల్లించేశానని చెబుతుండగా, ఇవ్వలేదని అవతలి వ్యక్తి వాపోతున్నాడు. కేసు విచారణ సందర్భంగా రాజుగారు ఎన్నిసార్లు అడిగినా మొదటి వ్యక్తి డబ్బులు ఇచ్చేసినట్లు న్యాయదండం మీద ప్రమాణం చేస్తున్నాడు. ఆయన కూడా నిజాయతీగానే చెబుతున్నట్లు రాజుగారికి అనిపించింది. అయితే నిశితంగా పరిశీలించిన మీదట రాజుగారు ఒక విషయాన్ని గమనించారు. తన చేతిలోని కర్రను అవతలి వ్యక్తికి ఇచ్చాక అప్పు తీసుకున్న వ్యక్తి ప్రమాణం చేస్తున్నాడు. రాజుగారు మరోసారి ప్రమాణం చేయమని అడిగారు. అప్పుడు కూడా కర్ర అవతలి వ్యక్తికి ఇచ్చాకే మొదటి వ్యక్తి ప్రమాణం చేశాడు. దీంతో రాజుగారు ఆ కర్రను విరగ్గొట్టమని ఆదేశాలు జారీ చేశారు. అందులో నుంచి బంగారు నాణేలు జలజలమని రాలాయి. బహుశా మనలో చాలామందికి పరిచయమున్న ఈ కథలోలాగే అదానీ విషయంలో మోదీ పార్లమెంటులో స్పందించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాల తీర్మానం చర్చ జరుగుతున్న సమయంలో అదానీపై కాంగ్రెస్ పార్టీ, కొన్ని విపక్షాలు పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రశ్నల్ని సంధించినా మోదీ నేరుగా అదానీ పేరు ప్రస్తావించలేదు. కానీ, తాను నిజాయతీపరుడినని పదేపదే చెప్పుకున్నారు. నేను ఒక్కడిని ఒకపక్క, విపక్షాలన్నీ మరోపక్క అంటూ తన నిజాయతీని చాటుకునే ప్రయత్నం చేశారు. తన పార్టీ గెలుపు కోసం చట్టవిరుద్ధంగా నిధులు తీసుకోలేదు అని మాత్రం చెప్పలేదు. పార్టీ ప్రస్తావన రాకుండా చూసుకున్నారు. నిజాయతీ దగ్గరికొచ్చే సరికి పార్టీ దండాన్ని వదిలేసి వ్యక్తిగతంగా మాట్లాడుతూ, ఎన్నికలు, అధికారం దగ్గరికొచ్చేసరికి మాత్రం పార్టీని కలుపుకుంటూ మాట్లాడే ధోరణి మోదీలో స్పష్టంగా కనిపించింది. పార్టీ కన్నా తాను వ్యక్తిగతంగా గొప్ప అనటం బీజేపీ మౌలిక సిద్ధాంతానికి విరుద్ధమైనా, ఆయన మాటలకు వారి పార్టీ నేతలు బల్లలు చరవవచ్చుగానీ, అంతకంటే భయంకరమైన, దేశ రాజకీయాన్ని కుళ్లబొడుస్తున్న అంశం అందులో ఉంది.




అదానీ వ్యవహారం మోదీ వ్యక్తిగత అవినీతి అని ఎవరూ అనరు, కానీ ఒక్క ఓటు కోసం కూడా పోటాపోటీగా ఎగబడి డబ్బుల్ని, తాయిలాల్ని గుమ్మరించే మన ఎన్నికల వ్యవస్థలో నల్లడబ్బు లేకుండా గెలవటం అసాధ్యమైనందున ఆ నిధుల కోసం అదానీ లాంటి వారి పట్ల ఆశ్రిత పక్షపాతం చూపాల్సి వస్తోందనే విషయాన్ని ఆయన కప్పిపుచ్చలేరు. వ్యక్తిగత నిజాయతీతో మాటల గారడీ చేయకుండా, వ్యవస్థీకృత నిజాయతీతో పార్టీల నిధుల సేకరణ చట్టాన్ని ప్రక్షాళన చేయటం, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి, కొందరు వ్యక్తుల ఆస్తులుగా మారిన పార్టీల్ని ప్రజాస్వామీకరించటం వంటి మార్పుల్ని మోదీ తీసుకురావాలి. 2014, 2019లో ప్రజలు ఆయనకిచ్చిన తీర్పుకి అర్థం ఇదే.

చేయాలి. నాయకత్వ సామర్థ్యాన్ని పెంచటంలో స్థానిక స్వపరిపాలన ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి పాఠశాలలు. కానీ స్థానిక ప్రభుత్వాలకు అధికారాల్ని, నిధుల్ని బదిలీ చేసి మూడో అంచె ఫెడరలిజాన్ని బలోపేతం చేయాలన్న డిమాండ్ ఈవేళ మధ్యతరగతి నుంచి కూడా రావటం లేదు. ఎన్ని సమస్యలున్నా జవాబుదారీతనమున్న స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యామ్నాయం లేదు. హైదరాబాద్‌లోనో, ఢిల్లీలోనో కూర్చున్న పాలకుడు దేవుడే అయినా కూడా ప్రజల సమస్యల్ని పరిష్కరించటం అసాధ్యం. స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉంటేనే, ప్రజల సమస్యలకు పరిష్కారం ఎప్పటికప్పుడు లభిస్తుంటుంది, మద్యం, మత్తుపదార్థాల వంటి వాటి నియంత్రణ సాధ్యమవుతుంది, తన జీవితానికి-ఓటుకి మధ్య సంబంధం ప్రతి పౌరునికీ అర్థమవుతుంది, ప్రతి వ్యక్తీ తన జీవితంలో తానే హీరోగా జీవించగలుగుతాడు.

**మధ్యతరగతి నేతృత్వంలో ఉద్యమాల తీరూ మారుతుంది**

మధ్యతరగతి నేతృత్వం వల్ల ఉద్యమాలు జరిగే తీరులో కూడా మార్పు వస్తుంది. రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో ఉన్నవారి నుంచి మనం దీర్ఘకాలిక పోరాటాల్ని ఆశించలేం. వీరిని ఆవేశాల్ని పక్కదోవ పట్టించటం సాంప్రదాయ రాజకీయానికి పెద్ద కష్టం కూడా కాదు. వీరి నుంచి నాయకత్వం ఎదిగినా వారు కూడా పాత రాజకీయంలో కలిసిపోకుండా ఎదురీది పోరాడటం అంత సులభం కాదు. ఆలోచనతో, అవగాహనతో, నైతిక, కుటుంబ విలువల్ని

# వైరుధ్యాల్ని దాటించే ఎజెండా

ప్రస్తుత భారతదేశం రెండు రకాల వైరుధ్యాల మధ్య సంఘర్షణలో ఉంది. ఒకటి, పేదలు, నైపుణ్యాలు, అవకాశాలు అందనివారికి అవకాశాల్ని అందించటం, మరోటి, మార్కెట్ ఆర్థిక వ్యవస్థని ప్రోత్సహించాల్సి రావటం. అంటే, మార్కెట్ల ఆర్థిక విధానాలు, ప్రజాస్వామ్య రాజకీయాల మధ్య సంఘర్షణ. ఆర్థిక విధానాల్ని అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడులను పట్టణ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాలు ఎక్కువగా సమర్థిస్తుండగా.. తమ అస్తిత్వం కోసం పోరాటంలో భాగంగా సమర్థించే దిగువ, పేద వర్గాల వారు ఎక్కువగా రాజకీయ భాగస్వామ్యాన్ని డిమాండ్ చేస్తున్నారు. నూతన భారతదేశ నిర్మాణానికి వీరిద్దరినీ సమతుల్య పరచాల్సిన బాధ్యత భారత్‌లో మధ్యతరగతిపై ఉంది. ఈ దిశగా మధ్యతరగతి వినిపించే వాదనలకు గణనీయ సంఖ్యలో సమాజ ఆమోదం కూడా ఉంది. ప్రభుత్వాలు కూడా వీరి లేవనెత్తే అంశాల్ని విస్మరించే పరిస్థితి లేదు. అయితే ఇది వ్యవస్థను మార్చే స్థాయికి మన దేశంలో ఇంకా చేరుకోలేదు.

ఈ నేపథ్యంలో, ఇండియా ఇప్పటికీ మధ్యతరగతి దేశం కాదు, పేద దేశమే అని ఒప్పుకుని మధ్యతరగతిని పెంచే చర్యలు తీసుకోవాలి.

మధ్యతరగతి పెరగటానికి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను పర్యావరణహితంగా బలోపేతం చేయాలి. అప్పులు చేసి తాత్కాలిక పథకాలు, పాత పెన్షన్ పద్ధతి (ఓపీఎస్)కి వెళ్లటం వంటి చర్యలకు స్వస్తి చెప్పాలి. సంక్షేమానికి–అభివృద్ధికి మధ్య సమతూకం తీసుకురావాలి. అప్పులు తెచ్చే డబ్బును భవిష్యత్తు అవసరాలకు పెట్టుబడులుగా మాత్రమే ఉపయోగించాలి. ఎప్పుడైతే దేశం ఆర్థికంగా పెరిగి జీడీపీ పెరుగుతుందో, ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందో ప్రజల నాణ్యమైన ఆదాయాలు పెరిగి వారి వ్యవహారశైలి మధ్యతరగతి స్థాయిని సంతరించుకుంటుంది. ఫ్యూడలిజం వంటి ప్రభావాలున్నా కూడా ఢిల్లీలోలాగా డబ్బు కోసం లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోగలుగుతారు, ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయో అర్థం చేసుకుని ప్రశ్నించగలుగుతారు. ఇందుకోసం ఆర్థిక సంస్కరణల్ని పెంచటంతోపాటు చట్టబద్ధపాలనను సక్రమంగా అమలు చేయాలి. పెట్టుబడులు పెడితే పక్షపాతం లేకుండా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, కాంట్రాక్టులు సక్రమంగా అమలవుతాయని నమ్మకం కలిగేలా చట్టబద్ధపాలనను అమలు చేయాలి. అదే సమయంలో, ఇలా సంపద సృష్టి జరగాలంటే ప్రభుత్వం పాత్ర ఒక్కటే చాలదు. ప్రజల భాగస్వామ్యం ఉండాలి. వాస్తవానికి సంపద ప్రజల నుంచే వస్తుంది. కాబట్టి వారు అవకాశాల్ని అందుకుని సంపద సృష్టిలో భాగమయ్యేలా నాణ్యమైన విద్య, ఆరోగ్యాల్ని వారిపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా అందించగలగాలి. ముఖ్యంగా పాఠశాల విద్య, ప్రాథమిక వైద్యాల్ని వినూత్నంగా, ఆధునిక అవసరాలకు అనుగుణంగా పటిష్ఠం చేయాలి. అధికారాన్ని వికేంద్రీకరించి జిల్లాలు, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిచ్చి పౌర సేవలు సక్రమంగా, సకాలంలో అమలయ్యే ఏర్పాటు చేయాలి. చట్టం అందరికీ సమానంగా వర్తించేలా సంస్కరణల్ని తీసుకురావాలి. పట్టణీకరణకు ప్రాధాన్యతనిచ్చి పర్యావరణహితంగా చిన్న పట్టణాలను అభివృద్ధి చేయాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేయాలి. నగరాలను ప్రత్యామ్నాయ ఇంధన వనరులతో ఆర్థిక చోదక శక్తులుగా తీర్చిదిద్దుతూ స్వయంప్రతిపత్తిని ప్రోత్సహించాలి. నగరాల్లో ప్రణాళికాబద్ధంగా, నాణ్యమైన పౌర సేవలు సక్రమంగా లేకపోవటంతో మధ్యతరగతి వృద్ధి, జీవన నాణ్యత దెబ్బతింటున్నాయి. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టి, సమర్థులు, నిజాయతీపరులు చట్టసభల్లోకి ప్రవేశించగలిగేలా ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలి. ఓపక్క పర్యావరణహిత ఆర్థిక సంస్కరణలు, మరోపక్క ఈ రాజకీయ, పాలనా సంస్కరణలు ఉంటే నిజమైన మధ్యతరగతి మన దేశంలో ఎదిగి రాష్ట్రాల మధ్య అంతరం తగ్గిస్తూ దేశ సుస్థిరాభివృద్ధికి దోహదం చేయగలుగుతారు, దీర్ఘకాల భవిష్యత్తుకు భరోసానివ్వగలుగుతారు.

కాపాడుకుంటూ, మధ్యేమార్గంలో, రాజ్యాంగబద్ధంగా, నిర్దిష్టంగా మధ్యతరగతి నాయకత్వం వహిస్తున్నప్పుడు ప్రభుత్వాలు స్పందించకతప్పదు. అప్పుడు వచ్చే మార్పు సమాజంలో శాశ్వతంగా ఉండటంతోపాటు ప్రజాస్వామ్యాన్ని నిరంతరం పరిరక్షించే చైతన్యాన్ని ప్రజల్లో కలిగిస్తుంది. కాబట్టి, మానవాళి చరిత్రలోనే అద్భుత సాంకేతికావకాశాలున్న ఈ యుగంలో, యువభారతంలో మధ్యతరగతి సంఖ్యను వేగంగా పెంచటమే అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణ లక్ష్య సాధనకు మనం బహుముఖంగా చేయాల్సిన పని.

కీలక సమయాల్లో తనకు లభించిన గొప్ప అవకాశాల్ని కాలరాసుకున్న చరిత్ర భారత్‌కు ఉంది. అటువంటి చారిత్రక తప్పిదాల్ని మళ్లీ చేయకుండా జాగ్రత్త వహించటం, లోతైన అవగాహనతో హేతుబద్ధ విధానాలతో వ్యవహరించటం, దేశంలో మేలిమి మార్పులకు దోహదం చేయగల, పౌరసత్వ భావనతో వ్యవహరించగల మధ్యతరగతి సంఖ్యను అభివృద్ధి చేస్తూ అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవటం ఇప్పుడు భారత్‌కి ఎంతో అవసరం.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com


## ఓట్ జుగాడ్: మార్చ్ 2023

### ఓటర్లకు కనిపించని నిజాలు -5

ప్రశ్న: శాస్త్రీయ దృక్పధంతో ఆలోచిస్తూ సుపరిపాలనకు అత్యధిక ఓటర్లచే ఆమోదించబడిన రాజనీతిని ఆచరిస్తూ వ్యవహరించే పార్టీలనేతలకూ, మానవసహజమైన స్వార్ధచింతనతో తాత్కాలిక ప్రయోజజనాలకోసం రాజకీయాలను నిర్వహించే పార్టీలనేతలకూ వారిలోవారి పరస్పర వైరుధ్యపు ఆలోచనల మధ్య ఐదేళ్లకొకసారి జరిగే ఎన్నికల యుద్ధాలలో గెలుపు-ఓటములను శాసించే మూడు దివ్యాస్త్రాలు డబ్బు-మద్యం-జాతీయ ఎన్నికలకమిషన్ ద్వారా మనకు లభించిన ఓట్ ! ఔనా కాదా ?

జుగాడ్ ఓటర్‌గా నా సమాధానం : ముమ్మాటికీ ఔనంటాను! ముందుగా డబ్బు,మద్యం, ఆతరువాత ఓటు గురించి మనకి సమగ్ర మైన అవగాహన కుదరాలి.

1) డబ్బు: ఓటర్ల శారీరిక శ్రమకు తగ్గట్టు, లేదా వారి వృత్తి ధర్మానికి తగ్గట్టు తమ కుటుంబానికి కావలసిన డబ్బు చట్టబద్ధంగా తామే సంపాదించుకుంటారు. సంపాదించుకునే డబ్బుపైనా అలాగే ఖర్చుపెట్టే డబ్బుపైనా కూడా పన్నులు కడతారు. ఈడబ్బు మొత్తం ప్రభుత్వ ఖజానాలో చేరుతుంది. మన డబ్బుపై మనకే నిఘా లేని ప్రస్తుత పరిస్థితిలో మన పాలకులు అప్పులుచేసి పప్పుకూడు తినిపిస్తున్నా, మన డబ్బుని ఎన్నో సందర్భాలలో దుర్వినియోగం చేస్తున్నా ఏమీ చేయలేక పోతున్నాం. పరిస్థితి మారాలంటే నిజాయితీతో మన డబ్బుతో మన వోటుతో పాలనాధికారం కైవసం చేసుకోవాలి. దీనికి మించిన శాంతియుత మార్గం ఇంకొకటిలేదు.

2) మద్యం: కులం,మతం, జూదం, ధూమపానం, కీర్తికాంక్ష, భోగలాలసత్వం, నిద్ర, ఇత్యాది మత్తులలో మద్యంమ్మత్తు కూడా ఒకటి. ఇవన్నీ ఓటర్ల స్వాభిమానాలతో, నీతి శాస్త్రానికి సంబంధించిన సామాజిక రుగ్మతలు. ఓటర్ల వ్యక్తిగత బలహీనతలు. విజ్ఞులైన రాజనీతిజ్ఞులకు రాజ్యసభ నీతి కమిటీ (ethics committee) బాధ్యతలనిస్తే చాలు. అంతవరకూ "నిషేధం" ధర్మాన బీహార్లో కల్తీ మద్యం తాగి సామాన్యులు చనిపోతూనేఉంటారు. ఆంధ్రాలో అంచె లంచెలుగా వేలకోట్లరూపాయిలు దోపిడీ జరుగుతూనే వుంటుంది. ఢిల్లీ పంజాబులలో సాక్షాత్తూ మంత్రులే మద్యం కుంభకోణాలు నిర్వహిస్తూ ఉంటారు.

సమస్య పరిష్కారం సమస్యలోనే దాగి ఉంది. ముల్లుని ముల్లుతోటే తీయడం జుగాడ్ ఓటర్ల పార్టీ పరిష్కార సూత్రం. 20 ఏళ్ల వయసు దాటిన ఓటర్లు మక్కువగా సేవించే బీరులో ఆల్కహాల్ 5 శాతం లోపున ఉంటే, కఠిన మద్యంలో 40 శాతం ఉంటుంది. బీరుని ఆహారపానీయంగా క్రోడీకరించి, ప్రస్తుతం 150 రూపాయిలకు అమ్ముతున్న 650ML సీసా బీరుని, ప్రభుత్వం డ్యూటీల పేరిట చేస్తున్న లూటీని నియంత్రించి, 30 రూపాయిలకు సూపర్ మార్కెట్ల ద్వారా అందించవచ్చు.



**ఎం. పార్థసారథి**
(ఫౌండర్ ప్రెసిడెంట్)

# జుగాడ్ 50:50 రాజనీతి!

**3) జుగాడ్ ఓటు: మన "ప్రతిపాదిత పార్టీ"లో మనకై మనం కోరుకున్న "సమానన్యాయం" సాధించాలంటే, పార్టీల గెలుపు-ఓటములతో ప్రమేయంలేని మన ఓటర్ల ఆలోచనాదృక్పథంలో నమూనా మార్పు రావాలి. అదే జుగాడ్ 50:50 రాజనీతి. సమాజంలోనే బ్రతుకుతున్న ప్రభుత్వోద్యోగులూ, ప్రసార మాధ్యమాల జర్నలిస్టులూ, ప్రజాప్రతినిధులూ, న్యాయవాదులూ వీరందరూ మన ఓటర్ల జాతికి చెందిన వారే! కానీ, ఎవరికివారే తమదైన శైలిలో ఒక "ప్రత్యేకహోదా"ని సంతరించుకుని విలాసవంతమైన జీవితాలను అనుభవిస్తూంటే, సమాజంలో ఆర్థిక అసమానతలతోబాటు ఆర్థికనేరాలు కూడా పెరుగుతున్నాయి. కాబట్టీ, ఈవర్గాల ఓటర్లు కూడా జుగాడ్ ఓటర్ల ఉద్యమానికి 10 వేలు విరాళాలిచ్చి తోడ్పడితే అందరికీ మేలు జరుగుతుంది. జుగాడ్ ఓటర్ కానీ, జుగాడ్ కార్యకర్త కానీ మిమ్మల్ని విరాళమడిగితే, కనీసం 2 వేల రూపాయిలయినా విరాళం ఇచ్చి రసీదు పొంది, మార్పుకోరే జుగాడ్ వోటర్లమని గర్వంగా ప్రకటించుకోండి! ఎన్నికల సమయంలో ఓటర్లంతా సమానమే, కాబట్టీ ఓట్ల వ్యాపారం జరగదు.**

**జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గుర్తుపడతారు. కండువాలుండవు, కటౌట్లుండవు, ఫ్లెక్సీలుండవు. ఎవర్ని ఎన్నుకుంటారో జుగాడ్ ఓటర్ల ఇష్టం.** Internal Democracy shall be the hallmark of Jugaad Model Political System. First preference Vote to "Jugaad party" candidate. Alternative is Jugaad Voter's own choice. **ఈపార్టీ** B-Form **పొందిన అభ్యర్థులందరూ గెలుపు గుఱ్ఱాలే. ఎన్నికల ఖర్చు పరిమితికి మించే ప్రసక్తే లేదు.**

**నమూనా మార్పు** (paradigm shift) **సంకల్పం ఉన్న జుగాడ్ ఓటర్లే తమ కష్టార్జితమైన 2వేల రూపాయలు, లేదా 5వేల రూపాయలు, గరిష్టంగా 10వేల రూపాయలు ఒకే ఒక మారు విరాళమిచ్చి పార్టీని విలువలతో కూడిన "నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం" అనే ప్రాతిపదికపై నిర్మించుకుంటారు. విరాళంతో పాటు ఒక సలహాకూడా ఇవ్వండి. జుగాడ్ (అధినేత రహిత) పార్టీకి పేరు ఓటర్లే నిర్ణయిస్తారు. జుగాడ్ ఓటర్ల "మెజారిటీ-ఓటు" ప్రకారం పార్టీ నిర్వహించబడుతుంది. 10వేల రూపాయిల విరాళదాత "భారత భాగ్య విధాతగా" గుర్తింపబడి, పార్టీ నిర్వహణలో నైనా లేదా క్రియాశీలక ఎన్నికలలో నైనా పాల్గొనవచ్చు. రండి! జుగాడ్ ఓటర్ల నూతన రాజనీతికి స్వాగతం పలకండి! శోభకృత్ నామ సంవత్సర శుభాకాంక్షలతో!**

**Please contact: M.Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:**

Advt.

# స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం మధ్యతరగతి కూడా మాట్లాడటం లేదు

మన దేశంలో ఎన్నికల్లో శాంతియుతంగా అధికార మార్పిడి జరుగుతున్నా, కాలక్రమంలో మన ప్రజాస్వామ్యం కొంత మెరుగవుతున్నా అధికార కేంద్రీకరణ విషయంలో దేశం మరింత చెడిందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజాస్వామ్యం అంటే ఎన్నికల్లో ఓటు వేయటం, స్వేచ్ఛగా మాట్లాడటం మాత్రమే కాదని.. ప్రజాస్వామ్యం అంటే పౌరుల సాధికారత అని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు రాజులుగా, నిరంకుశులుగా ఉంటే, వారు ఎన్నికైనవారైనా కూడా అది ప్రజాస్వామ్యం వచ్చినా అదేరీతిలో వ్యవహరిస్తున్నారని అన్నారు. రాష్ట్రాల్లోని నిరంకుశత్వం ఇటీవలి సంవత్సరాల్లో జాతీయ స్థాయికి ఎగుమతి అయ్యిందన్నారు. గతంలో ఎవరు ప్రధానమంత్రిగా ఉన్నా మంత్రులు తమ శాఖలకు సంబంధించి సొంతంగా నిర్ణయాలు తీసుకోగలిగేవారని, కానీ ఈవేళ యూనియన్ మంత్రులు నామమాత్రమయ్యారన్నారు. ఇది ప్రజల సాధికారతకు తీవ్ర విఘాతమన్నారు.

మరోవైపు ప్రజలకు తమ రోజువారీ జీవితం మీద సాధికారతను పెంచే స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేశారని జేపీ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాలకు సంబంధించి




కాజాలదన్నారు. పీఎం, సీఎంలకి అధికారాలు ఉండాలని, కానీ జవాబుదారీతనంతో ఉండాలని, ప్రజలకు సాధికారతనందించేలా ఉండాలన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉందన్నారు.

'చట్టబద్ధపాలన-భారత ప్రజాస్వామ్యం' అంశంపై ఫోరం ఫర్ డెమోక్రసీ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ విజయవాడలో నిర్వహించిన చర్చాగోష్టికి జేపీ అధ్యక్షత వహించారు.

రాష్ట్రాల్లో మంత్రివర్గం కాగితం మీద మాత్రమే ఉందని, మంత్రులు ఉత్సవ విగ్రహాలుగా మారారని, ముఖ్యమంత్రులు సర్వాధికారులయ్యారని జేపీ అన్నారు. ఇందుకు ఏ రాష్ట్రమూ మినహాయింపు కాదని, ఏ పార్టీ నాయకుడు అధికారంలోకి రాజ్యాంగంలోని లోపాన్ని సరిదిద్దేందుకు సత్సంకల్పంతో 73, 74 సవరణల్ని తెచ్చారని, కానీ చాటభారతం రాసి చివరికి స్థానిక ప్రభుత్వాలకు అధికారాల దగ్గరికొచ్చేసరికి దాటవేశారన్నారు. 73, 74 రాజ్యాంగ సవరణలు సత్సంకల్పంతో తెచ్చిన విఫల సవరణలన్నారు. 'సత్సంకల్పం ఉండటం వేరు, సత్ఫలితాలు రావటం వేరు.. సత్సంకల్పంతో చేసేవారు సత్ఫలితాలను సాధిస్తారనే భ్రమ నుంచి బయటపడాలి' అన్నారు.

73, 74 సవరణల్ని, తాను కీలక పాత్ర పోషించటం వల్ల పార్లమెంటు ఆమోదించిన 97వ రాజ్యాంగ సవరణలోని కొన్ని పేరాల్ని చూశాక కొత్త రాజ్యాంగాన్ని రాయటం ఎంత

ప్రమాదకరమో స్పష్టంగా అర్థమవుతుందని జేపీ అన్నారు. ఒక రాజ్యాంగ సవరణను కూడా సవ్యంగా రాయలేని స్థితిలో మన పాలన సాగుతోందన్నారు. స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికి పాఠశాలలని, స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటంపై ప్రభుత్వాల్ని, పార్టీల్ని మాత్రమే తప్పుపట్టలేమని, పౌర సమాజం నుంచి స్థానిక ప్రభుత్వాల సాధికారత డిమాండ్ కరువైందన్నారు. స్వేచ్ఛ గురించి డిమాండ్ చేసే మధ్యతరగతివారు కూడా స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు, నిధులు గురించి అడగటం లేదన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కులపిచ్చి గురించి 2014కి ముందే హెచ్చరించానని, ఆ వైఫల్యం నుంచి తెలుగు సమాజం ఇప్పటికీ బయటపడకపోవటం వల్ల నష్టం జరుగుతోందని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరు చెబుతున్నారు అని కాకుండా, ఏం చెబుతున్నారు, మంచి చెప్పేవారి మాటల్ని ఆలకించి బాగుపడదాం అనే విజ్ఞత కరువవుతోందన్నారు. తాను సాధారణంగా ప్రజల్ని తప్పుపట్టనని, కానీ మనోడైతే తప్పు చేసినా గుడ్డిగా సమర్థించే ఆటవిక ధోరణి సమాజంలో కొనసాగుతున్నప్పుడు పోలీసులు, కోర్టులు కూడా ఏమీ చేయలేవన్నారు. తుదకు చట్టబద్ధపాలనను పరిరక్షించాల్సింది పౌరుల విజ్ఞత, అప్రమత్తత మాత్రమేనని మర్చిపోకూడదన్నారు. తెలుగు సమాజంలో సమస్యలకు కేవలం అధికారంలో ఉన్నవాళ్లు, పార్టీలు మాత్రమే కారణం కాదని, కులం, మతం, ప్రాంతం వంటి భావోద్రేకాల్లో చిక్కుకుపోయిన మనమందరం బాధ్యత తీసుకోవాలన్నారు.

రాజకీయ పార్టీలు ప్రయివేటు ఆస్తులు కాదని, పార్టీలు ప్రయివేటు ఆస్తులైతే అవి పాలిస్తున్న రాజ్యం కూడా తదుపరి దశలో ప్రయివేటు ఆస్తి అవుతుందని జేపీ హెచ్చరించారు. కొందరు వ్యక్తుల సొంతం కాకుండా, ప్రజల రాజకీయ కార్యకలాపాలకు వేదికలుగా వ్యవహరించేలా పార్టీల్ని ప్రజాస్వామీకరించాలన్నారు. పార్టీలో సభ్యత్వం, నాయకత్వం, ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు అన్నీ ప్రజాస్వామ్యయుతంగా జరగాలన్నారు.

మన దేశంలో అధికారాల విభజన కొరవడిందని, అయితే అసలు సమస్య ఎమ్మెల్యేలు శాసనసభ్యులుగా కాకుండా నియోజకవర్గంలో అప్రకటిత ప్రభుత్వంలా వ్యవహరించటమని జేపీ పేర్కొన్నారు. 'తాము మకుటం లేని మహారాజులమని ఎమ్మెల్యేలు అనుకుంటున్నారు. అధికార పార్టీ శాసనసభ్యుడైతే చాలు కాంట్రాక్టులు, బదిలీలు, పోలీసు కేసులతో హవా చలాయిస్తున్నారు' అన్నారు. శాసనసభలు ఏడాదిలో 6 నుంచి 21 రోజులు మాత్రమే జరుగుతున్నాయని, మేం చెప్పిందే చట్టమనే ధోరణిలో కొందరు నేతలున్నారని, మనం రాచరికంలో ఉన్నట్టుందన్నారు. ప్రజాస్వామ్యం ఒక్కరోజులో రాదని, సుమారు ఎనిమిది వందల ఏళ్ల క్రితం 'మ్యాగ్నకార్టా'తో బ్రిటన్‌లో ప్రజాస్వామ్యానికి అంకురం పడిందని, అలాంటి దేశం కూడా ఇప్పటికీ ఒడిదుడుకులను ఎదుర్కొంటోందన్నారు.



ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసే, ప్రజలకు సాధికారతనిచ్చే పరిష్కారాల్ని అమలు చేయించటం ఇప్పుడు మనందరి ముందున్న సవాలన్నారు.

జస్టిస్ గోపాల గౌడ కీలకోపన్యాసం చేస్తూ.. వాక్ స్వాతంత్ర్యాన్ని, సభలు, సమావేశాలు నిర్వహించే స్వేచ్ఛను హరించేలా ఆంధ్రప్రదేశ్‌లో జీ.వో నెం.1 తీసుకొచ్చారని, ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెడుతున్నారని, అమరావతిలో భూసమీకరణ విషయంలో రైతులతో చేసుకున్న ఒప్పందాలను అతిక్రమించారని ఇవన్నీ చట్టబద్ధపాలనను ఉల్లంఘించటమేనన్నారు. తమ నిధులను వినియోగించే పరిస్థితి స్థానిక సంస్థలకు లేదని, శాసనసభలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం ఇవ్వటం లేదని, ప్రజాస్వామ్యం కంటే రాచరిక పాలనే నయమని ప్రజలు అనుకునే పరిస్థితి తెచ్చారన్నారు.

ప్రతిపక్షాలకు నిరసన తెలిపే అవకాశాలు ఇవ్వకుండా ఏపీ, తెలంగాణల్లో అడ్డుకుంటున్నారని, మాట్లాడే అవకాశం లేకుంటే చర్చించేదెలా అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విమర్శించారు.

కొత్తగా వచ్చిన శక్తులు తాము రాజ్యాంగానికి అతీతులమన్నట్టు వ్యవహరిస్తున్నాయని ఏపీ మాజీ అడ్వకేట్ జనరల్ సత్యప్రసాద్ అన్నారు. ప్రజలు తమకు మెజారిటీ ఇచ్చారు కాబట్టి తమను నియంత్రించే అధికారం కోర్టులకు కూడా లేదన్నట్టు వ్యవహరిస్తున్నారన్నారు.

తమకు ఎదురులేకుండా అధికారం చెలాయించాలనే కోరిక ఎన్నికైన నేతల్లో ప్రబలంగా కనిపిస్తోందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య చిన్నయసూరి అన్నారు. ప్రజాస్వామ్యం సమస్యలను ఎదుర్కొంటోందని, నిస్పృహకు గురవ్వాల్సిన పనిలేదని.. ఏకస్వామ్యాన్ని ఎలా నిలువరించాలి, ప్రజాస్వామ్యాన్ని ఎలా బలోపేతం చేయాలి అని చర్చ చేసి పరిష్కారాలు అమలు చేసేందుకే ఫోరం ఫర్ డెమొక్రసీ అండ్ డెవలప్‌మెంట్ వేదికను ప్రారంభించామని తెలిపారు.

# సంక్లిష్ట పరిస్థితులున్నా.. వేగంగా వృద్ధి అవకాశాలు

## -ఆర్థిక సర్వే 2023-

కొవిడ్ ప్రభావం నుంచి వేగంగా కోలుకున్న భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో సంక్లిష్ట సవాళ్ల మధ్య కూడా వేగంగా వృద్ధిని సాధిస్తుందని ఆర్థిక సర్వే తెలిపింది. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు 2022-23లో 7 శాతంగా నమోదవుతుందని, వచ్చే ఏడాది 6 నుంచి 6.8 శాతం ఉంటుందని అంచనా వేసింది. కొనుగోలు శక్తి (పీపీపీ) పరంగా చూస్తే ప్రపంచంలోనే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అని పేర్కొంది. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా యూనియన్ ఆర్థిక మంత్రి ఆర్థిక సర్వే 2022-23ను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ప్రభుత్వ విజయాల డేటా, ప్రకటనల్లా తప్ప సమగ్ర విశ్లేషణ, దిశానిర్దేశం కొరవడ్డాయన్న విమర్శలను ఎదుర్కొంటున్న సర్వేలోని ముఖ్యాంశాలు:

2020 నుంచి మూడు సంక్షోభాలను భారత ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంది. కరోనా సంబంధిత మందగమనం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు వల్ల దేశీయంగా, అంతర్జాతీయంగా పరిణామాలు భారత్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం కొన్ని దశాబ్దాల గరిష్టస్థాయిలకి పెరిగినందున దాన్ని కట్టడి చేసేందుకు కేంద్ర బ్యాంకులు కఠిన విధానాలు కొనసాగించవచ్చు, ఫలితంగా వడ్డీ రేట్లు దీర్ఘకాలం పాటు అదే స్థాయిలో కొనసాగించవచ్చు. అమెరికా ఫెడ్ రేట్ల పెంపు ఆ దేశ స్టాక్ మార్కెట్లలోకి పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచుతోంది. దీంతో అనేక దేశాల కరెన్సీతో పోలిస్తే డాలర్ విపరీతంగా బలపడుతోంది. ఈ కారణంగా పలు దేశాలు కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) ఎదుర్కొంటున్నాయి. అంతేకాకుండా దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే భారత్‌లాంటి దేశాలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు గురవుతున్నాయి. ఇతర దేశాల కరెన్సీతో పోలిస్తే మన రూపాయి పనితీరు బాగానే ఉంది. ఇప్పటికీ అధికస్థాయిలో కొనసాగుతున్న అంతర్జాతీయ కమోడిటీ (ముఖ్యంగా ముడి చమురు) ధరలతో సీఏడీ ఆందోళనకరంగా పెరుగుతున్నా భారత ఆర్థిక వృద్ధి తీరు బలంగా ఉంది.

**స్టార్టప్‌లకు మరిన్ని ప్రోత్సాహకాలు**

భారతీయుల యాజమాన్యంలోని స్టార్టప్‌లు తమ తయారీ కార్యకలాపాలు తిరిగి దేశంలో చేపట్టేలా చేయాలంటే నిబంధనలు, విధివిధానాలు మరింత సరళతరం చేయాలి. చాలా స్టార్టప్‌లు ఇప్పటికీ కొన్ని నిధుల సమీకరణ, ఆదాయాల కల్పన పరంగానే కాకుండా తమకు మద్దతుగా నిలిచే మౌలిక వసతులు తగినంతగా అందుబాటులో లేకపోవటం వంటి సవాళ్లను ఎదుర్కొంటూనే ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించటం తోపాటు స్టార్టప్‌లకు ఇంటర్-మినిస్టీరియల్ బోర్డు సర్టిఫికేషన్ జారీ, ఈసాప్‌లపై పన్ను విధానం సరళీకరణ, బహుళ అంచెల పన్నుల వ్యవస్థ సరళీకరణ, పన్ను వివాదాల కారణంగా ఏర్పడే అస్థిరతల తొలగింపు వంటి చర్యలు చేపట్టటం తప్పనిసరి.




**తయారీకి ఉత్తేజం**

విదేశీ కంపెనీలన్నీ తమ తయారీ విభాగాలు ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకోగలిగే స్థాయిలో నిలపాలని భావిస్తున్న నేపథ్యంలో ప్రపంచ తయారీ కేంద్రంగా అవతరించగల సమర్థత భారతదేశానికి ఉంది. ప్రస్తుతం భారత తయారీ రంగం జీడీపీలో 15-16 శాతం వాటా కలిగి ఉంది. రాబోయే సంవత్సరాల్లో దాన్ని 25 శాతానికి మెరుగుపరిచే దిశగా ప్రస్తుతం కృషి జరుగుతోంది. మేక్ ఇన్ ఇండియా 2.0 ప్రధానంగా 27 రంగాలపై (15 తయారీ, 12 సర్వీస్) దృష్టిని కేంద్రీకరించింది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి మద్దతుగా నిలిచేందుకు ప్రభుత్వం 14 రంగాలకు ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకం కూడా అమలుపరుస్తోంది. ఈ పథకం భారత వస్తు తయారీదారులు అంతర్జాతీయ పోటీ సామర్థ్యాలు సాధించేందుకు, ఆధునిక టెక్నాలజీలు సమకూర్చుకునేందుకు అండగా నిలిచింది. ఇది ప్రధానంగా ఎంఎస్ఎంఈ రంగానికి ఒక వరంగా ఉంది. అలాగే ఎమర్జెన్సీ క్రెడిట్ లింక్డ్ గ్యారంటీ స్కీమ్ (ఈసీఎల్‌జీఎస్) ఎంఎస్ఎంఈలు ఆర్థిక నిరాశాపూరిత

వాతావరణం నుంచి బయటపడేందుకు దోహదపడింది. ఈ పథకం మద్దతుతో 2022 జనవరి–నవంబర్ నెలల మధ్య కాలంలో ఎంఎస్ఎంఈల రుణ వృద్ధి రేటు 30.6 శాతానికి చేరింది. ఎంఎస్ఎంఈలకు ఏర్పడిన ఉత్తేజం జీఎస్టీ పన్ను వసూళ్లు పెరగటంలోనే ప్రతిబింబిస్తోంది. ఉద్యోగాల కల్పన, ఈపీఎఫ్ఓ ఖాతాల పెరుగుదల కూడా ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని సూచిస్తోంది.

**పెట్టుబడుల ఉపసంహారణ**

ప్రభుత్వం ప్రస్తుతం షిప్పింగ్ కార్పొరేషన్, ఎన్ఎండీసీ స్టీల్ లిమిటెడ్, బీఈఎంఎల్, హెచ్ఎల్ఎల్ లైఫ్ కేర్, సీసీఐ, విశాఖ ఉక్కు, ఐడీబీఐ బ్యాంకుల ప్రయివేటీకరణకు కృషి చేస్తోంది. వాటిలో వ్యూహాత్మక వాటాల విక్రయాలు కొనసాగుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అవి పూర్తి కావచ్చు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల నగదీకరణకు నిర్ణయాత్మక చర్యలు తీసుకోవటం తప్పనిసరి. ఆస్తుల నగదీకరణ ద్వారా వచ్చే ఆదాయాలు ప్రభుత్వ రుణ భారం తగ్గించేందుకు వినియోగించినట్టయితే రుణ పరపతి పెరిగి తక్కువ వడ్డీలకే నిధులు సమీకరించే వెసులుబాటు కలుగుతుంది.

**ఆర్థిక క్రమశిక్షణ**

వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలో ఉండేలా చూసి సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడాలంటే ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించక తప్పదు. ఆర్థిక క్రమశిక్షణ పాటించటం వల్ల ప్రస్తుత అస్థిర పరిస్థితుల్లో ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకునేందుకు వాతావరణం అనుకూలంగా ఉంటుంది. క్రమశిక్షణ పాటించినట్లయితే విద్య, కారు, గృహ, వ్యాపార రుణాలన్నీ తక్కువ వడ్డీకే అందుబాటులో ఉంటాయి.

**పెట్టుబడి వ్యయాలు**

ఈ ఏడాదికి నిర్దేశించుకున్న రూ.7.5 లక్షల కోట్ల పెట్టుబడి వ్యయాల లక్ష్యం పూర్తి కావచ్చు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 8 నెలల కాలంలోను యూనియన్ ప్రభుత్వ పెట్టుబడి వ్యయాలు (క్యాపెక్స్) 63.4 శాతం పెరిగాయి. అవి ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజంగా నిలిచాయి. కార్పొరేట్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో ప్రయివేటు పెట్టుబడులు కూడా స్థిరంగా పెరగవచ్చు. వీటన్నింటి ప్రభావం వల్ల ఆర్థిక ఉత్పాదకత క్యాపెక్స్‌కు నాలుగు రెట్లు పెరిగే ఆస్కారం కనిపిస్తోంది. రాష్ట్రాలు కూడా పెట్టుబడి ప్రణాళికల విషయంలో మెరుగైన స్థితిలోనే ఉన్నాయి.

**పన్ను ఆదాయాలు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల కాలంలో స్థూల పన్ను ఆదాయాలు బడ్జెట్ అంచనాల్లో 65 శాతం, అంటే రూ.17.81 లక్షల కోట్లు ఉన్నాయి. ఇందులో ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.8.67 లక్షల కోట్లుండగా, పరోక్ష పన్ను వసూళ్లు రూ.8.91 లక్షల కోట్లు. కార్పొరేట్, వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు ఇందుకు మద్దతు ఇచ్చాయి. స్థూల పన్ను వసూళ్లలో సుమారుగా సగం వాటా గల ప్రత్యక్ష పన్ను వసూళ్లు నవంబర్ నాటికి 26 శాతం వృద్ధిని నమోదు చేశాయి. జీఎస్టీ వసూళ్లు నవంబర్ నాటికి రూ.5.57 లక్షల కోట్లున్నాయి. పూర్తి ఏడాది బడ్జెట్ అంచనా రూ.7.80 లక్షల కోట్లలో ఇది 71.5 శాతం.

- కొవిడ్ మహమ్మారి సమయంలో స్తంభించిన భారత ఆర్థిక వ్యవస్థ దాదాపు పూర్తిగా కోలుకుంది. నిలిచిపోయిన కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.8% వద్ద ద్రవ్యోల్బణం వ్యక్తిగత వినిమయ్యాన్ని తగ్గించే అధిక స్థాయిలో గానీ, లేదా పెట్టుబడులను బలహీనపరిచేంత తక్కువ స్థాయిలో గానీ ఉండదు.
- రుణరేట్లు దీర్ఘకాలం అధికంగా ఉండే అవకాశం ఉంది. కఠిన ద్రవ్య పరపతి విధాన వైఖరిని మరికొంతకాలం పొడిగించటానికి స్థిరంగా కొనసాగుతున్న ద్రవ్యోల్బణం దోహదం చేయనుంది.
- అమెరికా ఫెడరల్ రిజర్వు ఇంకా వడ్డీ రేట్లు పెంచే అవకాశమున్నందున రూపాయి మారకపు విలువకు సవాళ్లు ఎదురుకావచ్చు.
- ఎగుమతుల వృద్ధి నెమ్మదించటం, సీఏడీ విస్తృతమవుతుండటంతో రూపాయికి ఒడిదుడుకులు తప్పకపోవచ్చు.
- ప్రపంచవ్యాప్తంగా కమోడిటీ ధరలు అధిక స్థాయిలో కొనసాగుతున్నందున బలహీనమైన రూపాయి విలువతో సీఏడీ మరింత పెరిగే అవకాశం ఉంది. జులై–సెప్టెంబరు కాలానికి సీఏడీ 4.4 శాతంగా ఉంది. ఇది అంతకు ముందు త్రైమాసికంలో 2.2 శాతంగా, ఏడాది క్రితం 1.3 శాతంగా ఉండేది.
- ప్రపంచ ఆర్థిక వృద్ధి, వాణిజ్య కార్యకలాపాలు నెమ్మదించటం ఎగుమతులపై ప్రభావం చూపాయి.
- స్థిరాస్తి రంగంతోపాటు నిర్మాణ కార్యకలాపాలు పుంజుకోవటంతో ఉపాధి కల్పన మెరుగైంది. వలస కూలీలు తిరిగి పట్టణాలకు చేరటానికి ఇది దోహదం చేసింది.
- 2023–24 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం సాధారణ స్థాయిలో ఉండి, రుణ వ్యయం తక్కువగా ఉన్నట్లయితే 'సూక్ష్మ, చిన్న మధ్యస్థాయి పరిశ్రమల' (ఎంఎస్ఎంఈ) రుణాల వృద్ధి మెరుగ్గా ఉండే అవకాశం ఉంది.
- కొవిడ్ ఉధృత స్థాయిలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన 'అత్యవసర రుణ హామీ పథకం' వల్ల వేగంగా ఎంఎస్ఎంఈలు కోలుకుంటున్నాయి.
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో.. మూలధన పెట్టుబడులు పుంజుకుంటాయి.
- పీఎం కిసాన్, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలు పేదరికాన్ని తగ్గించటంలో గణనీయంగా దోహదపడ్డాయి.
- దేశీయంగా వినియోగం పెరగటం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. అయితే, మరిన్ని ఉద్యోగాల కల్పనకు ప్రయివేటు పెట్టుబడులు మరింత పెరగాలి.
- సీఏడీని ఎదుర్కోవటానికి, రూపాయి అస్థిరతను నిలువరించటానికి మన వద్ద చాలినన్ని విదేశీ మారక ద్రవ్య నిల్వలున్నాయి.
- గత 8 సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేపట్టిన

సంస్కరణలు ఎలాంటి ఆటుపోట్లనైనా తట్టుకోగల శక్తిని అందించాయి. ఆర్థిక వృద్ధి వేగం కొనసాగించటంతోపాటు అధిక స్థాయిల్లో ఉండేలా చేసే దిశగా మరిన్ని సంస్కరణలు చేపట్టవలసిన అవసరం ఉంది. లైసెన్సింగ్, ఇన్‌స్పెక్షన్, కంప్లయెన్సుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించే దిశగా కొన్ని రకాల నియమ నిబంధనలను తొలగించటం, సరళం చేయటం వంటి చర్యలు రాబోయే కాలంలో కూడా కొనసాగాలి. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగానికి సంబంధించిన సమస్యలపై దృష్టి సారించాలి. డిస్కమ్‌ల ఆర్థిక మనుగడను కాపాడేందుకు చర్యలు అమలు చేయాలి.

## రూ.9.9 లక్షల కోట్లకు ద్రవ్యలోటు

ప్రభుత్వ వ్యయాలు, ఆదాయాల అంతరమైన ద్రవ్యలోటు 2022-23 ఏప్రిల్-డిసెంబర్‌లో రూ.9,92,976 కోట్లకు చేరుకుంది. 2022-23 బడ్జెట్ అంచనా (బీఈ) అయిన రూ.16.61 లక్షల కోట్లలో ఇది 59.8 శాతానికి సమానం. ఆదాయ వసూళ్లలో వృద్ధి స్తబ్దుగా ఉండటం ఇందుకు కారణం. 2021-22 ఇదే సమయానికి బడ్జెట్ అంచనాల్లో ద్రవ్యలోటు 50.4 శాతానికి చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్‌లో నికర పన్ను ఆదాయాలు రూ.15.55 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022-23 బడ్జెట్ అంచనాల్లో ఇవి 80.4 శాతానికి సమానం. 2021-22 ఇదే సమయంలో నికర పన్ను ఆదాయాలు బడ్జెట్ అంచనాల్లో 95.4 శాతంగా ఉన్నాయి. 2022-23 ఏప్రిల్-డిసెంబర్‌లో యూనియన్ ప్రభుత్వ మొత్తం వ్యయాలు బడ్జెట్ (2022-23) అంచనాల్లో 71.4 శాతంగా ఉన్నాయి. అంతక్రితం ఏడాది 72.4 శాతంతో పోలిస్తే ఇవి తక్కువే.

## రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చు

కరెంటు ఖాతా లోటు (సీఏడీ) పెరుగుతూ ఉన్నందున భారత రూపాయిపై ఒత్తిడి కొనసాగవచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఏప్రిల్-జూన్‌లో 2.2 శాతంగా ఉన్న సీఏడీ.. అధిక వాణిజ్య లోటు కారణంగా సెప్టెంబర్ త్రైమాసికానికి 4.4 శాతానికి చేరింది. అంతర్జాతీయ అనిశ్చితల మధ్య అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లు పెంచటంతో పెట్టుబడులు తరలిపోయి భారత రూపాయి ఒత్తిడిలో కొనసాగింది. ఒక దశలో అమెరికా డాలర్ రూ.83 స్థాయినీ చేరింది. కమొడిటీ ధరలు రికార్డు స్థాయిల నుంచి దిగి వచ్చినా.. ఇంకా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముందు స్థాయిల కంటే అధికంగానే ఉన్నాయి. బలమైన దేశీయ గిరాకీ, అధిక కమొడిటీ ధరల వల్ల దేశ దిగుమతుల బిల్లు పెరుగుతోంది.

## ఎగుమతులు పెరగకపోవచ్చు

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో రికవరీ రాకపోతే, వచ్చే ఆర్థిక సంవత్సరం భారత ఎగుమతుల్లో వృద్ధి తగ్గొచ్చు. 2021-22లో భారత మర్కండైజ్ ఎగుమతులు జీవన కాల గరిష్టమైన 422 బిలియన్ డాలర్లకు చేరాయి. పలు సవాళ్ల నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్యం నెమ్మదిస్తోంది. దీంతో భారత వస్తువుల ఎగుమతుల వృద్ధిపై ప్రభావం పడే అవకాశం ఉంది. 2022 డిసెంబర్‌లో భారత ఎగుమతులు 12.2 శాతం తగ్గి 34.48 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. వాణిజ్య లోటు 23.76 బి.డాలర్లకు చేరింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబర్ మధ్య దేశం మొత్తం ఎగుమతులు 9 శాతం పెరిగి 332.76 బిలియన్ డాలర్లకు చేరగా, దిగుమతులు 24.96 శాతం పెరిగి 551.7 బి.డాలర్లకు చేరాయి.

## ఇళ్ల ధరలు స్థిరపడుతున్నాయి

రెండేళ్ల పాటు కొవిడ్-19 పరిణామాలతో ఇబ్బంది పడిన గృహనిర్మాణ రంగం కుదుట పడుతోంది. ఇళ్ల విపణి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రికవరీ బాటలో ఉంది. ఇళ్ల ధరలు స్థిరపడుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిణామాల మధ్య నిర్మాణ సామాగ్రి ధరలు పెరిగి, ఇళ్ల ధరలూ అధికమయ్యాయి. గిరాకీ పుంజుకుంటున్నందున, అమ్ముడవ్వాల్సిన గృహాల సంఖ్య తగ్గుతోంది. ఉక్కు, ఇనుప ఖనిజం వంటి నిర్మాణ సామాగ్రిపై దిగుమతి సుంకాలను తగ్గించిన నేపథ్యంలో, ఇళ్ల నిర్మాణ వ్యయంతోపాటు ధరల్లో పెరుగుదల పరిమితం అవుతుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లు పెరగటం, స్థిరాస్తి ధరలు అధికమవుతున్నా, గిరాకీ పుంజుకుని గృహాల విక్రయాల్లో వృద్ధి కనిపించింది.

### ఏటా కోటి విద్యుత్ వాహన విక్రయాలు - కోట్ల మందికి ఉపాధి

దేశీయంగా విద్యుత్ వాహనాల (ఈవీలు) విక్రయాలు 2030 నాటికి, ఏటా కోటికి చేరొచ్చని సర్వే అంచనా వేసింది. దీంతో ఈ రంగంలో 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. 2022 డిసెంబర్ ఆఖరుకు చూస్తే, వాహన విక్రయాల పరంగా జపాన్, జర్మనీలను అధిగమించి, భారత్ మూడో స్థానానికి చేరింది. హరిత ఇంధనం వైపు దేశం అడుగులు వేయటంలో వాహన పరిశ్రమ కీలక పాత్ర పోషించనుంది. దేశీయ విద్యుత్ వాహనాల విపణి 2022 నుంచి 2030 వరకు 49 శాతం వార్షిక సంచిత వృద్ధి రేటుతో సాగనుంది.

### రుణ హామీ పథకంతో ఎంఎస్ఎంఈలకు ఊపిరి

భారత్‌లోని సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీలు (ఎంఎస్ఎంఈ) ఆర్థిక ఒత్తిళ్లలో కూరుకుపోకుండా.. అత్యవసర రుణ అనుసంధానిత హామీ పథకం (ఈసీఎల్‌జీఎస్) పథకం కాపాడిందని ఆర్థిక సర్వే వివరించింది. ఈ రంగానికిచ్చిన రుణాల్లో వృద్ధి 2022 జనవరి-నవంబర్‌లో సగటున 30.6%గా నమోదు కావటం వీటికి మద్దతుగా నిలిచింది. కరోనా సమయంలో బాగా ఇబ్బందులు పడ్డ కంపెనీల్లో 83 శాతం మేర ఈసీఎల్‌జీఎస్‌ను వినియోగించుకున్నాయి. వీటిల్లో సగం కంపెనీలకు పైగా రూ.10 లక్షల్లోపు రుణాలు తీసుకున్నాయి. **దేశంలోని 6 కోట్ల ఎంఎస్ఎంఈల్లో 12 కోట్ల మంది పనిచేస్తున్నారు. జీడీపీలో వీరి వాటా 35%.**

### పెట్టుబడుల ఉపసంహరణతో ఇప్పటి వరకు రూ.4.07 లక్షల కోట్లు

గత 9 ఏళ్లలో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా ప్రభుత్వం 4.07 లక్షల కోట్ల నిధుల్ని సమీకరించింది. 2014 తర్వాత ప్రభుత్వం ప్రయివేటు రంగాన్ని అభివృద్ధిలో సహ భాగస్వామిగా చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో నిర్దేశించుకున్న రూ.65,000 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యంలో, 2023 జనవరి 18 నాటికి 48 శాతం (రూ.31,000 కోట్లు) సాధించింది. 2014-15 నుంచి 2022-23 వరకు (2023 జనవరి 18 నాటికి) 154 లావాదేవీల ద్వారా ప్రభుత్వం రూ.4.07 లక్షల కోట్ల నిధుల్ని ఇలా సమీకరించింది. ఆయా సంస్థల్లో మైనార్టీ వాటా విక్రయాల ద్వారా రూ.3.02 లక్షల కోట్లు, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ.69,412 కోట్లు సమీకరించింది.

### ఎఫ్‌డీఐలు పుంజుకుంటాయి

దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) రాబోయే కొద్ది నెలల్లో పెరగనున్నాయని ఆర్థిక సర్వే అంచనా వేసింది. భారత్ అధిక ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తుండటంతోపాటు.. దేశీయంగా వ్యాపార వాతావరణం మెరుగుపడటం ఇందుకు దోహదం చేస్తుందని తెలిపింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఏర్పడ్డ అంతర్జాతీయ అనిశ్చితి వల్ల 2022-23 ఏప్రిల్-సెప్టెంబర్‌లో తయారీ రంగంలోకి ఎఫ్‌డీఐలు 26.9 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇవి 14 శాతం తక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మొత్తం ఎఫ్‌డీఐలు 39 బిలియన్ డాలర్లకు తగ్గాయి. 2021-22 తొలి ఆరు నెలల్లో ఇవి 42.86 బి.డాలర్లుగా ఉన్నాయి.

### దేశీయ ఔషధ విపణి 130 బిలియన్ డాలర్లకు

దేశీయ ఔషధ మార్కెట్ 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.10.6 లక్షల కోట్లు) స్థాయికి చేరవచ్చని ఆర్థిక సర్వే వెల్లడించింది. దేశ ఔషధ ఎగుమతులు 2020-21లో స్థిరంగా 24 శాతం వృద్ధి సాధించాయి. 150కి పైగా దేశాల్లో మన అత్యవసర ఔషధాలకు ఉన్న గిరాకీ, ఇతర సరఫరాలతో ఇది సాధ్యమైంది. అంతర్జాతీయ ఔషధ పరిశ్రమలో భారత ఔషధ పరిశ్రమకు గొప్ప స్థానం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఔషధాల ఉత్పత్తిలో పరిమాణం పరంగా మూడో స్థానం, విలువపరంగా 14వ స్థానంలో భారత్ ఉంది. అంతర్జాతీయంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేస్తున్న అతిపెద్ద దేశం మనదే. పరిమాణపరంగా 20 శాతం వాటా కలిగి ఉంది. టీకాల సరఫరాలో 60 శాతం వాటా కలిగి ఉంది.

### ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో 55% వృద్ధి

ఎలక్ట్రానిక్స్ పరికరాల ఎగుమతులు 55 శాతం వార్షిక వృద్ధిని సాధించాయి. గత ఏడేళ్లలో దేశంలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి అయిదింతలైందని ఆర్థిక సర్వే తెలిపింది. స్థానిక కంపెనీల ఉత్పత్తి సామర్థ్యాలు పెరిగేందుకు ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పథకం దోహదపడుతుందని వెల్లడించింది. అంతర్జాతీయంగా రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ తయారీదారుగా భారత్ అవతరించింది.

### ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం

ఈ దశాబ్దంలో భారత్ భారత్ ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశం ఉంది. అమెరికా-చైనా వర్తకం, కొవిడ్-19 ముప్పు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం రూపేణ అదనపు సవాళ్ల నేపథ్యంలో, విదేశీ కంపెనీలు సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసుకునేందుకు చేస్తున్న యత్నాలను భారత్ అందిపుచ్చుకోవాలి.

### రూ.5.06 లక్షల కోట్లు సమీకరించిన కంపెనీలు

దేశీయ కంపెనీలు గత ఏడాది ఏప్రిల్-నవంబర్‌లో రూ.5.06 లక్షల కోట్ల ఈక్విటీ, రుణ పెట్టుబడులు సమీకరించాయి. 2021 ఇదే కాలంలో సమీకరించిన రూ.5.53 లక్షల కోట్లతో పోలిస్తే ఇవి 8.5% తక్కువ. రూ.5.06 లక్షల కోట్లలో రూ.3.92 లక్షల కోట్లు రుణ పెట్టుబడులు కాగా, రూ.1.14 లక్షల కోట్లు మాత్రమే ఈక్విటీ పెట్టుబడుల రూపంలో లభించాయి. 2021లో రుణ పెట్టుబడులు రూ.3.71 లక్షల కోట్లు కాగా, ఈక్విటీ పెట్టుబడులు రూ.1.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం ఒత్తిళ్లు, కేంద్ర బ్యాంకుల కఠిన పరపతి నిర్ణయాలతో ఎఫ్‌పీఐలు 2022-23 ఏప్రిల్-డిసెంబర్‌లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.16,153 కోట్ల నిధుల్ని మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకున్నారు.

## 2026 నాటికి 5 లక్షల కోట్ల డాలర్లు

డాలర్-రూపాయి మారకం రేటు కదలికలు, రూపాయి విలువలో సాధారణ వృద్ధి రేటు ఆధారంగా దేశ ఆర్థిక వ్యవస్థ 2025-26 నాటికి 5 లక్షల కోట్ల డాలర్ల మైలురాయిని చేరి, 2030 నాటికి 7 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరుతుందని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ అన్నారు. ఆర్థిక వ్యవస్థను ఉత్తేజితం చేసే దిశగా మనం విధానాలు రూపొందించి, పెట్టుబడులు సమీకరించి, ప్రయివేటు రంగానికి ప్రోత్సాహం కల్పించే నిర్ణయాలను తీసుకున్నట్లయితే వాటి ఫలితాలు వెన్నంటి వస్తాయన్నారు. గత 30 సంవత్సరాల గణాంకాలను పరిశీలించినట్లయితే, డాలర్ మారకంలో భారత ఆర్థిక వ్యవస్థ సగటున 9 శాతం వృద్ధిని నమోదు చేసిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలతో మిగిలిన దశాబ్దకాలం పాటు భారత వృద్ధి రేటు 6.5 శాతం నుంచి 7 శాతం మధ్య ఉంటుందని, ముడి చమురు ధర బ్యారెల్‌కు 100 డాలర్లకు మించకుండా ఉంటే దేశ అంచనా వృద్ధి రేటులో తేడా ఉండదన్నారు. పునరుత్పాదక ఇంధన మిళిత లక్ష్యాల సాధనలో మన దేశం గణనీయ స్థాయిలో ముందుకు సాగుతోందన్నారు.

# తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం


ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)లో అత్యధిక ద్రవ్యోల్బణం రేటు విషయంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో పశ్చిమ బెంగాల్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుదలకు ప్రధాన కారణం ఇంధనం, వస్త్రాల ధరలేనని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. చాలా రాష్ట్రాల్లో పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అత్యధిక ద్రవ్యోల్బణం రేటు నమోదైనట్లు పేర్కొంది. ఆహార పదార్థాల ధరల పెరుగుదలే ఇందుకు కారణమని వెల్లడించింది. హైదరాబాద్ మెట్రో నగరంలో స్థిరాస్తి బూమ్ కొనసాగుతోందని సర్వే తెలిపింది. తల్లుల మరణాలను తగ్గించటంలో దేశంలో తెలంగాణ మూడో స్థానంలో ఉండగా, కుళాయిల ద్వారా ఇంటింటికీ రక్షిత తాగునీరు అందిస్తున్న నాలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని వెల్లడించింది.

- తెలంగాణలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 7 శాతం ఉండగా, 2022-23లో 8.5 శాతానికి పెరిగింది. గత ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. సెప్టెంబర్‌లో అత్యధికంగా నమోదయ్యాయి.
- ఈ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, హర్యానా, కేరళ, అస్సాం సహా కేంద్రపాలిత ప్రాంతాలు విద్యుత్ ఛార్జీలను పెంచాయి.
- తెలంగాణ, తమిళనాడు, కేరళ ఆస్తిపన్ను రాబడులు పెంచుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయి.
- 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కర్మాగారాల్లో పనిచేసేవారి సంఖ్య పరంగా తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. తెలంగాణ 7, ఆంధ్రప్రదేశ్ 9వ స్థానంలో ఉన్నాయి.
- 2017-18తో పోలిస్తే 2020-21 నాటికి మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం ఆంధ్రప్రదేశ్‌లో 2% పెరగ్గా, తెలంగాణలో 15% పెరిగింది.
- ప్రసవ సమయంలో తల్లుల మరణాల రేటు.. ప్రతి లక్ష ప్రసవాలకు 70 కంటే ఉండాలన్నది లక్ష్యం కాగా, తెలంగాణ సహా 8 రాష్ట్రాలు దీన్ని చేరుకున్నాయి. ఈ విషయంలో కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ, ఏపీ, తమిళనాడు తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి.
- ప్రజల వైద్యం కోసం తెలంగాణ ప్రభుత్వం చేసే వ్యయం 40.9 శాతంగా నమోదైంది.
- తెలంగాణ, గుజరాత్, హర్యానా, గోవా రాష్ట్రాలు.. అండమాన్ నికోబార్ దీవులు, దాద్రానగర్‌హవేలి, డమన్-డీవ్, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతాలు వంద శాతం ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందించే లక్ష్యాన్ని చేరుకున్నాయి.
- సరకు రవాణా (లాజిస్టిక్స్) సులభతరం విషయంలో, 'అచీవర్స్' జాబితాలో తెలంగాణ, యూపీ, తమిళనాడు, కర్ణాటక సహా 12 రాష్ట్రాలు నిలిచాయి. మిగతావి 'వేగంగా ముందుకు వెళ్తున్నవి (ఫాస్ట్ మూవర్స్), 'ఆశావహ' రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి.
- ఇళ్ల ధరల సూచీలు హైదరాబాద్ సహా దేశంలోని 8 మెట్రో నగరాల్లో పెరిగాయి. హౌసింగ్ ప్రైస్ ఇండిసెస్ (హెచ్‌పీఐ) అసెస్‌మెంట్ ప్రైస్ సూచీ, మార్కెట్ ప్రైస్ సూచీ.. రెండింటిలోనూ అహ్మదాబాద్ మొదటిస్థానంలో ఉండగా హైదరాబాద్ తర్వాతి స్థానంలో ఉంది. 'ఇళ్ల ధరలు ఆయా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను చెబుతాయి. ధరలు-ఆర్థిక స్థిరత్వం, వృద్ధి రేటు అంచనాలకు ఇళ్ల ధరల సూచికలు అద్దం పడతాయి' అని సర్వే విశ్లేషించింది.

# తెలంగాణ సామాజిక, ఆర్థిక సర్వే 2023

తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) ప్రస్తుత ధరల ప్రకారం రూ.13,27,495 కోట్లుగా నమోదైంది. 2020-21తో పోలిస్తే 15.6% వృద్ధిని సాధించింది. 2021-22లో వృద్ధి రేటు 19.4%. విలువ రూ.11,48,115 కోట్లు. జీఎస్‌డీపీలో సేవల రంగం ప్రథమ స్థానంలో కొనసాగుతోందని బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక (సోషియో, ఎకనామిక్ ఔట్‌లుక్) 2023 తెలిపింది.

2022-23లో సేవల రంగం విలువ జోడింపు (జీవీఏ) 17.5 శాతంగా నమోదైంది. 2021-22లో ఇది 20.5 శాతం. ఈ ఏడాది సేవల రంగం విలువ రూ.7,50,408 కోట్లు. ఈ రంగం పరిధిలో హోటళ్లు, రెస్టరెంట్లు, ఆస్పత్రులు, రవాణా, స్థిరాస్తి, సాఫ్ట్‌వేర్ మొదలైన సేవలు వస్తాయి. ప్రాథమికమైన వ్యవసాయ రంగం, అనుబంధ రంగాల్లో జీవీఏ 11.9% వృద్ధి నమోదైంది. రాష్ట్ర జనాభాలో 45.8% మందికి వ్యవసాయ రంగం ఉపాధి కల్పించింది. ద్వితీయ రంగమైన పరిశ్రమలు 2023-24లో జోడించిన జీవీఏ వృద్ధి రేటు 10.5%గా నమోదైంది. వరుసగా రెండోసారి రెండంకెల వృద్ధి నమోదైంది. 2020-21లో కొవిడ్ ఉత్పాతం కుదిపేసిన తర్వాత రాష్ట్ర పారిశ్రామిక రంగం 2021-22లో 17.9 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది.




తెలంగాణ తలసరి (పర్ క్యాపిటా) ఆదాయం రూ.3,17,115కు చేరుకోగా, జిల్లాల పరంగా రూ.6,69,102తో రంగారెడ్డి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో ఎక్కువ ప్రాంతం ఈ జిల్లాలో విస్తరించి ఉండటంతోపాటు ఐటీ, పరిశ్రమలు, సేవలు తదితర రంగాలు వృద్ధి చెందటంతో ఇక్కడ తలసరి ఆదాయం భారీగా నమోదైంది. హైదరాబాద్ జిల్లా (రూ.3,49,061), సంగారెడ్డి (రూ.2,49,091), సిద్దిపేట జిల్లా (రూ.2,12,788) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచాయి. హనుమకొండ జిల్లా రూ.1,03,821 తలసరి ఆదాయంతో చివరిస్థానంలో ఉం ది. ఆపై స్థానాల్లో కుమురం భీం ఆసిఫాబాద్ (రూ.1,31,843), వికారాబాద్ (రూ.1,31,962) జిల్లాలు ఉన్నాయి.

**మండలాల సగటు జనాభా 60 వేలే**

మండలాల సగటు జనాభా అతి తక్కువగా ఉన్న రాష్ట్రం తెలంగాణే. రాష్ట్రంలోని 612 మండలాల్లో మొత్తం జనాభా సుమారు 3.75 కోట్లు. దీని ప్రకారం ఒక్కో మండలం సగటు జనాభా 61,366. ఇదే సమయంలో దేశంలో తెలంగాణ సహా మొత్తం 18 రాష్ట్రాలు కలిపి ఒక్కో మండల సగటు జనాభా 2.07 లక్షలుగా తేలింది. తెలంగాణ తర్వాత అతి తక్కువ సగటు మండల జనాభా ఉన్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. అక్కడ మండల సగటు జనాభా 79,023. అత్యధికంగా మహారాష్ట్రలో 3.53 లక్షలుంది. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 828 మండలాలు/బ్లాక్‌లు ఉండగా.. 668 మండలాలతో ఏపీ, 612 మండలాలతో తెలంగాణ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ప్రతి 100 మందికీ 105 ఫోన్ కనెక్షన్లు

మొబైల్ కనెక్షన్ల వినియోగ సాంద్రతలో రాష్ట్రం 9వ స్థానంలో ఉంది. దేశంలో ప్రతి 100 మందికి సగటున 83 కనెక్షన్లు ఉండగా, రాష్ట్రంలో 105 ఉన్నాయి. 2022 నవంబర్ నాటికి రాష్ట్రంలో 4.08 కోట్ల మంది వినియోగదారులున్నారు. అందులో 98 శాతం మొబైల్ వినియోగదారులే. మొత్తం వినియోగదారుల్లో 2.28 మంది నగర/పట్టణవాసులున్నారు.

**23 లక్షలు దాటిన ధరణి లావాదేవీలు**

ధరణి పోర్టల్ ద్వారా ఏకకాలంలో రిజిస్ట్రేషన్-మ్యుటేషన్ పూర్తికి 47 నిమిషాలు పడుతోంది. 2020 నవంబర్ రెండవ తేదీ నుంచి 2023 జనవరి 27 వరకు 23.20 లక్షల లావాదేవీలు నమోదయ్యాయి.

- అడవుల విస్తీర్ణంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్-2021'ను ఉటంకిస్తూ నివేదిక తెలిపింది. 2015లో తెలంగాణలో 19,854 చదరపు కిలోమీటర్ల అటవీ విస్తీర్ణం ఉండగా, 2021 నాటికి 21,214 చ.కి.మీలకు చేరుకుంది. రాష్ట్రంలో అత్యధిక అటవీ విస్తీర్ణం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉంది.
- ములుగు జిల్లాలో అతి తక్కువగా 353 ప్రభుత్వ పాఠశాలలుండగా, అత్యధికంగా నల్గొండలో 1,483 ఉన్నాయి. ప్రయివేటు స్కూళ్లు అత్యధికంగా హైదరాబాద్‌లో 2,156 ఉన్నాయి.
- ఉపాధి కల్పనలో రంగారెడ్డి జిల్లా 56.66 శాతంతో తొలిస్థానంలో ఉంది. వరంగల్ (11.12%), సంగారెడ్డి (8.04%) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- 2014-15 నుంచి 2022-23 వరకు ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం రూ.4,925.90 కోట్లు ఖర్చు చేసింది.
- రాష్ట్రంలో రోడ్ల పొడవు లక్ష కిలోమీటర్లు దాటింది. మొత్తం 1,09,260 కి.మీ పొడవు రోడ్లున్నాయి. అందులో 61.80 శాతం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్ర రహదారులు (హైవేలు), జిల్లా రోడ్లు 25.39 శాతం ఉండగా.. జాతీయ రహదారులు 4.56 శాతం ఉన్నాయి. మొత్తం రోడ్ల పొడవులో జీహెచ్ఎంసీలో 8.25 శాతం ఉంది.
- రాష్ట్రంలోని మొత్తం బ్యాంకు శాఖల్లో 46% (2,732) నగరాలు, పట్టణాల్లోనే ఉన్నాయి. మిగిలినవాటిలో సెమీ అర్బన్ ప్రాంతాల్లో

24% (1408) ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో 30% (1818) ఉన్నాయి.

- మాంసం ఉత్పత్తి గత తొమ్మిదేళ్లలో దాదాపు అయిదురెట్లు పెరిగింది. 2012-13లో 2.30 లక్షల టన్నులు ఉండగా.. 2021-22 నాటికి 10.14 లక్షల టన్నులకు పెరిగింది. పాల ఉత్పత్తిలో 55, గుడ్ల ఉత్పత్తిలో 71 శాతం వృద్ధి నమోదైంది.
- పోలీసు బలగాల సంఖ్య 2015లో 52,116 ఉండగా, 2019 నాటికి 77,680కి చేరింది. అంటే దాదాపు 50 శాతం పెరిగింది.
- రాష్ట్రంలోని మొత్తం కార్మికుల్లో 33.21 శాతం సేవారంగంలో పనిచేస్తున్నారు. ఈ అంశంలో జాతీయ సగటు 29.64 శాతమే. రాష్ట్రంలో సేవారంగంలో ఉన్నవారిలో 39.75 శాతం మంది వర్తకం, హోటళ్లు, రెస్టరెంట్లలో పనిచేస్తున్నారు. మరో 21.04 శాతం మంది రవాణా, స్టోరేజి, కమ్యూనికేషన్ రంగాల్లో ఉన్నారు. అర్బన్ కార్మికుల్లో 63.22 శాతం మంది సేవారంగంలో పనిచేస్తుండగా.. గ్రామీణ ప్రాంతాల్లో 18.28 శాతం మంది ఈ రంగంలో ఉన్నారు.
- తెలంగాణ ప్రభుత్వం 2022 మార్చి 31 నాటికి 13.79 లక్షల ఉత్తర్వులు జారీ చేసింది. గవర్నమెంట్ ఆర్డర్ ఇష్యూ రిజిస్టర్ (జీవోఐఆర్) పోర్టల్ ద్వారా సచివాలయంలోని శాఖలు 1,63, 896, వాణిజ్య పన్నుల శాఖ 4,26,590, ట్రాన్స్‌కో 34,774, సచివాలయ శాఖలు ఎఫ్ఎంఎస్‌లో జారీ చేసినవి 6,89,819, ఎఫ్‌వోఎంఎస్ ద్వారా 64,813 ఉత్తర్వులు జారీ చేశాయి.
- 2014 జూన్ నుంచి 2022 జూన్ వరకు నమోదైన ఈ-లావాదేవీల్లో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. ప్రతి వెయ్యి జనాభాకు రాష్ట్రంలో 1,58,241 లావాదేవీలు జరిగాయి.

# మూడు రాజధానులంటూ ఏ ఒక్క ప్రాంతాన్నీ అభివృద్ధి చేయలేదు




ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 5,6 లను అనుసరించే 2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అమరావతిని రాజధానిగా ప్రకటించిందని, మూడు రాజధానుల ప్రకటనకు ముందు రాష్ట్రం యూనియన్ ప్రభుత్వంతో సంప్రదించలేదని హెూం శాఖ సహాయ మంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విశాఖపట్నంలో మీడియాతో మాట్లాడుతూ ప్రశ్నించారు. మూడు ప్రాంతాల్లో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రంలో గందరగోళం సృష్టించారని, చివరికి ఏ ఒక్క ప్రాంతాన్నీ అభివృద్ధి చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎంతో కీలకమైన సహకార చక్కెర కర్మాగారాలు తాండవ, ఏటికొప్పాక, భీమసింగిలను ఆధునీకరించి రైతులకు అప్పచెబుతామని చెప్పిన ముఖ్యమంత్రి.. కనీసం వాటి గురించి చర్చ చేయటం లేదన్నారు. పరిశ్రమలు మూతపడి, కొత్తవి రాక నిరుద్యోగం పెరుగుతుంటే తాత్కాలిక తాయిలాలతో ఎన్నాళ్లు కాలక్షేపం చేస్తారని ప్రశ్నించారు. సమావేశంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర నేత నాయుడు వేణుగోపాల్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఆస్పత్రి మౌలిక వసతులు పెంచండి**

విజయనగరం జిల్లా కేంద్ర ఆస్పత్రి ప్రభుత్వ జీజీహెచ్‌గా మారిన తర్వాత జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి రోగులు పెద్దసంఖ్యలో వస్తున్నారని, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రతినిధి, నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం అన్నారు. ఈ మేరకు సూపరింటెండెంట్ శంబంగి అప్పలనాయుడిని కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు. పార్టీ నగర అధ్యక్షుడు తాత్రాజు రాజారావు, కార్యదర్శి పి.ఎల్.ఎన్ రాజు, పిల్లా ఆదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుత రీతిలో ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని అమలు చేస్తే ప్రాథమిక ఆరోగ్య స్థాయిలో సమస్య పరిష్కారమవదని, చిన్న ఆరోగ్య సమస్యలకు కూడా ప్రజలు పెదాస్పత్రులకు వస్తూనే ఉన్నారని.. జీతాల పద్ధతిలో కాకుండా లోక్‌సత్తా ప్రతిపాదించినట్లు డాక్టర్ల మధ్య పోటీ, ప్రజలకు ఎంచుకునే స్వేచ్ఛతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేసి ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేయటమే పరిష్కారమని వారన్నారు.

# తెలంగాణ బడ్జెట్ 2023-24

ఎన్నికల సంవత్సరమైనా కొన్ని పథకాలు, కేటాయింపుల్లో స్వల్ప మార్పులు మినహా గత ఏడాది ఒరవడిలోనే కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర 2023 బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. అయితే, వ్యయాలకు తగ్గ రాబడులు ఈ ఏడాది మరింత ప్రశ్నార్థకంగా కనిపిస్తున్నాయి. గత సంవత్సరం రూ.2,56,958.51 కోట్ల బడ్జెట్‌ను ప్రకటించిన ప్రభుత్వం.. రూ.2,37,611.52 కోట్లకు సవరించింది. అయినా సవరించిన బడ్జెట్‌ను 22.21 శాతం (రూ.52,784.48 కోట్లు) పెంచి ఈ ఏడాది ప్రతిపాదించింది.

సంక్షేమం పేరుతో పథకాలకు, వ్యవసాయానికి ప్రాధాన్యతను కొనసాగిస్తూ రూ.2,90,396 కోట్లతో తెలంగాణ బడ్జెట్ 2022-23ను ఆర్థిక మంత్రి శాసనసభలో ప్రవేశపెట్టారు.



సుమారు ఇరవై శాతం నిధులను వివిధ వర్గాల సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో కేటాయించారు. పేదల గృహనిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చారు. బడ్జెట్‌లో నిధులను కేటాయించటంతోపాటు బడ్జెట్ వెలుపల నిధులతో రెండు పడకల ఇళ్లు నిర్మించనున్నట్టు తెలిపారు. వృద్ధి రేటును 16 శాతంగా అంచనా వేసి రూపొందించిన బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు:

- ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 1,100 కుటుంబాలకు లబ్ధి చేకూరేలా 118 నియోజకవర్గాల్లో అమలుకు దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయింపు. సంక్షేమ పథకాల బడ్జెట్‌లో ఈ ఒక్క పథకానికి కేటాయింపే దాదాపు సగం ఉన్నాయి. ఎస్.సి కార్పొరేషన్ పరిధిలో దళితబంధు మినహా ఇతర పథకాలకు రూ.140 కోట్లు మాత్రమే ఇచ్చారు.
- రైతుబంధు పథకానికి రూ.15,075 కోట్లు.
- ఇంటి స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు అందచేసే పథకానికి రూ.12,000 కోట్లు కేటాయించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో 2.63 లక్షల కుటుంబాలకు ప్రయోజనం అందేలా ఈ నిధుల కేటాయింపు జరిగింది..
- పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పథకాలకు రూ.4,844 కోట్లు కేటాయించిన ప్రభుత్వం తొలిసారిగా ఈ నిధులను నేరుగా గ్రామ పంచాయతీలు, మునిపాలిటీల ఖాతాల్లో జమచేయనుంది.
- గ్రామీణ, పట్టణ రహదారుల మరమ్మతులు, నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది.

2018 ఎన్నికల హామీ అమలులో భాగంగా రూ.90 వేల లోపు రుణాలను మాఫీ చేసేందుకు నిధులను కేటాయించారు. కేసీఆర్ పౌష్టికాహార కిట్ పథకానికి రూ.200 కోట్లు కేటాయించారు. విశ్వవిద్యాలయాల్లో హాస్టళ్ల వసతి పెంపుకి, మరమ్మతులకు రూ.500 కోట్లు ప్రతిపాదించారు. కొత్త ఉద్యోగ నియామకాలను కొనసాగిస్తూ, ఈసారి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించారు. విద్యుత్ సబ్సిడీ, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, ఆర్ అండ్ బీ, గ్రామీణ రోడ్ల నిర్వహణ, ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఉపకార వేతనాలు, ఆరోగ్యశ్రీ, మిషన్ భగీరథ నిర్వహణ సహా వివిధ పథకాలకు కేటాయింపులు గతంలో కంటే పెరిగాయి. నియోజకవర్గాల అభివృద్ధి నిధులకు రూ.800 కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. ప్రత్యేక అభివృద్ధి నిధి కింద ఈసారి కేటాయింపులను భారీగా పెంచింది. గత బడ్జెట్‌లో రూ.2,000 కోట్లను కేటాయించగా, ఈసారి ఆ మొత్తం రూ.10,348 కోట్లకు పెరిగింది. నియోజకవర్గాలతోపాటు ప్రత్యేకంగా అభివృద్ధి పనులకు అవసరమైన చోట నిధులను కేటాయించేందుకు వీలుగా ఈ కేటాయింపులు పెంచారు. సాగునీటి శాఖకు ఈసారి కూడా గత కేటాయింపులే కొనసాగాయి. ప్రాంతీయ రింగ్‌రోడ్డు, సచివాలయ నిర్మాణం, ఆర్ఓబీల నిర్మాణం, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్, వడ్డీలేని రుణాలు, అర్బన్ మిషన్ భగీరథ, గిరిజన ఆవాసాలకు రోడ్డు సౌకర్యం, కాళేశ్వరం, పర్యాటక సర్క్యూట్, ఆయిల్‌పాం సాగు, ఎయిర్‌పోర్ట్ మెట్రో, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ల నిర్మాణం, హైదరాబాద్ జలమండలికి తోడ్పాటు, యాదగిరిగుట్ట అభివృద్ధి, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్, ఆర్టీసీకి తోడ్పాటుకు ఈసారి బడ్జెట్‌లోనూ గత కేటాయింపులనే కొనసాగించారు.

**సొంత రాబడులపై ధీమా**

సొంత రాబడులపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి విశ్వాసం ప్రకటించింది. పన్నుల రాబడిలో 18 శాతం పైగా వృద్ధి రేటును అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం రూ.1.31 లక్షల కోట్ల రాబడిని ఆశిస్తోంది. పన్నేతర రాబడి సవరించిన అంచనాల ప్రకారం గత ఏడాది రూ.15,291 కోట్లు కాగా ఈసారి రూ.22,808 కోట్లుగా అంచనా వేసింది. గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ల రాబడి రూ.42,259 కోట్లు వస్తుందని భావిస్తూ బడ్జెట్ అంచనాలను రూపొందించింది. ఎఫ్ఆర్‌బీఎం రుణాలపై యూనియన్ ఆంక్షల నేపథ్యంలో రాష్ట్ర రుణ పరిమితిని రూ.40,165 కోట్లుగా అంచనా వేసింది. గతేడాది కంటే ఈ మొత్తంలో రూ.4,300 కోట్లు తగ్గించుకుంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో అంతర్రాష్ట్ర సర్దుబాట్లుగా రాష్ట్రానికి రావాల్సిన రూ.17,828 కోట్లు వస్తుందని రాష్ట్రం బడ్జెట్ ప్రతిపాదనల్లో పేర్కొంది. ఏపీకి యూనియన్ సర్దుబాటు నిధులు

## శాఖలవారీగా బడ్జెట్ కేటాయింపులు (రూ. కోట్లలో)

| శాఖ | కేటాయింపులు | శాఖ | కేటాయింపులు |
|---|---|---|---|
| ఆర్థిక | 49,749 | రెవెన్యూ | 3,560 |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి | 31,426 | ఆహార పౌర సరఫరాల సంస్థ | 3,117 |
| నీటిపారుదల | 26,885 | ఉన్నత విద్య | 3,001 |
| వ్యవసాయం, సహకారం | 26,831 | మైనారిటీ సంక్షేమం | 2,200 |
| రోడ్లు, భవనాలు | 22,260 | మహిళా, శిశు సంక్షేమం, | |
| షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి | 21,022 | సీనియర్ సిటిజన్లు | 2,131 |
| ప్రాథమిక విద్య-సెక్రటేరియట్ | 16,092 | పశుసంవర్ధక, మత్స్యశాఖ | 2,071 |
| విద్యుత | 12,727 | న్యాయశాఖ | 1665 |
| వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ | 12,161 | రవాణా శాఖ | 1644 |
| ప్రణాళిక విభాగం | 11,495 | సాధారణ పరిపాలన శాఖ | 1491 |
| పురపాలన, పట్టణాభివృద్ధి | 11,372 | పర్యావరణ-అటవీ-సాంకేతికత | 1471 |
| హోం శాఖ | 9,599 | యువత, పర్యాటక, సాంస్కృతిక | 1117 |
| వెనుకబడిన తరగతుల సంక్షేమం | 6,229 | కార్మిక, ఉపాధి కల్పన | 542 |
| పరిశ్రమలు-వాణిజ్యం | 4,037 | ఐటీ, కమ్యూనికేషన్లు | 366 |
| గిరిజన సంక్షేమం | 3,965 | లెజిస్లేచర్ | 168 |

## తెలంగాణ బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)

| | 2021-22 (వాస్తవ అంచనా) | 2022-23 (బడ్జెట్ అంచనా) | 2022-23 (సవరించిన అంచనా) | 2023-24 (బడ్జెట్ అంచనా) |
|---|---|---|---|---|
| రెవెన్యూ వసూళ్లు | 1,27,468 | 1,93,029 | 1,75,802 | 2,16,566 |
| మూలధన వసూళ్లు | 55,598 | 63,832 | 62,082 | 73,106 |
| మొత్తం వసూళ్లు | 1,83,067 | 2,56,861 | 2,37,884 | 2,89,672 |
| రెవెన్యూ వ్యయం | 1,36,803 | 1,89,274 | 1,72,822 | 2,11,685 |
| మూలధన వ్యయం | 28,874 | 29,728 | 26,934 | 37,525 |
| రుణాలు, అడ్వాన్సులు | 8,469 | 26,254 | 26,253 | 28,479 |
| రుణాల చెల్లింపు | 8,851 | 11,602 | 11,602 | 12,607 |
| మొత్తం వ్యయం | 1,82,997 | 2,56,858 | 2,37,611 | 2,90,296 |
| రెవెన్యూ మిగులు | -9,334 | 3,754 | 2,979 | 4,881 |
| ద్రవ్య లోటు | 46,639 | 52,167 | 42,647 | 38,234 |

రూ.6,500 కోట్లు కేటాయించిన నేపథ్యంలో తెలంగాణకు సర్దుబాటు నిధులు సమకూరతాయని అంచనా వేసింది. కేంద్ర పన్నుల వాటా రూ.21,470 కోట్లుగా పేర్కొంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ గత బడ్జెట్ కంటే 18.5 శాతం వృద్ధిరేటు మేరకు రాబడిని రూ.18,500 కోట్లుగా అంచనా వేసింది. ఎక్సయిజ్ రాబడిని గతం కంటే రూ.2,384 కోట్లు పెంచి రూ.19,884 కోట్లుగా అంచనా వేసింది. వాహనాల పన్నును గతం కంటే రూ.1,100 కోట్లు పెంచి రూ.7,512 కోట్లుగా పేర్కొన్నారు.

**రుణాల లెక్కలు**

వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎఫ్ఆర్‌బీఎం చట్ట పరిధిలో రూ.46 వేల కోట్ల రుణాలను తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. సొంత పన్నుల రాబడి, పన్నేతర రాబడి, కేంద్ర పన్నుల వాటా అంచనా రూ.1,75,306 కోట్లు కాగా మిగిలిన రూ.1.14 లక్షల కోట్ల మొత్తానికి రుణాలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్,

అంతర్రాష్ట్ర సర్దుబాటు నిధులపై ఆధారపడుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.40 వేల కోట్ల గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఆశించగా డిసెంబర్ వరకు రూ.7,700 కోట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా గరిష్టంగా రూ.10 వేల కోట్ల ప్రతిపాదనలు రూపొందించారు. భూముల అమ్మకం ద్వారా పన్నేతర ఆదాయంపై రాష్ట్రం ఆశలు పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.17,828 కోట్ల విద్యుత్ బకాయిలు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ అంచనాల్లో ప్రత్యేకంగా పేర్కొంది. చెల్లింపులు అంశంలో రూ.22,407 కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. వేతనాలు, పింఛన్ల కేటాయింపులు గత బడ్జెట్ కంటే పెరిగాయి.

## అప్పర్‌భద్ర ప్రాజెక్టు వల్ల సీమకు నష్టం

కర్ణాటకలో తుంగభద్రా నదిపై కడుతున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టును ఆపాలని కడప కలెక్టరేట్ వద్ద అఖిలపక్షం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవర శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. కేసీ కెనాల్, గండికోట, మైలవరం అన్ని ప్రాజెక్టులకూ తుంగభద్ర కీలకమన్నారు. ఎన్నికల రాజకీయం చేస్తూ యూనియన్ ప్రభుత్వం నిధులిస్తోందన్నారు. ఆ ప్రాజెక్టు వల్ల రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదముందన్నారు. సీమలో దాదాపు ఎనిమిది లక్షల ఎకరాల్లో పంట సాగవుతుందన్నారు. ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయాలకతీతంగా సీమ హక్కుల కోసం ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, సీపీఎం నేత నారాయణ, కాంగ్రెస్ నేత సత్తార్, ఆమ్‌ఆద్మీ పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష ఎన్నికలు జరపాలి

ప్రజాస్వామ్యంలో సాధ్యమైనంతగా ప్రత్యక్ష ఎన్నికలు మేలని, దీనివల్ల లాలూచీ ఎన్నికలు, ఏకగ్రీవాలకు ఆస్కారం ఉండదని, ప్రజాసమస్యల మీద నిజమైన ఆలోచన, నాయకత్వం పెరుగుతాయని లోక్‌సత్తా పార్టీ బొబ్బిలి నేత ఆకుల దామోదరరావు అన్నారు. స్థానిక ప్రభుత్వాల సారథులకు ప్రత్యక్ష ఎన్నిక జరపాలని డిమాండ్ చేశారు.




## 4వ ఏసియాన్-ఇండియా యువ సమ్మేళనం


**భారత విదేశాంగ శాఖ సౌజన్యంతో ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన 4వ ఏసియాన్-ఇండియా యువ సమ్మేళనంలో 'పాలన, రాజకీయం' అంశంపై డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖాముఖిలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి పదకొండు దేశాల నుంచి వివిధ రంగాల్లో నిపుణులైన యువ ప్రతినిధులు హాజరయ్యారు.**

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

**జూలై 2021** (తెలుగులో స్థూల అనువాదం)



**(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)**

**6.4. తృతీయ స్థాయి వైద్యానికి వ్యయ అంచనా**

దేశంలో మొత్తం సుమారు 2.87 లక్షల పడకలతో 810 జిల్లా ఆస్పత్రులు, 274 ప్రభుత్వ బోధనాస్పత్రులు ఉన్నాయి. ఒక్కో పడకపై ప్రస్తుత వ్యయం రూ.10 లక్షల దాకా అవుతోంది. ప్రతి కోటి జనాభాకు ఒక అధునాతన తృతీయ స్థాయి బోధనాస్పత్రిని ప్రతిపాదించటమైంది. ఎం.ఆర్.ఐ యంత్రాలు, పి.ఇ.టి స్కానర్లు మొదలైన అత్యాధునిక పరికరాలతో ఇది మల్టీ స్పెషాలిటీ తృతీయ స్థాయి వైద్యానికి మొదటి అంచె (టయర్ 1) కేంద్రంగా పనిచేస్తుంది. విద్య, శిక్షణ, పరిశోధన కూడా ఇందులో భాగంగా ఉంటాయి. ఒక్కో దాంట్లో 1000 పడకల చొప్పున, ఒక్కో పడకకూ వార్షిక వ్యయం రూ.25 లక్షల చొప్పున అటువంటి 140 ఆస్పత్రులకు రూ.21,000 కోట్లు అదనపు పెట్టుబడి అవసరమవుతుంది. మిగిలిన వైద్య కళాశాలలు, జిల్లా ఆస్పత్రులను రెండవ అంచె (టయర్ 2) తృతీయ స్థాయి ఆస్పత్రులుగా ఆధునీకరణ చేయవచ్చు. వనరుల్ని తగిన మేర సమీకరించి వీటిలో ఖర్చుకు ప్రయోజనం గరిష్టంగా ఉండేలా సేవలను అందించవచ్చు. రెండవ అంచె (టయర్ 2) ఆస్పత్రుల్లో 1.47 లక్షల పడకలకు, ఒక్కో పడకకు రూ.10 లక్షల చొప్పున, అదనంగా మరో రూ.14,700 కోట్లు అవసరమవుతాయి. అటువంటి మూడో దశ వైద్యానికి మొత్తం అదనపు వ్యయం రూ.35,700 కోట్ల వరకూ అవుతుంది. ఇందులో భారత్‌లో మంచి నాణ్యత గల జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల కోసం మూలధన పెట్టుబడులు, నిర్వహణకి అదనపు వ్యయం కూడా కలిసి ఉంటాయి. ఖరీదైన పరికరాలు, కొత్త సదుపాయాలను పి.ఎఫ్.ఐ నమూనాలో నెలకొల్పాలని ప్రతిపాదించినందున, మౌలిక వసతులకు ప్రారంభ నిధుల కొరత ఉండదు. పి.ఎఫ్.ఐల రుణ చెల్లింపుల భారాన్ని మొదటి అంచె (టయర్ 1) ఆస్పత్రుల్లో పడకకు ఏడాదికి రూ. 15 లక్షల చొప్పున, రెండవ అంచె (టయర్ 2) ఆస్పత్రుల్లో పడకకు ఏడాదికి రూ.10 లక్షల చొప్పున అదనపు నిధులకు అంచనా వేసిన కేటాయింపు నుండి నిర్వహించవచ్చు.

ప్రస్తుతం ఆస్పత్రిలో చేరిన ప్రతిసారీ రోగులు రూ.4,500 ఓ.ఓ.పి.ఇని భరిస్తున్నారు (పట్టిక 6.3ను చూడండి). ఈ వ్యయంలో అత్యధికం ప్రభుత్వ సదుపాయాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు, మందులు లేకపోవటం వల్ల అవుతోంది. వాటిని రోగులు వేరే ఎక్కడో కొనుక్కోవలసి వస్తోంది. ఒక్కసారి ప్రభుత్వాస్పత్రును తగిన స్థాయిలో ఆధునిక సాంకేతికత, మెరుగైన మందులు డిస్పెన్సరీలతో మెరుగుపరిస్తే ప్రభుత్వ రంగ ఆస్పత్రి సేవలకు ఓ.ఓ.పి.ఇ

నామమాత్రమవుతుంది. అప్పుడు, కొంత నామమాత్రపు రుసుమును, ఉదాహరణకు రెండవ అంచె (టయర్ 2) ఆస్పత్రిలో చేరితే రోజుకు రూ.300, మొదటి అంచె (టయర్ 1) ఆస్పత్రిలో రోజుకు రూ.500 చొప్పున రోగుల నుండి ఛార్జి తీసుకోవచ్చు. అటువంటి సహ చెల్లింపు.. ఆస్పత్రి సేవల మితిమీరిన వినియో గాన్ని అరికట్టటంతోపాటు, నాణ్యమైన సేవలు కావాలని రోగులు డిమాండ్ చేయటానికి, ఆస్పత్రుల వైపు నుండి జవాబు దారీతనానికి ఉపయోగపడుతుంది. అయితే, ప్రాథమిక, ద్వితీ య స్థాయి నమూనాల విషయంలో సూచించినట్లు, అటువంటి చెల్లింపు చేయలేని నిరుపేద రోగులకు సేవలను నిరాకరించ కూడదు. రోగి ఆర్థిక సామర్థ్యాన్ని నిర్ణయించటం, సహ చెల్లింపు చేయటానికి రోగి సామర్థ్యంతో సంబంధం లేకుంగా అదే చికిత్సను అందించటం వైద్యుని విచక్షణకు వదిలివేయాలి.

అందరికీ తృతీయ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తేవటం అనూహ్య ఖర్చుతో కూడినది. జనాభా ముఖచిత్రం మారుతుండటం, ఎన్.సి.డిలు పెరుగుతుండటం, పెరుగుతున్న వ్యాధి ప్రబలతలు, వ్యాధి చుట్టూ ఇతర (సెకండరీ) ఆరోగ్య సమస్యలు బహుళ అవయవాలకు సంబంధించి ఉండటం వల్ల తృతీయ స్థాయి చికిత్సలు ఎక్కువవుతూ మూడో దశ సేవలకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది. దీంతోపాటు వైద్య సాంకేతి కతలో శరవేగంగా జరుగుతున్న ఆవిష్కరణలు కూడా ఆరోగ్య సంరక్షణ ఖర్చుల్ని పెంచుతాయి. కాబట్టి, ప్రభుత్వ వ్యయంతో నడిచే తృతీయ వైద్య వ్యవస్థను ఖజానాపై భారం కాకుండా ఆచరణసాధ్యంగా, సమర్థవంతంగా ఉంచాలంటే పటిష్ఠమైన ప్రాథమిక, ద్వితీయ స్థాయి వైద్య నెట్‌వర్క్, అవసరాన్ని బట్టి అక్కడి నుండి ప్రభుత్వ మూడో దశ ఆస్పత్రులకు సిఫార్సు (రెఫరల్) చేసే ఏర్పాటు అవసరం. మూలధన పెట్టుబడుల కోసం పి.పి.పిలు మెరుగైన నష్ట ప్రమాదాల నిర్వహణకు, సేవల నాణ్యతను పెంచటానికి దోహదం చేస్తాయి. అని వార్యంగా, కాలక్రమంలో పెరుగుతున్న డిమాండ్‌తో తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది. వ్యవస్థను ఆర్థికంగా ఆరోగ్యకరంగా, సమర్థవంతంగా కొనసాగించటానికి క్రమం తప్పకుండా బేరీజు, దిద్దుబాటు కీలకం.

**(పట్టిక 6.4: తృతీయ స్థాయి వైద్య వ్యయం అంచనాలు)**

## అధ్యాయం 7

## నమూనాను అమల్లోకి తేవటం - యూనియన్, రాష్ట్రాల పాత్ర

### 7.1 సిఫార్సులు స్థూలంగా

ప్రభుత్వ ఖజానాకు తక్కువ ఖర్చు మాత్రమే అయ్యేలా, దేశంలోని పేదలు ఆరోగ్య భారంతో సంక్షోభంలో కూరుకుపోకుండా, అత్యుత్తమ ఫలితాలనిచ్చే వినూత్న ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యాలతో, పౌరులందరికీ నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించటం ఆరోగ్య రంగ సంస్కరణ లక్ష్యం. ఆరోగ్యం, ఆర్థిక ప్రగతి కలసికట్టుగా సాగుతాయి. అందువల్ల ఆరోగ్యం.. పాలనలో కీలక విభాగం. వనరుల సమర్థ కేటాయింపును సాధించటంలో ప్రయివేటు ఆరోగ్య మార్కెట్లు విఫలమైనందున, అందరికీ తక్కువ వ్యయంలో, అందుబాటులో ఆరోగ్యాన్ని అందించటంలో ప్రభుత్వ జోక్యం కీలకంగా మారింది. అయితే, ఎక్కువ వ్యయం వల్ల మెరుగైన ఫలితాలు వస్తాయనుకోలేం. తక్కువ వ్యయాలతో గణనీయమైన ఫలితాలను సాధించే రీతిలో వ్యయాన్ని చేయాలి. అంతిమంగా, ప్రాథమిక, ద్వితీయ, తృతీయ వైద్య సేవలు ఉచితంగా లేదా ఓ మోస్తరు రుసుముతో పౌరులందరికీ అందుబాటులోకి రావాలి. ఆధునిక వైద్యంలో నాణ్యమైన ఆరోగ్యాన్ని జనాభా మొత్తానికీ అందించటం ఓ పెద్ద సవాలు. ఎందుకంటే, సాంకేతికతలో ముందడుగులు, వైద్య పరిశోధన వల్ల కొత్త శాస్త్ర ఆవిష్కరణలతో ఆరోగ్య వ్యయాలు పెరుగుతూనే ఉంటాయి. కాబట్టి, పెట్టుబడులు వివేకవంతంగా ఉండాలి. పటిష్ఠమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నిర్మాణం మీద దృష్టి కేంద్రీకరించాలి. ఈ స్థాయిలో ఖర్చులు తక్కువగా, ఫలితాలు ఎక్కువగా ఉంటా యి. అదేసమయంలో ఎక్కువ ఖర్చులు, తక్కువ ఫలితాలు ఉండే తృతీయ స్థాయి వైద్యంలో వ్యయాల్ని అదుపు చేయాలి.

భారత్‌లో ఉన్న ద్రవ్య పరిమితుల దృష్ట్యా, ప్రయివేటు రంగ బలాల్ని సద్వినియోగం చేసే పి.పి.పి నమూనాలో, నాణ్యమైన సేవలకు భరోసానిచ్చే సమర్థవంతమైన జవాబుదారీ వ్యవస్థలతో ప్రభుత్వం ఆరోగ్య సేవలను అందించటం మాత్రమే మొత్తంగా ఆరోగ్య సేవల ఫలితాలను మెరుగుపరిచే అత్యంత వ్యయ ప్రయోజనకర వ్యూహం. పేదరికం ఉన్నా కూడా అదృష్టవశాత్తూ మన అభివృద్ధి స్థాయితో పోలిస్తే మనకు గొప్ప సానుకూలతలున్నాయి. వీటి వల్ల ఆచరణసాధ్యమైన కొద్దిపాటి ఖర్చుతోనే పటిష్ఠమైన, సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థను నిర్మించగలం. ప్రశ్నించగలిగిన, పరిజ్ఞానం ఉన్న వర్గాలు ఒక్కసారి ప్రభుత్వ ఆరోగ్య

సేవలను ఎక్కువగా వినియోగించుకోవటం మొదలు పెడితే, సేవల నాణ్యతను మెరుగుపరచటానికి, కొనసాగించటానికి ఒత్తిడి ఉంటుంది. ఆచరణలో ఈ సేవల్ని మొత్తం పేదలు, మధ్యాదాయ వర్గాల్లో ఎక్కువమంది సహా జనాభాలో 70-75 శాతం మంది వినియోగించుకుంటారని అంచనా. సంపన్న, వేతన వర్గాలు తమ ప్రాధాన్యతకు అనుగుణంగా ప్రయివేటు సేవలనే కొనసాగించే అవకాశముంది. కాబట్టి దేశంలోని ఆరోగ్య అవసరాల్లో అత్యధిక భాగాన్ని తీరుస్తున్న ప్రయివేటు రంగానికి ఆటంకం ఉండదు. ఇదే సమయంలో, దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య సేవల్ని బలోపేతం చేయటం వల్ల.. భరించలేని ఖర్చులతో కుటుంబాలు భారీ ఆర్థిక మూల్యాన్ని చెల్లిస్తూ పేద, మధ్యాదాయ వర్గాలు ప్రయివేటు రంగాన్ని ఆశ్రయించాల్సిన అవసరం ఉండదు. ఆరోగ్య ఫలితాలు కూడా బాగా మెరుగపడతాయి.

సమర్థవంతమైన ప్రాథమిక, ఫ్యామిలీ ఆరోగ్య వ్యవస్థ పునాదిపై రూపొందించిన ఒక ఆచరణసాధ్యమైన, సమగ్రమైన ఆరోగ్య వ్యవస్థ మొత్తంగా ఆరోగ్య ఫలితాల్ని మెరుగుపరిచి, ప్రభుత్వ ఖజానాకు గరిష్ట వ్యయ ప్రయోజకరంగా ఉంటూనే రోగులపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. ప్రతి వ్యక్తికీ అన్ని వైద్య అవసరాలకూ మొదటి సంప్రదింపు స్థానంగా ఉండే, వైద్యుల మధ్య పోటీని ప్రోత్సహించే, రోగులకు ఎంపిక అవకాశాన్నిచ్చే, ఆస్పత్రుల్లో సేవలకు విధిగా సిఫార్సు (రెఫరల్)ను అనుసరించేలా చేసే, ఆరోగ్య రికార్డుల ద్వారా అన్ని స్థాయిల ఆరోగ్య సేవల మధ్యా సమన్వయం చేసే, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ ఏర్పాట్లన్నిటినీ సంధానం చేసే ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ భారత్‌లో నాణ్యమైన ఆరోగ్య సేవలకు మౌలికావసరం. జనరిక్ ఔషధాలను సమర్థవంతంగా సరఫరా చేయటం, నాణ్యమైన డయాగ్నొస్టిక్ సేవలను అందించటం బలమైన, సమర్థవంతమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో కీలకాంశాలు. మందులను కేంద్రీకృతంగా సేకరించటం వల్ల ప్రజలకు తక్కువ ధరకు వాటిని అందించవచ్చు. అధునాతన డయాగ్నొస్టిక్ సేవలలో పి.పి.పి వల్ల ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయి. ఔషధాలు, రోగ నిర్ధారణ పరీక్షల్లో అటువంటి నూతన పద్ధతులు రోగికి సేవలను మెరుగుపరుస్తాయి, ఓ.ఓ.పి.ఇని తగ్గించి, రోగి సంతృప్తిని పెంచుతాయి. కేంద్రీకృత మందుల సేకరణ, సరఫరా, బ్రాండెడ్ డ్రగ్స్ బదులు ఔషధ పదార్థాల పేర్లతో ప్రిస్క్రిప్షన్, జనరిక్ మందుల సరఫరా, నాణ్యత, వ్యయనియంత్రణలకు లోబడి అవసరమైన చోట రోగ నిర్ధారణ సేవల ఉమ్మడి వినియోగం, ఔట్‌సోర్సింగ్ అవకాశమున్న చోటల్లా సేవలకు-ఫీజు నమూనాను ప్రవేశపెట్టి వృత్తినిపుణులకు ప్రోత్సాహకాలివ్వటం- ఈ పద్ధతులన్నిటినీ ప్రాథమిక నుండి తృతీయ దశ వరకూ అన్ని స్థాయిల్లో వ్యవస్థీకృతం చేయాలి.

మరోవైపు, ఎఫ్.పి సంప్రదింపుకి, మందులు, డయాగ్నొస్టిక్‌లకి నామమాత్రపు ఫీజుని తీసుకోవటం వల్ల రోగులకు ప్రశ్నించే అవకాశం లభిస్తుంది, వైద్యుడి నుండి మెరుగైన నాణ్యత గల సేవలను డిమాండ్ చేయగలుగుతారు, వైద్య సేవల మితిమీరిన వినియోగాన్ని కూడా నివారించవచ్చు, ప్రభుత్వానికేమో ఖర్చుకు తగ్గ ప్రయోజనం ఉంటుంది. నామమాత్రపు రుసుము అనగానే, సేవలను అందుకోవటంలో రోగులను నిరుత్సాహపరిచే అంశంలా అనిపిస్తుంది. అయితే, అందులో ప్రతికూలతలకంటే ప్రయోజనాలే ఎంతో ఎక్కువ. ప్రభుత్వ సదుపాయాల్లో మెరుగైన సేవల వల్ల ప్రజలు ప్రయివేటు వైద్యుల వద్దకు వెళ్లటానికి ఆసక్తి చూపరు. దీనివల్ల ఓ.ఓ.పి.ఇ తగ్గుతుంది. ప్రతిపాదిత ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థ నమూనా.. వ్యాధి ప్రబలత, మరణాలను గణనీయ స్థాయిలో తప్పిస్తుంది. ఔట్ పేషెంట్ అనిశ్చితి, ఆర్థికభారాల నుండి పేద, మధ్య తరగతి వర్గాలను విముక్తం చేస్తుంది. ద్వితీయ, తృతీయ స్థాయి ఆస్పత్రుల్లో మితిమీరిన రద్దీని, మితిమీరిన చికిత్సల్ని అనూహ్య స్థాయిలో అదుపు చేస్తుంది.

ఆస్పత్రి వైద్యానికి సంబంధించి, ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి ప్రస్తుత పి.పి.పి ఉమ్మడి నష్ట నివారణ భర్తీ (రిస్క్ పూలింగ్) నమూనాలను సంధానం చేసి, అందరు పౌరులకూ వర్తించేలా విస్తరిస్తారు. అయితే అత్యాధునిక, భారీ వ్యయంతో కూడిన తృతీయ స్థాయి చికిత్సల్ని క్రమంగా వీటిల్లో నుండి మినహాయించి, కొత్తగా మరిన్ని ద్వితీయ స్థాయి చికిత్సలను చేరుస్తారు. ఈ కార్యక్రమం కింద ద్వితీయ స్థాయి వైద్యాన్ని సి.హెచ్.సిలు, ఉప-జిల్లా ఆస్పత్రులు, చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంల ద్వారా పోటీ వాతావరణంలో, ద్వితీయ దశ సేవలను పొందటంలో రోగికి తగిన స్వేచ్ఛ ఉండేలా సమర్థవంతంగా అందించవచ్చు. అటువంటి నమూనా నాణ్యమైన ద్వితీయ స్థాయి సంరక్షణను ఖజానాకు సాధారణ వ్యయంతో అందిస్తుంది.

(ఇంకా ఉంది. . . )









'దేశ నిర్మాణంలో విద్యార్థి పాత్ర'
అంశంపై హైదరాబాద్
రాజ్‌భవన్ వద్ద ప్రభుత్వ
పాఠశాలలో నిర్వహించిన
ప్యానల్ చర్చలో ప్రజాస్వామ్య
పీఠం (ఎఫ్‌డీఆర్),
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు
డా॥ జయప్రకాష్ నారాయణ్



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th March, 2023 Posting Date 15 &16th of every month






# మహిళా సాధికారతకు సమగ్ర ఆరోగ్య విధానం

మన దేశంలో ఆరోగ్య వ్యవస్థ అధ్వాన్నంగా ఉండటం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువ నష్టపోతుండగా వారిలోనూ మహిళలు ఎక్కువ మూల్యం చెల్లిస్తున్నారు. ప్రభుత్వాల విధానపరమైన వైఫల్యంతో జ్వరం వంటి ప్రాథమిక వైద్యావసరాలకు కూడా ఔట్ పేషెంట్‌లుగా నేరుగా ఆస్పత్రికి వెళ్లటం ఆనవాయితీగా మారింది. ఏదైనా ఊరు నుంచి కాస్త గుర్తింపు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్ష చేయించుకోవటం, మందులు తీసుకోవటమంటే ఎంతోకొంత ఖర్చు, ప్రయాస తప్పదు. ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాలంటే ఇంకా ఖర్చుతో కూడుకున్న పని. దీంతో పలువురు మహిళలు తమకున్న అనారోగ్యాన్ని దాచిపెట్టటమో, బాధని దిగమింగుకోవటమో, డాక్టర్‌ని కలవటం వాయిదా వేయటమో చేస్తున్నారు. దీనివల్ల పలు సందర్భాల్లో వ్యాధి ముదిరి ఆస్పత్రి చికిత్సలకి భారీగా వెచ్చించాల్సి వస్తోంది. ఈ ఖర్చుని భరించలేక చికిత్స ప్రమాణాల్లో రాజీపడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బాగు చేశాం, డాక్టర్లని నియమించాం, హాజరవ్వాలని హుకుం జారీ చేశాం, ప్రయివేటు ప్రాక్టీస్‌ని నిషేధించాం అని ఎన్ని చెప్పినా జరుగుతున్న తీరు మాత్రం ఇదే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జీతాలిచ్చి ప్రభుత్వ డాక్టర్ల వ్యవస్థ పనిచేయదనేది మనకి అనుభవం నేర్పిన పాఠం. కాబట్టి ఎంతమంది రోగులను చూస్తే అంతమేర ప్రభుత్వం నిర్దిష్ట ఫీజు రూపంలో డాక్టర్లకు చెల్లించే ఏర్పాటు, ప్రజలు తమకు నచ్చిన డాక్టర్‌ని ఎంచుకునే అవకాశంతో గ్రామాలకు కేంద్రంగా ఉండే ప్రాంతాల్లో, చిన్న పట్టణాల్లో ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లను ఏర్పాటు చేయటం మెరుగైన పరిష్కారం. వైద్య పరీక్షల ల్యాబ్‌లు, మందులు అక్కడే ఉచితంగా అందించాలి. ఎప్పుడైతే ఆర్థిక భారం లేకుండా, పెద్ద దూరం వెళ్లాల్సిన అవసరం లేకుండా, విశ్వసనీయత కలిగిన, బాధలు చెప్పుకోగల వైద్యుని వద్ద నాణ్యమైన ఔట్‌పేషెంట్ సేవలు అందే అవకాశం ఉంటుందో.. అప్పుడు బాలికలు, మహిళలు పెద్దఎత్తున తమ ఆరోగ్య సంరక్షణ కోసం ముందుకొస్తారు. రక్తపోటు, డయాబెటిస్, గుండె జబ్బు, మూత్ర సంబంధ సమస్యలు, క్యాన్సర్ వంటి దీర్ఘకాల వ్యాధుల్ని, మహిళల ప్రత్యేక సమస్యల్ని నివారించటం, తొలి దశలోనే గుర్తించి వాటిని అదుపు చేయటం, భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా చేయటం సాధ్యమవుతుంది. అలాగే ఆస్పత్రి వ్యవస్థ సేవలు అవసరమైతే ఫ్యామిలీ డాక్టరే సిఫార్సు చేసి సమన్వయం చేస్తారు. దీనివల్ల ద్వితీయ, తృతీయ స్థాయిలో కూడా మెరుగైన వైద్యం అందుతుంది. ఆరోగ్యశ్రీ వంటి పథకాలు సద్వినియోగమవుతాయి. కాబట్టి, మహిళల ఆరోగ్యం అంటే కాన్పులు, పిల్లల సంరక్షణ అనే పరిధిని దాటి ఆలోచించి, వారి ఆరోగ్యానికి ప్రాథమిక స్థాయి నుంచి భరోసా ఇచ్చేందుకు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ప్రతిపాదించిన సమగ్ర ఆరోగ్య విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేయాలి. భారత్ 2047 సంవత్సర లక్ష్యాల్ని అందుకోవటంలో కీలకమైన మహిళా సాధికారత అప్పుడే సాధ్యం.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు
(మార్చి 8 - అంతర్జాతీయ మహిళా దినోత్సవం)

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**